అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 7-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 126 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

బ్రిటన్ రాజు చార్లెస్-3కి పట్టాభిషేకం



లండన్ : బ్రిటన్ రాజు చార్లెస్-3 పట్టాభిషేకం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిమంది ప్రజలు, విదేశీ అతిథుల మధ్య ఇక్కడ వెస్ట్ మినిస్టర్ అబెలో ఈ కార్యక్రమం జరిగింది. 70 ఏండ్ల తర్వాత బ్రిటన్‌లో రాజ పట్టాభిషేకం జరిగింది. గతేడాది సెప్టెంబరులో రాణి ఎలిజబెత్ కన్నుమూసిన తర్వాత అధికారికంగా బాధ్యతలు చేపట్టిన చార్లెస్ ఇప్పుడు ...5లో

హింసపై మౌనం ఎందుకు?

మోడీపై ప్రతిపక్షాల మండిపాటు



న్యూఢిల్లీ : కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఐదుగురు సైనికులు మరణించిన ఉదంతం పైన, మణిపూర్ హింసలో సుమారు యాభై మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనల పైన ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కర్నాటక ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్న ప్రధాని 30 ట్వీట్లు చేశారు. వీటిలో ఎక్కువ భాగం కాంగ్రెస్, జెడీ (ఎస్)పై విమర్శలు చేస్తూ సాగినవే. అయితే జమ్మూకాశ్మీర్, మణిపూర్ ఘటనలపై మాత్రం ఆయన పెదవి విప్పలేదు. తమకు అధికారం అప్పగిస్తే బజరంగ్‌దళ్‌పై చర్యలు తీసుకుంటామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను పదేపదే ప్రస్తావిస్తున్నారు. తన ఎన్నికల ప్రచార సభలలో 'జై బజరంగ్ బలి' అని నినాదాలు ...5లో

54కు చేరిన మృతుల సంఖ్య

- మణిపూర్ వ్యాప్తంగా సెక్యూరిటీ కట్టుదిట్టం
- భారీ ఎత్తున మోహరించిన భద్రతా బలగాలు

5లో..

ఆదివాసీ అస్థిత్వానికి ఆర్‌ఎస్‌ఎస్ ముప్పు

జనగణన సర్వేపత్రంలో ఆదివాసీ పదం చేర్చాలి

- హిందూత్వ ఎజెండాతో ఆదివాసీల్లోకి విరుద్ధభావాలు
- టీఏజీఎస్ మూడో మహాసభల్లో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకురాలు బృందాకరత్



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'అస్థిత్వ రాజకీయాలు ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో ఆయుధంగా మారాయి..హిందూత్వ ఎజెండాతో ఆదివాసీల్లోకి విరుద్ధ భావాలు చొప్పించి.. ఆదివాసీ అస్థిత్వానికి ఆర్‌ఎస్‌ఎస్ ముప్పుగా పరిణమించింది' అని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకురాలు బృందాకరత్ అన్నారు. కుల గణనలలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలకు మతంతో సంబంధం లేకుండా ప్రత్యేక కాలమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఆదివాసీల్లోకి ప్రవేశించిన విరుద్ధ భావాలను సంఘం, సిద్ధాంతం, సంఘర్షణలతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భద్రాచలం సమ్మక్క-సారలమ్మ ఫంక్షన్ హాల్‌లోని అమరవీరులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) మూడో మహాసభలను ఉద్దేశించి బృందాకారత్ ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అత్యంత ప్రమాదకరమని, దీనిని పోరాటాలతోనే నియంత్రించాలని సూచించారు. జార్ఖండ్‌లోని గిరిజనుల మధ్య విభేదాలు, మణిపూర్‌లో గిరిజనులు, ఆదివాసీల మధ్య అనైక్యత, తెలంగాణలో లంబాడి, ఆదివాసీల మధ్య చిచ్చు పెడుతూ ఆర్‌ఎస్‌ఎస్ పబ్బం గడుపుతోందని తెలిపారు. మేడారం సమ్మక్క, సారక్క జాతరలో ఆదివాసీ సంప్రదాయాన్ని రూపుమాపి హిందూ ఆచార వ్యవహారాలను ...5లో

టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాబూరావు, సచిన్





5లో..



పోడు పట్టాలు కొందరికేనా?

లక్షా 35వేల మంది కోసమే సీఎం తొలి సంతకం

అర్హులను గుర్తించటంలో ఆలస్యమే కారణం

"ఫిబ్రవరి నెలాఖరులో తప్పకుండా పోడు భూముల పంపిణీ ప్రారంభిస్తాం. పోడుభూములు ఇవ్వడమే కాదు, వాళ్లకు రైతుబంధు సదుపాయాన్ని కూడా కల్పిస్తాం. వాళ్లకు కరెంటు సదుపాయం కూడా కల్పిస్తాం. అవసరమైతే గిరి వికాసం కింద తీసుకుని నీటి సౌకర్యం కల్పిస్తాం." ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన అసెంబ్లీలో స్వయానా ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన ఇది.

ఇలా ప్రకటించి మూడు నెలలు పూర్తయింది. ఏప్రిల్30న మరో సారి బీఆర్ అంబేద్కర్ సచివాలయం ప్రారంభమైన సందర్భంగా పోడు భూముల ఫైలుపై సీఎం కేసీఆర్ తొలి సంతకం చేశారు. ఇందులో కేవలం లక్షా 35వేల మంది లబ్దిదారులకు 3.9లక్షల ఎకరాలు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పోడు సాగుదారుల్లో ఆందోళన మొదలైంది. పట్టాలు అందరికా? కొందరికేనా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు జాప్యంపై ఆందోళనలు.. ఎన్నికల వరకు సాగదీస్తారంటూ అనుమానాలు



ఎస్. వెంకన్న

2021 అక్టోబరులో ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టర్ల సదస్సు ఏర్పాటు చేశారు. అందులో ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో అటవీ హక్కుల గుర్తింపు (ఆర్ఓఎఫ్ఆర్) -2006 చట్టం ప్రకారం దరఖాస్తులు స్వీకరించారు. దాని ప్రకారం రాష్ట్రంలో 28 జిల్లాల నుంచి 4,14,353 దరఖాస్తులు ప్రభుత్వానికి అందినట్టు అధికారులు చెబుతున్నారు. వాటి ప్రకారం లెక్కిస్తే 12,46,846 ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉందని అంచనా వేశారు.

తెలంగాణలో 66 లక్షల ఎకరాల అటవీ భూములు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో పోడు భూములు 12 జిల్లాల్లో ఎక్కువగా ఉన్నట్లు అటవీ శాఖ సర్వేలో తేలింది. 80 శాతం భూములు భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్, ఆదిలా బాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం, నిర్మల్, వరంగల్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లోనే ఉన్నట్లు గుర్తించారు.

80శాతం భూములు అక్కడే..

కొలిక్కి రాని పంపిణీ వ్యవహారం..

అయితే నేటికి పోడు భూముల పంపిణీ వ్యవహారం కొలిక్కి రాలేదు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ గడిచినా గిరిజనులకు అటవీ భూములపై హక్కులు కల్పించే వ్యవహారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదు. పోడు భూముల విషయంలో కేసీఆర్ ఇలాంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి కాదు. అనేక సందర్భాలున్నాయి. 2021 ఏప్రిల్ 14న నాగార్జున సాగర్ ...5లో

చట్టం ప్రకారమైతే..

2006లో కేంద్ర ప్రభుత్వం రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్(ఆర్వోఎఫ్ఆర్) చట్టాన్ని తీసుకువచ్చింది. అటవీ హక్కుల చట్టంగా దీన్ని పిలుస్తున్నారు. అడవుల్లో ఎవరైతే బతుకుతున్నారో.. వారికి అడవి పై హక్కులు కల్పించేందుకు ఉద్దేశించిన చట్టమిది. వేటాడటం మినహా మిగిలిన హక్కులు కల్పించేలా చట్టం చేశారు. ఈ హక్కును వ్యక్తిగా లేదా గ్రూపుగా ఇస్తారు. దీని ప్రకారం 2005 డిసెంబరు 13లోపు ఆక్రమణలో ఉన్న భూములకే పట్టాలు ఇవ్వాలి. పది ఎకరాలకు మించకుండా పోడు భూములకు హక్కు కల్పించాలి. ఈ నిబంధనల ప్రకారం..పన్నెండున్నర లక్షల పోడు దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటికి పట్టాలు అందించాల్సిన బాధ్యత సర్కారుదే..



వివరాలు 5లో..

నిరుద్యోగుల ఆశలు నెరవేర్చని బీఆర్ఎస్

నిరుద్యోగ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ భరోసా : మాణిక్‌రావు ఠాక్రే

పచ్చని పంటల తెలంగాణ కావాల్నా.. మతం మంటల్లో ఉండే తెలంగాణ కావాల్నా..



నెత్తురు కారే రోజులు మళ్లీ వద్దు

- 15 లక్షలు వలసలు ఆపిన కేసీఆరే రాష్ట్రానికి దిక్కు
- మహబూబ్‌నగర్‌లో మంత్రి కేటీఆర్
- ఎన్నికలు వస్తున్నందున చాలామంది టూరిస్టులు వస్తుంటారని వ్యాఖ్య

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ విలేకరి

'నెర్రెలు బారిన నేలలో, నెత్తురు కారిన తెలంగాణలో ఇప్పుడిప్పుడే నీళ్లు వస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అవకాశం ఇస్తే నెత్తురు కారే రోజులు తీసుకొస్తారు. మతం మంటల్లో ఉండే తెలంగాణ కావాల్నా. పచ్చని పంటలతో ఉండే తెలంగాణ కావాల్నా. రైతులు, ప్రజలు ఆలోచించాలి' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్ సభలో కేటీఆర్ మాట్లాడుతూ ' నిరుద్యోగ మార్చ్ అని ఒక సన్నాసి ఇక్కడ మీటింగ్ పెట్టిండు. 2014లో మోడీ పెద్ద పెద్ద మాటలు చెప్పిండు. రూ. 15 లక్షలు ఇస్తానన్నాడు. కానీ ఇవ్వలేదు. రూ. 15 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేసిన మోడీ ...5లో

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పండి

సీపీఐ(ఎం) డిమాండ్



న్యూఢిల్లీ : పెద్ద ఎత్తున హింస, జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో పరిస్థితి ఆందోళనకర స్థాయిలో వుందని, అక్కడ తక్షణమే శాంతిని, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఇండ్లను ధ్వంసం చేశారు, తగలబెట్టారు, చర్చిలు, ఆలయాలతో సహా ఆస్తులపై దాడులు జరిగాయి. ఈ ఘర్షణల్లో అనేకమంది మరణించారు. సైన్యాన్ని, కేంద్ర పోలీసు బలగాలను రంగంలోకి దింపడంతో పరిస్థితులు కొంతవరకు అదుపులోకి వచ్చాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. అయితే ఇంకా చెదురుమదురుగా ఘర్షణలు జరుగుతునే వున్నాయి. ఇప్పటికీ ఇంకా ఇండ్లల్లోనే ప్రజలు బందీలుగా ...2లో

దుర్మార్గాలు... దుష్ప్రచారాలు

కేరళపై విషం చిమ్ముతున్న బీజేపీ నేతలు

- మోడీ నుండి ధన్‌కర్ వరకూ అదే తీరు

మానవాభివృద్ధి సహా పలు రంగాలలో రోల్‌మోడల్‌గా నిలిచిన కేరళ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చేయని ప్రయత్నం అంటూ లేదు. కర్నాటక ఎన్నికల ప్రచార సభలలో ప్రసంగిస్తున్న మోడీ రాష్ట్రంలో తమ ప్రభుత్వ హయాంలో సాధించిన విజయాలను ఏకరువు పెట్టడానికి బదులు 'ది కేరళ స్టోరీ' చిత్రాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. కేరళలోని 32 వేల మంది మహిళలను బలవంతంగా ఇస్లాంలోకి మార్చారని, ఆ తర్వాత వారు ఐసిస్ ఉగ్రవాద సంస్థలో చేరారని ఆ చిత్రంలో చూపారు. అయితే దీనిపై వివాదం చెలరేగడంతో '32 వేలు' అనే సంఖ్యను టీజర్ నుండి తొలగిస్తామంటూ చిత్ర నిర్మాతలు కేరళ హైకోర్టుకు హామీ ఇచ్చారు. అయినప్పటికీ ప్రధాని మోడీ తన దుష్ప్రచారాన్ని మాత్రం ఆపలేదు.

న్యూఢిల్లీ : మోడీ 'సుభాషితాలు' గురివిందగింజను గుర్తుకు తెస్తున్నాయి. 2002లో గుజరాత్‌లో జరిగిన మతోన్మాద హింసాకాండపై బీబీసీలో ప్రసారమైన డాక్యుమెంటరీ లింకును ట్విటర్, యూట్యూబ్‌లో పలువురు షేర్ చేయగా దానిని తొలగించాలంటూ మోడీ ప్రభుత్వం హుకుం జారీ చేసింది. దీనిని ప్రదర్శించిన కొందరు యూనివర్సిటీ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు సైతం తీసుకుంది. అయితే బీబీసీ డాక్యుమెంటరీ ఎత్తిచూపిన వాస్తవాలను మాత్రం మోడీ ప్రభుత్వం ఎన్నడూ ఖండించలేదు. అదే 'ది కేరళ స్టోరీ' సినిమా విషయానికి వస్తే '32 వేలు' అనే సంఖ్యను తొలగించేందుకు నిర్మాతలు అంగీకరించినా ప్రధాని మాత్రం తన విమర్శల జడివాన ఆపడం లేదు.

కర్నాటక ఎన్నికల ప్రచారంలో ఉన్న మోడీ కేరళ ప్రభుత్వంపై విషం చిమ్ముతుండటం వూచిత్రి. కేరళపై మోడీ ఆరోపణలు గుప్పించడం ఇది మొదటిసారి కాదు. 2016లో కేరళలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ కేరళ, సోమాలియాలలో పరిస్థితులను పోల్చారు. కేరళలో గిరిజన బాలల మరణాల రేటు సోమాలియాలో కంటే దారుణంగా ఉందని ఆరోపించారు. అయితే దీనిపై కేరళీయులు పెద్ద ఎత్తున ట్విటర్ వేదికగా మోడీపై విమర్శనాస్త్రాలు సంధించారు. మోడీ వ్యాఖ్యలకు ఆధారాలు లేవని తెలిపారు. ఇంత జరిగినా కేరళపై మాత్రం ప్రధాని మోడీ నిరాధారమైన విమర్శలు చేయడం మానడం లేదు.

కేరళ, సోమాలియా పరిస్థితులను పోలుస్తూ మోడీ చేసిన వ్యాఖ్యలపై బీబీసీ 2016 మే 11న ఓ వార్తను ప్రసారం చేసింది. 'సోమాలియాలో అధిక సంఖ్యలో పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రపంచంలో చిన్నారుల మరణాలలో సోమాలియాదే అగ్రస్థానం. మరోవైపు భారత్‌లో అతి తక్కువగా పిల్లల మరణాలు నమోదవుతున్న రాష్ట్రం కేరళ. ఇందుకు భిన్నంగా అబద్ధాలతో ఆ రాష్ట్ర ఓటర్లను ఆకర్షించేందుకు మోడీ చేసిన ప్రయత్నాలు చివరికి వికటించాయి' అని వ్యాఖ్యానించింది. 'ది కేరళ స్టోరీ' చిత్రం విషయంలోనూ మోడీ చేస్తున్న వ్యాఖ్యలు ప్రధాని పదవి హుందాతనాన్ని ఏ విధంగానూ పెంచబోవు.



మోడీకి ముందు దేశానికి ప్రధానిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ 2005 సెప్టెంబర్ 3న కేరళ అసెంబ్లీలో జాతి నేతల విగ్రహాలను ఆవిష్కరించిన సందర్భంగా చేసిన ప్రసంగంలో ఆ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రశంసించారు. ఆ ప్రసంగపాఠాన్ని మోడీ పరిశీలించడం మంచిదని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఒక్క మోడీ మాత్రమే కాదు... కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా నేను సైతం అంటూ కర్నాటక ప్రచారంలో కేరళపై విషంకక్కారు. 'కర్నాటక బీజేపీ చేతిలో మాత్రమే సురక్షితంగా ఉంటుంది. మీ సమీపంలోనే కేరళ ఉంది' అంటూ నర్మగర్భంగా మాట్లాడారు. దీనిపై సీపీఐ (ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ మండిపడ్డారు. అమిత్ వ్యాఖ్యలు బీజేపీ అసహనానికి నిదర్శనమని ఆయన చెప్పారు. బ్రిట్టాస్ రాసిన ఓ వ్యాసంపై కేరళకు చెందిన బీజేపీ నాయకుడొకరు చేసిన ఫిర్యాదు ఆధారంగా రాజ్యసభ ...5లో

ఉధృతమవుతున్న రెజ్లర్ల ఆందోళన

11 నుంచి 18 వరకు దేశవ్యాప్త నిరసనలకు ఎస్‌కేఎం పిలుపు

- మహిళా సంఘాలు సంతకాలు సేకరణ
- రెజ్లర్ల నిరసనపై బాలీవుడ్ నటుడు విద్యుత్ జమ్వాల్



న్యూఢిల్లీ : బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలనీ, న్యాయం చేయాలని రోడ్డెక్కిన రెజ్లర్లు శనివారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. గత 14 రోజులుగా జరుగుతున్న ఈ ఆందోళన రోజు రోజుకూ ఉఉధృతమవుతున్నది. రెజ్లర్లు, పోలీసుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ గురించి హోం మంత్రిత్వ శాఖ ఢిల్లీ పోలీసుల నుంచి వివరణ కోరింది. దానిపై ఢిల్లీ పోలీసులు హోం మంత్రిత్వ శాఖకు వివరించారు. మరోవైపు మైనర్ సహా ఐదుగురు రెజ్లర్ల వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేశారు.

రెజ్లర్ల నిరసనపై బాలీవుడ్ నటుడు విద్యుత్ జమ్వాల్ స్పందించారు. 'మొదట వారు ఈ దేశ పౌరులు. అవసరమైన సహాయం చేయాలి' అన్నారు. బాలీవుడ్ నటీ నటులు పూజా భట్, సోనూసూద్, గౌహర్ ఖాన్ స్వర భాస్కర్ తరువాత నటుడు విద్యుత్ జమ్వాల్ రెజ్లర్ల నిరసన గురించి మాట్లాడారు.

రెజ్లర్లకు హర్యానా హోం మంత్రి మద్దతు

ఆందోళన చేస్తున్న మల్లయోధులకు హర్యానా హోం, ఆరోగ్య మంత్రి శాఖ అనిల్ విజ్ తన మద్దతును ప్రకటించారు. 'ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు అత్యున్నత స్థాయిలో చర్చనీయాంశమైంది. నేను క్రీడా మంత్రిగా కూడా పనిచేశాను. కాబట్టి, ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు నా సానుభూతి, మద్దతు ఉంది. నేను మధ్యవర్తిత్వం వహించి ప్రభుత్వంతో మాట్లాడాలని వారు కోరుకుంటే, నేను అలా చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని అనిల్ విజ్ అన్నారు.

'ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారు?'

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం దాల్చడాన్ని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ప్రశ్నించారు. "ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు బ్రిజ్ భూషణ్ చాలా ముఖ్యం కనుక ఆయనను డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ పదవి నుంచి తొలగించమని భావిస్తున్నారు. మరి మీ నినాదం 'బేటీ బచావో' ఏమైంది. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని ఆయన ప్రశ్నించారు.

దేశవ్యాప్త ఆందోళనలకు ఎస్‌కేఎం పిలుపు

మహిళా రెజ్లర్లు ఆందోళనకు మద్దతుగా దేశవ్యాప్త నిరసనలకు ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఎస్‌కేఎం ఒక ప్రకటన విడుదల చేసింది. మోడీ ప్రభుత్వం జనవరిలో క్రీడాకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమైందని పేర్కొంది. ఈ నెల 7 (నేడు) పంజాబ్, హర్యానా, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు, వందలాది మంది రైతులతో మరోసారి జంతర్ మంతర్ వద్ద ఆందోళనను సందర్శించి, మల్లయోధులకు పూర్తి మద్దతునిస్తారని తెలిపింది. మే 11 నుంచి 18 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర రాజధానులు, జిల్లా ప్రధాన కార్యాలయం, తాలూకా ప్రధాన కార్యాలయంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపింది. బహిరంగ సభలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, ఆయనకు మద్దతుగా ఉన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తామని పేర్కొంది.

మహిళ సంఘాలు సంతకాలు సేకరణ

బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలంటూ జాతీయ మహిళా సంఘాలు ఉమ్మడి నిరసనలు, సంతకాల ప్రచారం నిర్వహించాయి. ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీఓడబ్ల్యూ, పీఎంఎస్, ఐజేఎం కోఆర్డినేషన్, ఏఐఎంఎస్ఎస్, ఏఐఏఎంఎస్ తదితర జాతీయ మహిళా సంఘాలు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఉమ్మడి నిరసనలు, ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చాయి. గ్రామాలు, బస్తీల్లో మహిళలు సమావేశాలు నిర్వహించి బీజేపీ మహిళా వ్యతిరేకతను బయటపెడతామని తెలిపాయి. లక్షల సంతకాలను సేకరించి జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రధానికి పంపనున్నట్టు పేర్కొన్నాయి.

గీతన్న బీమా పథకం విధివిధానాలు కార్మికులకు ఉపయోగపడాలి

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గీతన్న బీమా పథకం విధివిధానాలను కార్మికులకు ఉపయోగపడే విధంగా రూపొందించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్ గ్రేషియాను రూ.10లక్షలకు పెంచాలని కోరారు. గత 45 ఏండ్లుగా ఎక్స్‌గ్రేషియా విధానం అమలవుతున్నదని తెలిపారు. గీత కార్మికులు పోరాడి సాధించుకున్న ఈ హక్కును తొలగించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎక్స్ గ్రేషియా అంటేనే తక్షణ సహాయమని పేర్కొన్నారు. ఎక్స్‌గ్రేషియా ఆలస్యం అవుతుందనే పేరుతో బీమాకు మారుస్తున్నామని చెప్పడం సరైంది కాదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వాలు ఐసీఐసీఐ, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ సంస్థలకు ఇచ్చాయని గుర్తుచేశారు. గీతన్న బీమా పథకాన్ని సభ్యత్వం ఉన్న గీత కార్మికులందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన వారితో పాటు రైతులకు ఇచ్చినట్లే సహజ మరణాలకు కూడా బీమాను వర్తింపజేయాలని కోరారు. భూమి ఉన్న గీత కార్మికులకు వృత్తిలో ప్రమాదం జరిగితే రైతు బీమాతో పాటు గీతన్న బీమాను వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. . ఎక్సైజ్ విధానంలో నిర్ణయించినట్టు వయస్సు 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు ఉన్నవారికి బీమా బాధ్యతను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

కేరళలో పేదల కల సాకారం

- 20 వేల మందికి గృహవసతి

కొచ్చి : కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తాను పేదల పక్షపాతినన్న వాస్తవాన్ని మరోసారి నిరూపించుకుంది. నివసించడానికి ఇండ్లు లేని 20,073 కుటుంబాలకు గూడు కల్పించింది. దీంతో 'లైఫ్' మిషన్‌లో భాగంగా ఇప్పటి వరకూ 3,42,224 మంది లబ్దిదారులకు గృహవసతి కల్పించినట్లయింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ గృహవసతి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 2016లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

రాష్ట్రంలో మొత్తం 4.32 లక్షల మందికి పక్కా ఇండ్లు లేవని, వీరిలో 1.58 లక్షల మందికి భూమి కూడా లేదని రాష్ట్ర ప్రణాళికా బోర్డు అంచనా వేసింది. వీరిలో 44 వేల మంది శిథిలమైన ఇండ్లలో జీవిస్తున్నారు. బోర్డు అంచనాల తర్వాత లబ్దిదారుల సంఖ్యను 4.72 లక్షలకు పెంచారు. ఈ నెల 4న పేదలకు పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చిన సందర్భంలోనే 41,439 కొత్త ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కూడా జరిగింది. సొంతింటి కలను చాలా మంది సాకారం చేసుకోలేకపోతున్నారని, రాష్ట్రంలో సొంత ఇల్లు లేని వారంటూ ఉండకూడదన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి తెలిపారు. 2022కు ముందే ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్పటికీ కోవిడ్ కారణంగా జాప్యం జరిగింది. రాష్ట్రంలో 68,568 ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నదని స్థానిక సంస్థల శాఖ మంత్రి, లైఫ్ మిషన్ ఛైర్మన్ ఎంబీ రాజేష్ తెలిపారు. ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 16,557.46 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, ప్రాజెక్టులు తమ ఘనతేనంటూ కొందరు బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకోవడాన్ని ఆయన ఖండించారు. వివిధ పథకాలలో రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఆయన వివరించారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పండి

(మొదటిపేజీ తరువాయి)

వుండిపోతున్నారు. బయటకువచ్చే పరిస్థితులు లేవు. అల్లర్ల కారణంగా వేలాదిమంది నిర్వాసితులయ్యారు. ఈ పరిస్థితులను ముందుగానే ఊహించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. శాంతి భద్రతల పరిరక్షణలో జోక్యం చేసుకోవడంలో కూడా జాప్యం జరిగిందని పేర్కొంది. అడవుల రక్షణ పేరుతో కొండ ప్రాంతాల్లోని ప్రజలను పెద్ద ఎత్తున ఖాళీ చేయించేందుకు, బయటివారిని అక్కడ నుంచి తొలగించేందుకు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విధానం ప్రజల్లో భయాలను కలగచేసి, కొన్ని కొండ ప్రాంత జిల్లాల్లో విస్తతమైన నిరసనలకు దారి తీసిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇంతటి హింసాత్మక ఘర్షణలకు దారి తీసిన అంశాలను పరిష్కరించడానికి ముందుగా, రాష్ట్రంలో శాంతిని, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడమే తక్షణమే కర్తవ్యమని పొలిట్ బ్యూరో స్పష్టం చేసింది. కేంద్రం సాయంతో, రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులైన వారందరికీ తిరిగి వారి స్థలాల్లో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలనికోరింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమా వేశాన్ని ఏర్పాటు చేయాలని, అప్పుడే పరిస్థితులను ఎదుర్కొనడానికి ఐక్య ప్రయత్నాలు, కృషి జరుగుతాయని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది.

జీతం ఖాతాని కార్పొరేట్ అకౌంట్లుగా మార్చుకోండి

- రూ.62 లక్షల 'ఉచిత ప్రమాద బీమా సౌకర్యం' పొందండి

సింగరేణి కార్మికులకు ఆ సంస్థ డైరెక్టర్ బలరాం సలహా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణిలో పనిచేసే కార్మికులు, అధికారులందరూ తమ బ్యాంకు అకౌంట్లను 'కార్పోరేట్ శాలరీ అకౌంట్'గా మార్చుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) ఎన్ బలరామ్ శనివారం నాడొక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రూ. 62 లక్షల 'ప్రమాద బీమా స్కీమ్' ప్రయోజనాలు పొందవచ్చనీ, దీనికోసం ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరంలేదని వివరించారు. సింగరేణి తమ సంస్థలోని 44 వేల మంది ఉద్యోగులకు ప్రతినెలా దాదాపు రూ.300 కోట్ల జీతాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు ఇతర బ్యాంకుల సేవింగ్స్ అక్కౌంట్స్ ద్వారా చెల్లిస్తున్నదని తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఉన్న అధికారులు, కార్మికులకు మరింత లబ్ది చేకూర్చేందుకు ఉచితంగా 'ప్రమాద బీమా స్కీమ్' అమల్లోకి తెచ్చామన్నారు. ఈ స్కీమ్‌కు అర్హత సాధించాలంటే సేవింగ్స్ అకౌంట్ ఉన్నవారంతా కార్పోరేట్ శాలరీ అకౌంట్‌గా మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 44వేల బ్యాంక్ అకౌంట్లలో దాదాపు 30వేల మంది అకౌంట్లను బ్యాంకులు 'కార్పోరేట్ శాలరీ అకౌంట్' ఖాతాలుగా మార్చాయని వివరించారు. మిగిలిన వారు కూడా తమ ఖాతాల్ని మార్చుకోవాలని సూచించారు.

తెలంగాణ విద్యార్థుల కోసం ప్రత్యేక విమానం

- మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మణిపూర్‌లో నెలకొన్న శాంతిభద్రతల సమస్య నేపథ్యంలో అక్కడి తెలంగాణ విద్యార్థుల్ని తరలించేందుకు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దానితో పాటు మణిపూర్‌లోని తెలంగాణ ప్రజలకు సేవలు అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 250 మంది విద్యార్థులు ఇంఫాల్ సహా పలు విద్యాసంస్థల్లో చదువుతున్నారు. వారికోసం అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌కు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేశారు. ఈ విమానం ఆదివారం ఉదయం ఇంఫాల్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

మణిపూర్‌లో తెలంగాణ వారికి రాష్ట్రప్రభుత్వం భరోసా

- నేడు రాష్ట్ర పౌరులను తరలించనున్న ప్రత్యేక విమానం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మణిపూర్‌లో చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో అక్కడ నివసించే రాష్ట్ర పౌరులు, విద్యార్థుల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటు న్నదని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ తెలిపారు. ముఖ్యంగా, అక్కడ నివసి స్తున్న తెలంగాణ పౌరులను తరలించడానికి ఆది వారం ఉదయమే ప్రత్యేక విమానాన్ని కూడా ఏర్పాటు చేసి నట్టు డీజీపీ తెలిపారు. అక్కడ శాంతి భద్రతల పరంగా ఏదేనీ సమస్యలను ఎదుర్కొంటున్న తెలంగాణ విద్యార్థులు, ఇతర పౌరులు వెంటనే సాయం కోసం 7901643283 నెంబర్‌ను సంప్రదించాలనీ, ఈ నెంబర్ నుంచి వచ్చే కాల్స్‌కు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఐజీ బి.సుమతి స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. అలాగే ఎప్పటికప్పుడు అక్కడి చీఫ్ సెక్రెటరీతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంప్రదిస్తూ తగిన సహాయక చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

బిల్లుల్ని తిరస్కరించడం సరికాదు :టీఎస్‌టీఎఫ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాలు, ఇతర బిల్లుల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని పున్హ సమీక్షించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కావలి అశోక్ కుమార్, కటకం రమేష్ కోరారు. ట్రెజరీకి సమర్పించిన బిల్లులు కొన్ని నెలలుగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో పెట్టి ఏక మొత్తంగా రిజెక్ట్ చేయడం సరైందికాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఖర్చులు, కుటుంబ ఖర్చులు, పిల్లల ఉన్నత విద్యాభ్యాసం, వివాహ ఖర్చులు, గృహ నిర్మాణ సంబంధించినటువంటి అవసరాల కోసం సమర్పించిన బిల్లులను తిరస్కరించి...కొత్త టోకెన్లు తీసుకోవాలని చెప్పడం ఉపాధ్యయులను ఆవేదనకు గురి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి బిల్లులన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

అమర జవాన్ అనిల్‌కు కన్నీటి వీడ్కోలు

- అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన జనం
- సైనిక లాంఛనాల మధ్య ముగిసిన అంత్యక్రియలు

నవతెలంగాణ - గంగాధర/ బోయినిపల్లి

జమ్ముకాశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన జవాన్ పబ్బాల అనిల్ భౌతికకాయం శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని తన స్వగ్రామమైన మల్కాపూర్ గ్రామానికి చేరుకుంది. అనంతరం ఆర్మీ అధికారుల నేతృత్వంలో శనివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో పవన్ కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అంతమయాత్రలో పాల్గొని అనిల్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంతిమయాత్ర కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ వరకు కొనసాగింది. మధురానగర్ చౌరస్తా మీదుగా మల్కాపూర్ గ్రామం వరకు అంతిమ యాత్ర కొనసాగుతుందనే సమాచారంతో చూసేందుకు అనేక గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధురానగర్ చౌరస్తా ప్రధాన కూడలి వద్దకు భారీగా చేరిన ప్రజలు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. జై, జై జవాన్.. జై కిసాన్ అంటూ నినదించారు. అనిల్ భౌతికకాయంపై పూలు చల్లుతూ కుటుంబసభ్యులు, జనం కన్నీటి విడ్కోలు పలుకుతూ నివాళులు అర్పించారు.



వీర జవాన్ అనిల్ మృతికి సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీర జవాన్ అనిల్ మృతికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సంతాపాన్ని ప్రకటిం చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ పి అనిల్ జమ్మూకాశ్మీర్ హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనిల్ మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. అనిల్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వీర జవాన్ల త్యాగాల వల్ల దేశ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా జీవించగలుగు తున్నారని తెలిపారు. అలాంటి వీరజవాన్లందరికీ జోహార్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నుంచి చేరికలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లోకి మహారాష్ట్ర నుంచి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఆ రాష్ట్రానికి చెందిన మచ్చీంద్ర గుణ్వంతరావు బీఆర్ఎస్‌లో చేరారు. లాతూర్ జిల్లా ఉద్గిర్ నియోజకవర్గానికి చెందిన గుణ్వంతరావు 2009లో ఉద్గిర్ నియోజకవర్గం నుంచి ఎన్సీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా లాథూర్ పార్లమెంటరీ స్థానం నుంచి పోటీచేసి 4 లక్షల ఓట్లు సాధించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆపార్టీలో చేరినట్టు గుణ్వంతరావు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆయకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్సీపీ పార్టీకి చెందిన రాయగడ్ జిల్లా నివాసి రాహుల్ ఎస్ సాల్వి, మ హద్ తాలూకకు చెందిన సిద్ధార్థ్ హటే, రాయగడ్ థానే కొంకణ్ ప్రాంతానికి చెందిన ప్రకాశ్ కె తొంబారె, రాయగడ్‌కు చెందిన సామాజిక కార్యకర్త మునాఫ్ అమిర్ అధికారి, సౌత్ ముంబైకి చెందిన దేవేంద్ర సోలంకి, నార్త్ ముంబైకి చెందిన మాజీ కార్పొరేటర్ పీఎస్ నాగ్రా జన్ బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ సీఎం కేసీఆర్ ఆహ్వానం పలికారు.

కేంద్రం నుంచి సెస్ తీసుకోని రాష్ట్రం మనదే

- 2022-23లో రూ.72,564 కోట్లు వసూలు చేయడం అభినందనీయం
- ఈ ఏడాది లక్ష్యం రూ.85,413 కోట్లు
- స్టేట్‌ఓన్ రెవెన్యూ గ్రోత్‌రేట్‌లో మనమే టాప్ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం నుంచి సెస్ తీసుకోని ఏకైక రాష్ట్రం మనదేననీ, తెలంగాణ జీరో సెస్ టేకింగ్ స్టేట్ ఇన్ ఇండియాగా నిలిచిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. వాణిజ్య పన్ను ల శాఖ 2022-23లో రూ.72,564 కోట్ల పన్నుల ను వసూలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. అందు కోసం కృషిచేసిన వాణిజ్య పన్నుల శాఖలోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అభినందనలు తెలిపారు. శని వారం హైదరాబాద్‌లో వాణిజ్య శాఖ ఆదాయ వనరు లు పెంపుదలపై నిర్వహించిన మేధోమధన సదస్సు కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కార్య క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కమర్షియల్ టాక్స్ కమిషనర్ నీతూ ప్రసాద్, రాష్ట్ర కమర్షియల్ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోని ఏ రాష్ట్రంలో లేనట్టుగా ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదనీ, దానికి ధనాన్ని సమీకరించడంలో వాణిజ్య పన్నుల శాఖదే పెద్ద చేయి అని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఆశాఖకు ఇచ్చిన బడ్జెట్ లక్ష్యం రూ. 85,413 కోట్లను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వాణిజ్యపన్నుల శాఖ పనితీరును సీఎం కేసీఆర్ అనేక సదస్సుల్లో మెచ్చుకున్న విష యాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో కొనసాగుతు న్న అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అను సరిస్తున్నదని వివరించారు. ఎనిమిదేండ్లలో స్టేట్ ఓన్ రెవెన్యూ గ్రోత్ రేట్‌లో దేశంలోనే మన రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో ఉందని చెప్పారు. పారదర్శక పరిపాలన అందించినప్పుడే ఇలాంటి రెవెన్యూ గ్రోత్ రేట్ సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో కమర్షియల్ ట్యాక్స్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. 2014లో రూ.1,12,162 ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం, 2022లో రూ.2,65,942కు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొలమానం అని చెప్పారు. దక్షిణ భారతదేశంలో వ్యవసాయ వృద్ధిరేట్లో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందన్నారు. వ్యవసాయం, సంక్షేమం, ఐటీ, ఇలా అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతున్నదని చెప్పారు. సదస్సులో పాల్గొన్న 158 మంది ఆఫీసర్లు 6 టీములుగా ఏర్పడి, విభిన్న రంగాల్లో పన్ను ఏ విధంగా ఎగవేతకు గురవుతుందో వెలికి తీసి తమ అనుభవాన్ని, ఆలోచనలన్నీ చట్టంలో ఉన్న సూక్ష్మాలని రంగరించి ఒక ప్రణాళికను తయారుచేసి ఇస్తున్నందుకు అభినందనలు తెలుపుతున్నానని చెప్పారు.

రైల్వేస్టేషన్లలో చిరుధాన్యాల స్టాల్స్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్, హైదరాబాద్, బేగంపేట్ రైల్వే స్టేషన్లలో 'వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్' కింద చిరు ధాన్యాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. శనివారం నైన్ న్యూట్జ్ మైక్రో స్టార్టప్ సంస్థ సికింద్రాబాద్ స్టేషన్ ప్లాట్ ఫారమ్ నెంబర్ పదిలో చిరు ధాన్యాల ఆధారిత స్వీట్లు, స్నాక్స్ స్టాల్‌ను ప్రారంభిం చింది. ఎమ్ ఫర్ మిల్లెట్స్ అనే మరొక మైక్రో స్టార్టప్ సంస్థ బేగంపేట స్టేషన్‌లోని రెండో నెంబర్ ప్లాట్ ఫారమ్‌లో ప్రాచీన కాలపు ఆహార పదార్థాల విక్రయశాలను ప్రారంభించింది.

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్‌పై సర్కారు దృష్టి

సీఎం ఆదేశాలతో యంత్రాంగంలో కదలిక

- పెరగనున్న అంచనా వ్యయం
- ఏడేండ్లుగా కొనసాగుతున్న నిర్మాణం
- రీ-డిజైన్‌తో ఆర్థికభారం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు ఈ ప్రాజెక్టును కదిలించేందుకు సీఎం కేసీఆర్ సర్కారు సన్నాహాలు చేస్తున్నది. దీని నిర్మాణం ఏడేండ్లుగా కొనసాగుతున్నది. న్యాయ, సాంకేతిక సమస్యలతోపాటు భూసేకరణ, అంచనా వ్యయం, పునరావాసం, ఏపీతో వివాదం తదితర ఇబ్బందులతో ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతున్నది. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం మరునాడే సీఎం ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. అందులో ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్‌పై చర్చించారు. ఈనేపథ్యంలోనే మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి స్మితాసభర్వాల్ నార్లపూర్ లిఫ్ట్ పనులను పరిశీలించారు. ఈ లిఫ్ట్ నిధుల కొరత ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.

2015లో శంకుస్థాపన

2015, జూన్ 11న మహబూబ్‌నగర్ జల్లా బూత్పూర్ మండలం కరివెన గ్రామంలో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో రీ-డిజైన్ చేసిన సంగతి తెలిసిందే. జూరాల ముందు భాగం నుంచి కాకుండా శ్రీశైలం ప్రాజెక్టు ముందుభాగం నుంచి నీటిని ఎత్తిపోయడానికి (లిఫ్ట్) చేయడానికి ఉద్దేశించారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు ముందుభాగంలో రేగుమానుగడ్డ వద్ద కల్వకుర్తి ఎత్తిపోతల పథక ప్రాంతానికి ఉత్తరం వైపున పాలమూరు ఎత్తిపోతలకు సర్కారు శ్రీకారం చుట్టిన విషయమూ విదితమే. అక్కడి నుంచే కొయిల్ సాగర్‌కు మూడు టీఎంసీల నీళ్ల ఇవ్వాలి. జూరాలకు మొదట పంచెదిన్నెలపాడు లిఫ్ట్ ద్వారా కొయిల్‌సాగర్‌కు నీళ్ల ఇచ్చేం దుకు ప్రణాళిక రూపొందిం చారు. దీంతో ఈ లిఫ్ట్ మూలంగా ఏడు లక్షల నుంచి 12.30 లక్షల ఎకరా లకు ఆయకట్టు పెరి గిందని అధికారిక అంచనా. మహ బూబ్‌నగర్‌లో 4,13, 167 ఎకరాలు, వికారాబాద్‌లో 3,22,375, నాగర్‌కర్నూల్‌లో 1,00,014, రంగారెడ్డిలో 3,63, 900, నల్లగొండలో 30,000, వనపర్తిలో 44 ఎకరాలు ఉంది.

వివాదం

2003లో కృష్ణా మిగులు జలాల పంపిణీ కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ నియమించిన సంగతి తెలిసిందే. 2010లో ఆ ట్రిబ్యునల్ మధ్యంతర తీర్పును వెలువరించింది. ఇది న్యాయసమ్మతంగా లేదని అప్పుడే తెలంగాణ ప్రభుత్వం చెప్పింది. 2010లో ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. 2014లో తెలంగాణ ఆవిర్భావం జరిగింది. తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యలు పరిష్కారం కావాల్సి ఉంది. సుప్రీంకోర్టులో కేసు ఉపసంహరించు కుంటే సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన కేంద్రం, ఆ సంగతిని విస్మరిస్తున్నది. కృష్ణాజలాల పంపిణీ కోసం కొత్త ట్రిబ్యునల్‌నూ ఏర్పాటు చేయలేదు. ఇది పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది.

భూసేకరణ

ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 26,851 ఎకరాల భూమిని సేకరించాలి. ఇందులో పట్టా భూమి 21375 ఎకరాలకుగాను 15,571 ఎకరాలు, ప్రభుత్వ భూమి 5,475 ఎకరాలకు 4,646 ఎకరాలను సేకరించారు. ఇదొక సమస్యగానే ఉంది. రియల్‌ఎస్టేట్ విస్తరించడంతో భూముల రేట్లు మార్కెట్లో బాగా పెరిగాయి. ఈ ప్రాజెక్టు మూలంగా మూడు గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరో 30 తండాలు ప్రభావితమయ్యాయి. 2,481 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఈ సందర్భంగా 11,025 మంది నిర్వాసితులవుతున్నారు. వీరికి రూ.80 కోట్లతో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామని సర్కారు హామీనిచ్చింది.

అంచనా వ్యయం.. ప్రస్తుత స్థితి

అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 40 వేల కోట్లు ఖర్చు పెట్టారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకారం రూ.49,595 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వ లెక్క.. గత 2019, మార్చి నాటికి రూ.4,872 కోట్లు ఖర్చయింది. 2020-21లో రూ.800 కోట్లు వ్యయం చేశారు. మొత్తం ఇప్పటిదాకా రూ.5,672 కోట్లు వ్యయం చేశారు. 2021-22లో రూ.960 కోట్లు ఇచ్చారు. కాగా ఈ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కాదని అంటున్న వారూ లేకపోలేదు. కాగా ప్రస్తుతం ఖర్చు రూ. 60వేల కోట్ల అంచనా వ్యయం ఎక్కువ కావడంతో పాటు 2,800 మెగావాట్ల విద్యుత్ అవసరమని చెబుతున్నారు.

పక్కాగా చేపట్టాలి

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ పనులు పక్కాగా చేపట్టాలని సాగునీటి రంగం నిపు ణులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్‌తో పాటు ఏదుల, కేపీ లక్ష్మీపురం రిజర్వాయర్ల పనులు కూడా పూర్తి చేయడానికి నిధులు కేటాయిం చాలని కోరారు. ఎన్జీటీ నుంచి అనుమ తులు తెచ్చుకోవాలి కృష్ణా బోర్డు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు.

- సారంపల్లి మల్లారెడ్డి

రీ-డిజైన్‌తో..

మొదటి ప్రాజెక్టును రీడిజైన్ తో 165 అడుగుల ఎత్తుకు అదనంగా నీటిని తోడాల్సి వస్తున్నది. 75 మీటర్లు ఉండాల్సిన ఆయ కట్టు కాలువ (రిజర్వా యర్ల లింకేజీ కాలు వలు)103 కిలో మీటర్ల దూరం పెరి గింది. పైగా శ్రీశైలం లో 840 అడుగుల నీరు ఉన్న ప్పుడే ఈ పథకంతో ఉప యోగం. ప్రస్తు తం శ్రీశైలం నుంచి అన్ని అవసరాలకు గాను రోజుకు ఏనిమిది టీఎంసీలు వాడుకుం టున్నారు. ఏడాదిలో రెండు, మూడు నెలలు మాత్రమే ఈ పథకానికి నీటి లభ్యత ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్‌కు నీరు రావడానికి జూరాల ద్వారానే సాధ్యం. అక్కడి నుంచి 70 నుంచి 80 టీఎంసీల నీటిని తోడడానికి అవకాశాలున్నాయి. ఈ ప్రాజెక్టు చిన్నదేకానీ ఎగువ నుంచి నీరు వస్తుంది. పైగావరదలు వచ్చినప్పుడు జూరాల ద్వారా ఇతర ప్రాజెక్టులనూ నింపుకోవచ్చు. అంచనా వ్యయం కూడా రూ. 40 వేల కోట్లల్లో రూ. 10 వేల కోట్లు తగ్గుతుంది కూడా. గతంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను రీ-డిజైన్ చేయడం మూలనా రాష్ట్ర ప్రజలపై వేల కోట్లు అదనపు భారంపడే అవకాశముందని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక విషయాలు పట్టించుకోకుండా ప్రభుత్వాలు ఏంవిధంగా కావాలని కోరితే ఆ విధంగా ఇంజినీర్లు డీపీఆర్లను తయారుచేయడం మూలంగా నష్టం జరుగుతున్నది.

వ్యాప్‌కోస్ ఇచ్చిన నివేదికే ఇందు సాక్ష్యం. ఆ రిపోర్టుల్లో శాస్త్రీయత లేదు. సాగునీటిరంగ నిపుణులూ ఇదే చెబుతున్నారు. గతంలో 50 శాతానికిపైగా నిర్మాణం జరిగిన ప్రాజెక్టులనూ రీ-డిజైన్ చేయడం పట్ల అభ్యం తరాలు వ్యక్తమవుతు న్నాయి. బడ్జెట్‌లో కేటాయింపులే గాక ఆయా సంస్థల ద్వారా ప్రాజెక్టుల కోసం తెచ్చిన అప్పును లెక్కవేస్తే రూ.80 వేల కోట్లు. మహబూబ్ నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాల కింద కాలువల పనులను చేపట్టకపోవడం, ప్రాజెక్టులను పూర్తిచేయక పోవడం మూలంగా జిల్లా ప్రజలకు సాగునీరు ఇస్తామన్న ప్రకటనలు కాగితాలకే పరిమతమయ్యాయి. నిర్మాణంలోనున్న ప్రాజెక్టుల కాలాన్ని పొడిగించకుండా నిర్దిష్ట సమయంలోగా పూర్తిచేసి రైతులు, ప్రభుత్వానికి ఆదాయం రాబట్టాల్సి ఉంది.

మూడు జిల్లాలు..టీఎంసీలు

ఈ ప్రాజెక్టు లక్ష్యం 12.50 లక్షల ఎకరాలను ఆయకట్టుగా స్థిరీకరించడం. మూడు జిల్లాల నీటి అవసరాలు తీర్చే ఈ ప్రాజెక్టు సామర్థ్యం 120 టీఎంసీలు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 30 టీఎంసీలు, రంగారెడ్డికి 20 టీఎంసీలు, మహబూబ్‌నగర్‌కు 70 టీఎంసీలు కేటాయించారు. పాలమూరు, కల్వకుర్తి, జూరాల మీద ఉన్న నెట్టెంపాడు కుడివైపు, బీమా-1 ఎడమ వైపు, బీమా-2 ఎడమవైపు ఉన్నాయి.

ఎత్తిపోతలు..ఆయకట్టు

- సముద్ర మట్టానికి 250 మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేసి నార్లాపూర్ రిజర్వాయర్‌కు 340 ఎత్తుతో ప్రాజెక్టును నిర్మించాలి. రిజర్వాయర్ నీటి నిల్వ తొమ్మిది టీఎంసీలు.
- నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్ 445 మీటర్లు, 4.5 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మించాలి
- ఏదుల రిజర్వాయర్ నుంచి వట్టెం రిజర్వాయర్‌కు 32 మీటర్లు, 4.5 టీఎంసీలతో రిజర్వాయర్ కట్టాలి.
- అక్కడి నుంచి నుంచి గ్రావిటీ ద్వారా కరివెన రిజర్వాయర్‌కు 531 మీటర్లు, 25.52 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మాణం చేయాలి. ఈ రిజర్వాయర్ నుంచి 2.28 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలి.
- కరివెన రిజర్వాయర్ నుంచి లోకెరేవ్ రిజర్వాయర్‌కు 625 మీటర్లు, 14.37 టీఎంసీలతో రిజర్వాయర్ కట్టాలి. ఈ రిజర్వాయర్ నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా 1.09 లక్షల ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి.

బ్రిజ్ భూషణ్ శరణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి : ఐద్వా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో ఐద్వా ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన ఓ పార్లమెంట్ సభ్యుడు రెజ్లర్లపై లైంగిక వేదింపులకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. అతనిపై చర్యలు తీసుకోకుండా మోడీ సర్కారు మీనమేషాలు లెక్కించటం తగదని హితవు పలికారు. బీజేపీ నేతలు పొద్దున లేస్తే..భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి మాట్లాడుతారనీ, మహిళలపై లైంగిక వేదింపులకు పాల్పడటం కూడా భారతీయ సంస్కృతిలో భాగమేనా? అని ప్రశ్నించారు. కుస్తీపోటీల్లో దేశ గౌరవాన్ని నిలబెడుతున్న రెజ్లర్ల ఆందోళన పట్ల ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నేరస్తులనే పేరుతో కొందరిని ఇటీవల ఎన్‌కౌంటర్లు చేస్తున్న బీజేపీ ప్రభుత్వాలు..బ్రిజ్‌భూషణ్ విషయంలో ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. పేరు మోసిన నేరస్థుడిని వెనుకేసుకు రావటం దేశభక్తి ఎలా అవుతుందో చెప్పాలన్నారు. ఏడుగురు మహిళా రెజ్లర్లు తమను వేధిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని చెప్పే ప్రధాని మోడీ, క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్‌కు రెజ్లర్ల ఆందోళన కనిపించటం లేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి, బత్తుల హైమావతి, కె.ఎన్ ఆశలత, రాష్ట్ర సహాయ కార్యదర్శులు, బుగ్గవీటి సరళ, ఎమ్ భారతి, రత్నమాల, అహల్య, బి. అనురాధ. కె. నాగలక్ష్మి, శారద, స్వర్ణలత, నర్మద, రమణ, అనురాధ, శశికళ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమ్మె ముందుకే

- ఈ నెల 8 నుంచి 22 వరకు

దశలవారీగా నిరసనలు : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సర్కారు, అధికారుల బెదిరింపులు, అసత్య ప్రచారాలు, ఆటంకాల మధ్య ఐకేపీ వీఓఏల సమ్మె జరుగుతున్నదనీ, వాటికి భయపడకుండా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని ఐకేపీ వీఓఏ సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ రమ స్పష్టం చేశారు. తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, కోశాధికారి వి.రాములు, కార్యదర్శులు శ్రీకాంత్, ఈశ్వర్‌రావు, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజ్‌కుమార్, ఎం.నగేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.సుధాకర్, కోశాధికారి సుమలత, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. విశాల దృక్పథం లేని కొన్ని సంఘాలు సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాల్లో కలిసి రాకుండా అసత్యప్రచారాలు చేయడాన్ని తప్పుబట్టారు. వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నా పట్టదా? అని ఆయా సంఘాల నేతలను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచినా రావడం లేదని ప్రచారం చేయటం తగదన్నారు. తమ తొమ్మిది డిమాండ్లలో ఇన్ని పరిష్కరిస్తాం... వీటిని పరిశీలిస్తాం... ఇవి సాధ్యం కాదనే విషయాన్ని సర్కారు మాట వరుసకు కూడా చెప్పకపోవడం దారుణమన్నారు. అధికారులు కూడా అధికార పార్టీకి వత్తాసు పలకడం సబబు కాదని చెప్పారు. ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు దశలవారీగా పోరాటాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రాజ్‌కుమార్, నగేశ్ మాట్లాడుతూ... ఈ నెల 8న ఐకేపీ వీఓలతో మండల స్థాయిలో రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. 9,10 తేదీల్లో ర్యాలీలు, ధర్నాలు చేపట్టి మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 11,12 తేదీల్లో తమ పోరాటాన్ని సీఎం కేసీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లేందుకు గానూ పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడతామన్నారు. 14న వీఓఏలంతా కుటుంబ సభ్యులతో నిరసన చేపట్టాలని కోరారు. 15,16 తేదీల్లో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయాల ముందు సామూహిక దీక్షలు చేస్తామని చెప్పారు. 18న మహిళా సమాఖ్య సభ్యులతో ప్రదర్శనలు చేపట్టి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తెలిపారు. 21న డివిజన్ కేంద్రాల్లో బతుకమ్మ ఆడాలనీ, అదే రోజు సమ్మె శిబిరాల్లోనే పడుకుంటారని పేర్కొన్నారు. 22న కలెక్టరేట్లను ఎస్‌హెచ్‌జీ సభ్యులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ఐకేపీ వీఓఏలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టీఎస్‌ఆర్‌జేసీ సెట్ -2023 ప్రవేశపరీక్షకు 90.23 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌ఆర్‌జేసీ సెట్ -2023 ప్రవేశ పరీక్షకు 90.23 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేరకు శనివారం టీఎస్‌ఆర్‌జేసీ సెట్ -2023 కన్వీనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో 2023-24 మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గాను 251 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్షలు రాసేందుకు 55,232 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా 49,836 మంది విద్యార్థులు హాజరయ్యారు. టీఎస్‌పీఈసెట్ -2023కు ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసు కునే గడువును ఈ నెల 16 వరకు పొడిగించారు. ఈ మేరకు టీఎస్ పీఈసెట్ కన్వీనర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీ.పీఈడీ లేదా డీ.పీఈడీలో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన వారు, ఇప్పటికే ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న వారు, డిగ్రీ ఫైనల్ సెమిస్టర్‌లో ఉన్నవారు, డిగ్రీపూర్తి చేసుకున్న వారు ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేం దుకు అర్హులని తెలిపారు. మరోసారి గడువు పొడిగించేది లేదని స్పష్టం చేశారు.

ప్రతి నెల రెండో సోమవారం పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి నెల రెండో సోమవారం ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా (పీఎంఎన్‌ఏఎం)ను నిర్వహించనున్నట్టు ఇంటర్ విద్యా కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఆ క్రమంలో ఈ నెల 8న హైదరాబాద్‌లోని జూపార్క్ ఎదురుగా ఉన్న ఐటీఐలో మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-2446 1815 నెంబరులో సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

బయోడేటా సవరణలకు ఒక అవకాశం

- గ్రూప్-4 అభ్యర్థుల వినతికి టీఎస్‌పీఎస్సీ ఒకే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒకసారి తమ బయోడేటాలో సవరణలు చేసుకునేందుకు టీఎస్‌పీఎస్సీ అవకాశం కల్పించింది. ఈ మేరకు శనివారం కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎడిట్ ఆప్షన్ ఒకేసారి ఉపయోగించుకోవాల్సి ఉన్నందున అభ్యర్థులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశ్నాపత్రం ఇంగ్లీష్- తెలుగు, లేదా ఇంగ్లీష్-ఉర్దూ భాషల్లో ఉంటుందనీ, ఎంచుకునే సమయంలో సరి చూసుకోవాలని తెలిపారు. ఈ నెల 9 నుంచి 15 వరకు సవరణలకు అవకాశం ఇచ్చినట్టు వివరించారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటండి

- గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ ద్వారా పిలుపునిచ్చిన ఆర్.నారాయణ మూర్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సినీనటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఎంపీ సంతోశ్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శనివారం జూబ్లీహిల్స్ జీహెచ్‌ఎంసీ పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హరితహారం స్ఫూర్తితో ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టి ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్నారని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఎందరినో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారని ప్రశంసించారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, వాతావరణంలో మార్పులను అరికట్టాలన్నా మొక్కలను నాటడం ద్వారానే సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు.

నేడే నీట్ యూజీ పరీక్ష

- 28.87 లక్షల మంది దరఖాస్తు
- 513 నగరాల్లో పరీక్ష నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) యూజీ పరీక్ష ఆదివారం జరుగనుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 20,87,449 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. భారత్ లో 499 నగరాలు, ఇతర దేశాల్లో 14 నగరాలు కలిపి మొత్తం 513 నగరాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఈ నెల మూడో తేదీ నుంచి దరఖాస్తు చేసిన అభ్యర్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. తెలంగాణ నుంచి సుమారు 70 వేల మంది అభ్యర్థులు నీట్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. రాష్ట్రంలోని 24 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు.

ఆదివాసీ సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు

పలు తీర్మానాలకు ఆమోదం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో ముగిశాయి. ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదివాసీల సమస్యలపై రానున్న కాలంలో సమరశీల పోరాటాలను నిర్వహించాలని మహాసభ పిలుపునిచ్చింది.

ఈ మేరకు మహాసభ తీర్మానాలు వివరాలను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియా బాబురావు మీడియాకు విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ హక్కులపైన తీవ్రమైన దాడి చేస్తున్నదని ఆయన విమర్శించారు.

ఆదివాసీ చట్టాల్లో మార్పులు తీసుకు రావడం ద్వారా దేశంలోనూ రాష్ట్రంలోనూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఖనిజ సంపద ప్రకృతి వనరులన్నింటినీ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని మహాసభ డిమాండ్ చేసింది. బతుకుదెరువు కోసం తెలంగాణ భూభాగంలోకి వచ్చి నాలుగు దశాబ్దాలకు పైగా ఇక్కడే జీవనం సాగిస్తున్న వలస ఆదివాసీలకు ఎస్టీ కులం సర్టిఫికెట్లు జారీ చేయాలి. వారికి విద్యా వైద్యం ఉపాధి అవకాశాలను కల్పించాలని సభ డిమాండ్ చేసింది.

- వలస ఆదివాసీ గ్రామాల్లో పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వారికి ఆశ్రమ పాఠశాలలు గురుకుల విద్యాలయాలు కళాశాలలో సీట్లను కేటాయించాలి.
- ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని, ఎస్టీ జనాభా ప్రాతిపదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు కేటాయించాలని తీర్మానం ఆమోదించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రభుత్వ విభాగాలలో లక్షలాది ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్లో పెట్టాయని ఈ పోస్టులన్నిటిని తక్షణమే భర్తీ చేయాలి. ప్రయివేటు రంగ పరిశ్రమల్లో స్థానిక గిరిజన యువత యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- అత్యంత పురాతనమైన ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కలలను కళారూపాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.
- మాతృభాషలో విద్యాబోధన కొనసాగించే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. లిపిని తయారు చేయటం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. రాష్ట్రంలో తునికాకు బోనస్ పంపిణీ వెంటనే ప్రారంభించాలి.
- ఆదివాసీలు, దళితులు ఇతర అణగారిన వర్గాల పైన హిందూ మత ఉన్మాద సంస్థలు దాడులు ఆపాలి.

ప్రతి ఒక్కరికీ సైన్స్‌పై అవగాహన పెంచాలి

- డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యపుస్తకాల్లో తిరిగి ప్రవేశపెట్టాలి : శాంతిస్వరూప్ భట్నాగర్ ఆవార్డు గ్రహీత డా. సిహెచ్. మోహన్ రావు
- ఘనంగా జనవిజ్ఞాన వేదిక 4 వ వార్షిక సభలు





నవతెలంగాణ- నల్లగొండ

విద్యార్థులతో పాటు ప్రజలకు కూడా సైన్స్ పట్ల అవగాహన కల్పించాలని శాంతిస్వరుప్ భట్నాగర్ ఆవార్డు గ్రహీత, సెంటర్ ఫర్ సెల్యూలర్ మాలిక్యులర్ బయాలజీ పూర్వ సంచాకాకులు డా. సిహెచ్. మోహన్‌రావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు మోహనరావు చెప్పారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని మనోరమ హోటల్లో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) తెలంగాణ రాష్ట్ర 4వ వార్షిక మహాసభలను ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు శనివారం జేవీవీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో రెండు వాదనలు ఉంటాయని పక్కవారి వాదనలను ఖండించాల్సిన అవసరం లేదని, మీ వాదనను ప్రజలకు, సమాజానికి వివరించాలన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని విద్యార్థులకే కాకుండా ప్రజలకు కూడా వివరించాలన్నారు. సైన్స్ టీచర్లకు కూడా సైన్స్ పట్ల శిక్షణ ఇవ్వాలన్నారు. డార్విన్ సిద్ధాంతంతో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు, రచయితలు రూపొందించిన సిద్ధాంతాలను గురించి వివరించారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ జేవీవీ సులభంగా అర్థమయ్యే విషయం కాదని, ప్రతి ఒక్క విద్యార్థి డార్విన్ సిద్ధాంతం చదివిన వాళ్లమే అన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని పదవ తరగతి సిలబస్లో తీసేయడం సరైందికాదని తిరిగి పునరుద్ధరించాలన్నారు. క్రిమినల్స్ చేతిలో దేశం బంధీ అయిందని మోడీ, అమిత్ షా దేశంలోని వనరులన్నింటిని అమ్మేశారని అన్నారు. జేవీవీ పూర్వ అధ్యక్షులు కెఎల్. కాంతారావు మాట్లాడుతూ రాజ్యం అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రీయంగా సైన్సుకు పరిశోధనలకు ఎలాంటి ప్రోత్సహం ఇవ్వడం లేదన్నారు. తమ అనాలోచిత ప్రభుత్వ పాలసీలతో ప్రజలను మూఢత్వం వైపు మరల్చుతూ చైతన్య రహితుల్ని చేస్తోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి జి. మురళీధర్ రెండు తెలుగు రాష్ట్రాలలో సైన్స్ ప్రచారంలో మరింత సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. సభకు ముందుగా మూఢ నమ్మకాలను నమ్మవద్దంటూ కళాకారులు గీతాలను ఆలపించారు.

మూఢ నమ్మకాలు, అశ్లీలతకు వ్యతిరేకంగా ప్రచురించిన పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నల్గొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర శేఖర్ రెడ్డి, అమరయ్య రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణారెడ్డి, రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి విచ్చేసిన ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఏడ్పులు... వేషాలు

'నేను మనసారా ఏడ్వనీయండి' అని కృష్ణశాస్త్రిగారు అప్పుడెప్పుడో తీవ్రంగా దుఃఖపడ్డాడు. ఏడ్పులు నానారకాలుంటాయి. బాధను కన్నీళ్లుగా చేసి బరువుదించుకోవటం ఒక విధం. ఏడ్చి పనులు నెరవేర్చుకోవటాన్ని తరచూ చూస్తూంటాం. రామాయణంలో కైకేయి అలక మందిరంలో ఏడుస్తూ ఉందని తెలుసుకున్న దశరథుడు వెంటనే అక్కడికి చేరుకుని ఆమె

> ఇప్పుడీ బోధేమిటి! భజరంగ దళీయులు మాత్రమే భక్తులా? వేరేవాళ్లు కారా? దేవుళ్లపేరు చెప్పి సానుభూతిని పొందటం కోసం చేసే జిమ్మిక్కులు ఎంతకాలం చేస్తారు? విధ్వంసాలకు, హత్యలకు కూల్చివేతలకు పాల్పడుతున్న వాళ్లు రాముని ఆంజనేయుని భక్తులెలా అవుతారు! చిన్నతనంలో రాముని, కృష్ణుని, ఆంజనేయుని, భాగవత వేశాలేసుకుని, ఇంటింటికీ తిరిగి పద్యాలు పాడి అడుక్కుని బతుకుదెరువు గడుపుకునేవారు. వీళ్లు మాత్రం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, భక్తుల పేరు చెప్పి ఓట్లు అడుక్కుంటూ అధికారం కోసం అర్రులు చాస్తున్నారు. ఈ వేశాలను దొంగ ఏడ్పులను ప్రజలు జాగ్రత్తగా గమనించాలి.

కోర్కెను తీరుస్తాడు. రామునికి బదులుగా భరతుడికి పట్టాభిషేకం చేస్తాడు. రామున్ని అడవులకూ పంపిస్తాడు. కైకేయి ఏడుపు అదన్నమాట. అశోకవనంలోని సీత దుఃఖమూ మనకు తెలుసు. ఆకలితో బాధపడే వాడి దుఃఖానికీ, కోరుకున్నది లభించకపోతే వచ్చే ఏడుపునకు చాలా వ్యత్యాసముంటుంది. చిన్న పిల్లలు తాము కోరుకున్నది ఇచ్చేదాకా ఏడుస్తూనే ఉంటారు. ఆ తర్వాత వెంటనే ఏడుపు ఆపేస్తారు. ఇంకొందరికి తమకు లేకపోయినా ఎదుటివానికి ఉన్నదనే ఏడుస్తుంటారు. ఇదో రకం ఏడుపు. కొందరికి లేదని ఏడుపుంటే మరికొందరికి ఉన్నందుకూ ఏడుపుం టుంది.

ఏడుపంటే ఓ కథ గుర్తుకొచ్చింది. క్రౌంచపక్షుల జంటలో ఒక పక్షిని చంపేయటంతో దుఃఖిత పక్షిని చూసిన వాల్మీకి రామాయణాన్ని రాశాడు. నారదునికి కథను వినిపించగా కావ్యం బాగానే ఉంది కానీ... నీవు రాసిన దానికంటే హనుమంతుడి రామాయణం చాలా బాగుంటుంది అని అంటాడు. కావాలంటే కదళీవనానికి వెళ్లి హనుమంతుని కలువమని సలహా ఇస్తాడు. వాల్మీకి వనానికి వెళ్లి అక్కడ అరటాకుల మీది రామకథను చదువుతాడు. చదవడం పూర్తవగానే పెద్దగా ఏడ్వడం మొదలు పెడతాడు వాల్మీకి. మహర్షి ఏడుస్తున్నాడని తెలుసుకున్న హనుమ వచ్చి ఎందుకు ఏడుస్తున్నావని అడుగుతాడు. మీరు రాసిన రామాయణం అద్భుతంగా ఉన్నదని, అందువల్ల ఏడుపు వస్తున్నదని వాల్మీకి జవాబిస్తాడు. బాగుంటే సంతోషించాలి గానీ ఏడవడం ఎందుకు? అంటాడు. హనుమంతుని రామాయణం చదివాక తన రచనను ఎవ్వరూ చదవరని, అందుకే ఏడ్పువచ్చిందని వాల్మీకి అంటాడు. వెంటనే హనుమ అరటాకులనన్నింటినీ చింపివేస్తాడు. ఎందుకలా చేశారు? మధురమైన రామకథ చెరిగిపోయింది కదా! అని ఆవేదన చెందుతాడు వాల్మీకి. దానికి బదులుగా హనుమ 'ప్రపంచం మిమ్మల్ని గుర్తుంచుకోవటానికి మీరు రామాయణం రాశారు. నేను రాముణ్ని గుర్తుంచుకోవటానికి రాశాను' అని చెప్పి వాల్మీకి కండ్లు తెరిపిస్తాడన్న కథ ఉంది. అందుకని ఇలాంటి ఏడుపులూ కొందరు రాతగాళ్లలో ఉంటాయి.



ఆ ఏడుపులెట్లున్నా మనముందూ కొందరేడుస్తున్నారు. వాళ్ల ఏడుపేమిటో జాగ్రత్తగా తెలుసుకోవాలి. సాక్షాత్తు ఈ దేశ ప్రధానమంత్రి కర్నాటక ఎన్నికల్లో ఏడ్చినంత పనిచేస్తున్నారు. నన్ను ప్రతిపక్షాలు తొంభైసార్లు తిట్టారని ఓటర్లకు చెప్పుకొని ఏడ్చేశారు. ఇది ఓట్లను రాల్చేసుకోవటానికి ఏడ్చే ఏడుపు. చిన్నతనంలో అన్నదమ్ములం, అక్కా చెల్లెళ్లతో తగాదాపడి, అమ్మకో నన్నాకో వీడు తిట్టాడని, కొట్టాడని చెపుతూ ఏడ్చేవాళ్లం. లేదా పక్కింటి మిత్రుడు తిట్టాడనీ ఏడ్చేవాళ్లం. అచ్చం అలా అనిపిస్తున్నది. దేశంలోని రైతుల, కార్మికుల, పేదల, ఆర్తుల మహిళల, పిల్లల ఏడ్పులను విని, వారి బాధలను తీర్చాల్సిన నాయకుడు, వాళ్ల ఏడుపును పట్టించుకోకపోగా తన గురించిన బాధల్ని చెప్పుకు ఏడ్వటం మొదటిసారిగా చూస్తున్నాం! ఈ ఏడుపు వెనకాల అధికారం పొందాలన్న వాంఛతప్ప మరేమీలేదు. మా మానప్రాణాలు కాపాడండి మహా ప్రభో అని ఢిల్లీ నడివీధిలో మహిళా మల్లయోధులు ఏడుస్తూ అర్థిస్తుంటే, కనీసం ఆలకించని పాలకుడు, తన కోసం తాను ఏడుస్తూండటం వింత చర్య. పాలకులెవరైనా తాము చేసిన పనిని, చేయబోయే పనిని, ప్రజలకు ఏమి అందిస్తారో అని చెప్పి సాధారణంగా ఓట్లు అడుక్కోవటం ఉంటుంది. ప్రజలకేం ఇస్తారో చెపుతారు. కానీ ఈ ఏడుపు గొట్టు నాయకుడు హనుమంతున్ని తలుచుకొని ఓటేయమంటున్నాడు. హనుమాన్ చాలీసాను చదవమంటున్నాడు. కొన్ని తరాలుగా ఈయన పుట్టక ముందు నుండే ప్రజలు ఆంజనేయున్ని పూజిస్తున్నారు. హనుమాన్ చాలీసా చదువుతూనే ఉన్నారు. ఇప్పుడీ బోధేమిటి! భజరంగ దళీయులు మాత్రమే భక్తులా? వేరేవాళ్లు కారా? దేవుళ్లపేరు చెప్పి సానుభూతిని పొందటం కోసం చేసే జిమ్మిక్కులు ఎంతకాలం చేస్తారు? విధ్వంసాలకు, హత్యలకు కూల్చివేతలకు పాల్పడుతున్న వాళ్లు రాముని ఆంజనేయుని భక్తులెలా అవుతారు! చిన్నతనంలో రాముని, కృష్ణుని, ఆంజనేయుని, భాగవత వేశాలేసుకుని, ఇంటింటికీ తిరిగి పద్యాలు పాడి అడుక్కుని బతుకుదెరువు గడుపుకునేవారు. వీళ్లు మాత్రం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, భక్తుల పేరు చెప్పి ఓట్లు అడుక్కుంటూ అధికారం కోసం అర్రులు చాస్తున్నారు. ఈ వేశాలను దొంగ ఏడ్పులను ప్రజలు జాగ్రత్తగా గమనించాలి.

కడపటి ఘట్టంలో కర్నాటక రాగం



తెలకపల్లి రవి

కర్నాటక శాసనసభ ఎన్నికల తేదీ దగ్గరైన కొద్ది బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే ఆశలు ఆవిరైపోతున్నాయి. అత్యధిక సర్వేలు, అభిప్రాయ సేకరణలు కాంగ్రెస్‌కే అనుకూలతను చూపిస్తున్నాయి. మూడు సర్వేలు కాంగ్రెస్ విజయం సాధిస్తుందని జోస్యం చెబుతుంటే ఒక్క అభిప్రాయ సేకరణ బీజేపీ పెద్దపార్టీగా వస్తుందని మాత్రమే చెబుతున్నది. క్షేత్రస్థాయిలో పరిశీలించినవారు కూడా దాదాపు ఇదే అంచనాకు వస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాల ప్రచార సరళి కూడా అలాంటి సంకేతాలే ఇస్తున్నది. విజయావకాశాలు సన్నగిల్లడంవల్లనే మోడీ నేరుగా మతపరమైన అంశాలలో భాషలో మాట్లాడేందుకు సిద్ధమైపోయారు. అఖరుకు కేరళ స్టోరీ వంటి సినిమాను కూడా మతతత్వ ప్రచారానికి ఉపయోగించుకోవడం మొదలెట్టారు. ఎన్నికలలో కాంగ్రెస్ ప్రచార సరళి, బీజేపీపై దాని విమర్శలు ఒకటైతే మూడో శక్తిగా కొనసాగుతున్న జేడీఎస్ తన బలం పెరిగిందంటూ మరోవైపున చెప్పుకుంటున్నది. (ఎన్నికలకు సంబంధించిన రాజకీయాంశాలు గతంలో ప్రజాశక్తి ప్రచురించింది.) తక్షణ రాజకీయాంశాలతో పాటు కర్నాటక సామాజిక నేపథ్యాలు, పార్టీల వ్యూహాలు సర్వేల అంచనాలు ఇప్పుడు చూద్దాం.

సర్వేల అంచనాలు

మొట్టమొదటగా ఎబిపి సి ఓటరు సర్వే రాష్ట్రంలోని 224 స్థానాల్లోనూ కాంగ్రెస్ 107 నుంచి 119 వరకూ తెచ్చుకోవచ్చని వెల్లడించింది. బీజేపీకి 74నుంచి 86

> కాంగ్రెస్ విషయానికి వస్తే లౌకికతత్వం, జాతీయత, సామాజిక న్యాయం వంటి నినాదాలతోనే సరిపెట్టుకోవడం లేదు. హిందూత్వకు వ్యతిరేకంగా వాటిని రాజ్యాంగంలోనే పొందుపర్చామని మరీ మరీ చెబుతున్నది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రబాగా ఉపయోగపడిందని వారి అంచనాగా ఉంది. రాష్ట్రానికి చెందిన దళితనేత మల్లికార్జున ఖర్గే ఆ పార్టీ అధ్యక్షుడు కావడం, సామాజిక న్యాయాన్ని ఇక సమ్మిళిత దృక్పథానికి నిదర్శనమని వారంటున్నారు. నిరుద్యోగభృతి, పేదలకు ఆహారం, పేదలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం, కుల మత భేదాలు లేని సౌకర్యాలు వంటివాటినే ఎక్కువగా ప్రచారం చేస్తున్నది.

వస్తాయని, జేడీఎస్‌కు 23 నుంచి 35 రావచ్చని ఈ సర్వే పేర్కొంటున్నది. ఓట్ల విషయానికొస్తే కాంగ్రెస్‌కు 40శాతం, బీజేపీకి 35శాతం, జేడీఎస్‌కు 17శాతం, ఇతరులకు 8శాతం రావచ్చని సూచితమైంది. టీవీ9 కన్నడ సి ఓటరు సర్వే కూడా దాదాపు ఇలాగే ఉంది. ఇదే సిఓటరు ఇండియాటుడేతో చేసిన సర్వేలో బీజేపీ ఓటమి పాలవుతున్నది. ముఖ్యమంత్రిగా ఎవరికి ఎక్కువ అవకాశముందన్న దానిపై కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య 42శాతం ఓట్లతో ముందున్నారు. ప్రస్తుత బీజేపీ సిఎం బసవరాజ్ బొమ్మై 31శాతంతో వెనకబడిపోయారు. మరో కన్నడ వార్తావేదిక జరిపిన సర్వేలోనూ 132-140 సీట్లతో కాంగ్రెస్ మంచి ఆధిక్యత చూపిస్తున్నది. బీజేపీకి 57 నుంచి 65 వరకూ మాత్రమే వస్తాయంటున్నది. జీ న్యూస్ మ్యాట్రిజ్ ఒపీనియన్ పోల్ మాత్రం 103-115 సీట్లతో బీజేపీ ఏకైక పెద్దపార్టీగా వస్తున్నట్టు కనిపిస్తుంది. కాంగ్రెస్‌కు 79-91, జేడీఎస్‌కు 26-36, ఇతరులకు మూడు వరకు రావచ్చని అంచనా కట్టింది. లక్ష 80 వేల మందితో చేసిన ఈ సర్వే చాలా పెద్దదంటూ మోడీ ప్రభావం వల్లనే ఎన్నికల దృశ్యం మారిపోతుందని జీ అంటున్నది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కాంగ్రెస్‌కు పెద్దగా మేలు చేసిందేమీలేదని కూడా వ్యాఖ్యానించింది. కన్నడ ఛానల్ సువర్ణ మూడోసారి జరిపిన సర్వేలోనూ జన్ కీ బాత్ సర్వేలోనూ బీజేపీ ఏకైక పెద్దపార్టీగా వస్తాయని చెబుతున్నాయి,

దేశంలో హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎంత చెప్పుకుంటున్నా బీజేపీ నాయకత్వానికి తన పరిమితులు స్పష్టంగా తెలుసు. అందులోనూ దక్షిణ భారతదేశంలో వారికి మొదటి నుంచి ఠికానాలేదు. కర్నాటకలోని చిత్ర విచిత్రమైన మత సామాజిక వైరుధ్యాలను రాజకీయ కోణంలోకి మళ్లించడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప వంటివారు అక్కడకాలూనగలిగారు. కాని గత రెండు దశాబ్దాలలోనూ బీజేపీ ఎన్నికల విజయాలు కొన్ని సాధించినప్పటికీ మూల సిద్ధాంతమైన హిందూత్వ వ్యూహం మాత్రం ఆ స్థాయిలోనూ అంత వేగంగానూ వేళ్లూనుకోలేకపోయింది. అనేకసార్లు అధికారంలోకి వచ్చినా ఏ ముఖ్యమంత్రి కుదురుగా ఉన్నది లేదు. బీజేపీ సీఎంల సగటు పాలనా కాలం 800రోజులు మాత్రమే! ఒక్క యడ్యూరప్ప నానా తంటాలు పడి ఫిరాయింపుదార్ల సహాయంతో నాలుగుసార్లు పీఠమెక్కి 3182 రోజులు పూర్తి చేసుకున్నాడు. అంటే బీజేపీ పాలన అస్థిరత్వ మయంగానూ అవినీతి భరితంగానూ కొనసాగిందన్నమాట. దీనికి మతతత్వం జోడించి హిజాబ్, లవ్ జిహాద్, టిప్పు సుల్తాన్, ముస్లిం రిజర్వేషన్ వంటివి ఎన్ని తెచ్చినా ఇవేవీ బీజేపీకి స్థిరమైన పునాది కల్పించలేకపోయాయి.

భిన్న సామాజిక శిబిరాలు

పితృభూమి పుణ్యభూమి వంటి వీరసావర్కార్ హిందూత్వ పదజాలం కర్నాటకలోని కొన్ని ప్రాంతాలలోనైనా ప్రభావం చూపించి ఉండకపోతే బీజేపీ అక్కడ బలం పుంజుకోగలిగేది కాదు. భాషా జాతీయ భావన అందుకు తోడ్పడింది. సామాజిక సమీకరణలూ, రాజకీయ మితవాదం అక్కడ ప్రాబల్యం వహించాయి. వామపక్ష శక్తులు పరిమిత ప్రభావాన్నే చూపుతూ వచ్చాయి. మైసూర్ కర్నాటక, హైదరాబాద్ కర్నాటక (ఇప్పుడు కళ్యాణ కర్నాటక), బాంబే కర్నాటక (ఇప్పుడు కిట్టూరు కర్నాటక) అని మూడు భాగాలుగా చెప్పుకునే రాష్ట్రం భాషా ప్రయుక్త ప్రాతిపదికన 1956లో ఏర్పడిన తర్వాత కూడా ఈ ప్రాంతీయ ప్రత్యేకతలు, సాంస్కృతిక ముద్రలు కర్నాటక రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. కిట్టూరు కర్నాటకను సంఘ్ పరివార్ శక్తులు కొంత పట్టు సంపాదించగలిగాయి. కాని ఒక బలమైన శక్తిగా ఉన్న లింగాయత్‌లు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని బ్రాహ్మణేతర ఉద్యమ తరహాను అనుసరించారు. విశేషమేమంటే వీరికి మఠాలు కేంద్రాలుగా ఉపకరించాయి. తమది ప్రత్యేక సమూహమని లింగాయత్‌లు 1940 నాటికే ప్రకటించారు. కర్నాటక రాష్ట్ర ఏర్పాటుకు తామే పునాది వేశామని కూడా వారినేతల వాదన. కాంగ్రెస్ గుత్తాధిపత్యం సాగిన 70వ దశకం వరకూ వీరు చాలావరకూ ఉపేక్షా భావనకు గురైనారు. 1983లో ఏపీలో ఎన్టీఆర్ రంగ ప్రవేశం చేసినప్పుడే కర్నాటకలోనూ మొదటిసారి రామకృష్ణహెగ్డే నాయకత్వంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. జాతీయంగా జనతా ప్రయోగం ముక్కలైన తర్వాత కర్నాటకలో దక్కిన ఈ విజయం కొత్త దశను సూచిస్తుంది. అయితే ఆ దశలోనూ లింగాయత్‌లకు తగిన ప్రాధాన్యత దక్కలేదని అసంతృప్తి పెరిగింది. 1991లో తొలి లింగాయత్ ముఖ్యమంత్రి వీరేంద్రపాటిల్‌ను ముఖ్యమంత్రి పీఠం నుంచి తొలగించిన నాటి నుంచి కాంగ్రెస్ లింగాయత్‌లలో మరింత వెనకపట్టు పట్టింది. యడ్యూరప్ప, గాలి జనార్ధనరెడ్డి వంటి అక్రమ కుబేరుల అండదండలతో వారిని బీజేపీ వైపు తిప్పుకోగలిగారు. ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్‌వంటివారు అలా వచ్చిన వారే. ఇంకో వైపున జనతా శిబిరంలో లుకలుకల మధ్య లింగాయత్ వ్యతిరేక శక్తులను దేవగౌడ సమీకరించుకోగలిగారు. ప్రధాని పదవి కూడా కొంతకాలం నిర్వహించి వచ్చిన తర్వాత ఆయన పూర్తిగా మరో వ్యవసాయ కులమైన వొక్కలింగలపై దృష్టిపెట్టారు. ఆ విధంగా దక్షిణ కర్నాటకలో కొంత పట్టు సాధించగలిగారు.

పరివార్ ఎత్తులు

ఇక లింగాయత్‌ల ప్రత్యేక నేపథ్యం రీత్యా సంఘ్ పరివార్ వారిని తనతో కొనసాగించుకోవడానికి భిన్నమైన వ్యూహం అనుసరించింది. యడ్యూరప్పతో పదేపదే విభేదాలు రావడానికి ఇదీ ఒక కారణం. సంప్రదాయ నాయకులను కాదని పునాదిలేని వారిని ముందుకు తెచ్చి నాగపూర్



పెత్తనంతో నడిపించాలని చూడటమే. వొక్కలింగల ప్రాబల్యం గల దక్షిణ భాగంలో చిన్న చిన్న స్థానిక దేవతలను మఠాధిపతులను పైకి లేపింది. ప్రార్థనా స్థలాలనూ ఆలయాలనూ కొత్త పేర్లతో ప్రతిష్టించింది. కాలభైరవుడు ఇలవేల్పుగా గల ఆదిచుంచనగిరి మఠం దీనికి కేంద్రంగా చేసేందుకు ప్రయత్నించింది. టిప్పు సుల్తాన్‌ను వెనక్కు నెట్టి ఉరిగౌడ, నంజేగౌడ వంటి వొక్కలింగ పూజా పురుషులను ఆకాశానికెత్తింది. ఇది ఒక విధంగా వొక్కలింగలను ఇబ్బందిలో పెట్టగా మరో విధంగా పై మఠం కూడా ఆమోదించలేకపోయింది. తమ పునాదిని కాపాడుకోవడం కోసం వొక్కలింగలు ప్రాంతీయ పునాదిని నొక్కి చెప్పడం ప్రారంభించారు. ఎన్నికల ప్రారంభంలో మూడు పార్టీలూ తమ సంప్రదాయ పునాదిని కన్నా ఇతరులపై ఎక్కువగా దృష్టి పెట్టాలని ప్రకటించాయి. అందుకు తగినట్టే కాంగ్రెస్ 51శాతం టికెట్లు లింగాయత్‌లకు ఇస్తే బీజేపీ 47శాతం టికెట్లు వొక్కలింగలకు ఇచ్చింది. జేడీఎస్ ఇతర ప్రాంతాల వైపు చూడటం ఆపి తన పునాది అయిన హసన్ మాండ్యాలపైనే కేంద్రీకరించాల్సి వచ్చింది. పీష్వాల పాలన తెచ్చేందుకే యడ్యూరప్పను తొలగించాని కుమారస్వామి ఆరోపించడం అందులో భాగమే. బీజేపీ ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్

> దేశంలో హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎంత చెప్పకుంటున్నా బీజేపీ నాయకత్వానికి తన పరిమితులు స్పష్టంగా తెలుసు. అందులోనూ దక్షిణ భారతదేశంలో వారికి మొదటి నుంచి ఠికానాలేదు. కర్నాటకలోని చిత్ర విచిత్రమైన మత సామాజిక వైరుధ్యాలను రాజకీయ కోణంలోకి మళ్లించడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప వంటివారు అక్కడకాలూనగలిగారు. కాని గత రెండు దశాబ్దాలలోనూ బీజేపీ ఎన్నికల విజయాలు కొన్ని సాధించినప్పటికీ మూల సిద్ధాంతమైన హిందూత్వ వ్యూహం మాత్రం ఆ స్థాయిలోనూ అంత వేగంగానూ వేళ్లూనుకోలేకపోయింది. అనేకసార్లు అధికారంలోకి వచ్చినా ఏ ముఖ్యమంత్రి కుదురుగా ఉన్నది లేదు.

రద్దుచేసి లింగాయత్‌లు వొక్కలింగలకు సగం సగం ఇస్తానని ఆశచూపడం ఇందులో భాగమే. అయితే ఇదిప్పుడు కోర్టులో ఉంది. ముస్లింలు కూడా దూరమై కాంగ్రెస్ వైపు మొగ్గినట్టు చెబుతున్నారు. మరోవైపు వారిని తిప్పుకున్నామని బీజేపీ ప్రచారం నడిపిస్తున్నది. ఈ రెండు వైపులా దాడుల మధ్య జేడీఎస్‌ది సహాయక పాత్రగానే అందరూ అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్ కళ్యాణ కర్నాటకలో పోటీ చేస్తుందని భావించినా చేయకుండా కుమారస్వామికి మద్దతు ప్రకటించింది. సీపీఐ(ఎం) అయిదు స్థానాలలో పోటీ చేస్తున్నది. తెలుగువారు అధికంగా ఉండే బాగేపల్లి గతంలోనూ ఆ పార్టీ మూడుసార్లు గెల్చుకున్నది. జేడీఎస్ అక్కడ సీపీఐ(ఎం)కే మద్దతు ప్రకటించింది. మజ్లిస్ మొదట అనుకున్నట్టు ఎక్కువ చోట్ల గాక పరిమితంగానే పోటీ పెట్టింది.

కాంగ్రెస్ వ్యూహాలు, జాతీయ ప్రభావం

చివరగా కాంగ్రెస్ విషయానికి వస్తే లౌకికతత్వం, జాతీయత, సామాజిక న్యాయం వంటి నినాదాలతోనే సరిపెట్టుకోవడం లేదు. హిందూత్వకు వ్యతిరేకంగా వాటిని రాజ్యాంగంలోనే పొందుపర్చామని మరీ మరీ చెబుతున్నది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రబాగా ఉపయోగపడిందని వారి అంచనాగా ఉంది. రాష్ట్రానికి చెందిన దళితనేత మల్లికార్జున ఖర్గే ఆ పార్టీ అధ్యక్షుడు కావడం, సామాజిక న్యాయాన్ని ఇక సమ్మిళిత దృక్పథానికి నిదర్శనమని వారంటున్నారు. నిరుద్యోగభృతి, పేదలకు ఆహారం, పేదలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం, కుల మత భేదాలు లేని సౌకర్యాలు వంటివాటినే ఎక్కువగా ప్రచారం చేస్తున్నది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డికె శివకుమార్ సంపన్న రాజకీయ వేత్త మాత్రమే గాక వ్యూహ ప్రతివ్యూహాలలో ఆరితేరిన దిట్ట. తనను ముఖ్యమంత్రిని చేయాలని అధిష్టానం నిర్ణయమని అంటారు గాని సర్వేలు మాత్రం మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకే ప్రజల మొగ్గు ఉన్నట్టు చెబుతున్నాయి. తమకు 130పైగా సీట్లు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. దక్షిణభారతంలో మొత్తం 130లోక్‌సభ స్థానాలుంటే బీజేపీ గరిష్టంగా తెలంగాణ కర్నాటక కలిపి గతసారి 29 తెచ్చుకుంది. గత నాలుగు ఎన్నికల్లోనూ రాష్ట్రంలో మెజార్టీ లోక్‌సభ స్థానాలు దానివే. అయితే శాసనసభలో ఒకసారి కూడా పూర్తి మెజార్టీరాక ఫిరాయింపులపై ఆధారపడింది. ఈ సారి ఆ అవకాశం కూడా దాదాపు మూసుకుపోయినట్టే కనిపిస్తుంది. కర్నాటక చేజారితే దక్షిణాదిన బీజేపీ శూన్యం కావడం రాబోయే 2024 ఎన్నికలను అమితంగా ప్రభావితం చేస్తుంది.

వేగంగా విస్తరిస్తున్న 'తలసేమియా'



తలసేమియా ఒక జన్యు సంబంధమైన వ్యాధి. ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి నిలిచిపోవడాన్ని 'తలసేమియా' వ్యాధి అంటారు. బిడ్డకు జన్మనిచ్చే తల్లి నుండే ప్రాణాంతక తలసేమియా వ్యాధి సంక్రమిస్తుంది. దీనిద్వారా జన్యువాహకులైన తల్లిదండ్రులకు జన్మించే బిడ్డల్లో 25-30శాతం మంది పుట్టక తోనే వ్యాధిగ్రస్తులయ్యే అవకాశం ఉంది. తలసేమియా అనేది గ్రీక్ పదం. గ్రీక్ భాషలో తలసేమియా అంటే సముద్రం అని అర్థం. ఈ వ్యాధికి గురైన వారికి జీవితాంతం రక్తం ఎక్కిస్తూనే ఉండాలి. ఈవ్యాధి ముఖ్యంగా రెండు రకాలు. ఒకటి ఆల్ఫా తలసేమియా, రెండు బీటా తలసేమియా. తలసేమియా రక్తంపైన తన ప్రభావాన్ని చూపిస్తుంది. శ్వాసతో పీల్చుకునే ఆక్సిజన్‌ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకూ హిమోగ్లోబిన్ అందిస్తుంది. తలసేమియా రోగుల్లో శరీరానికి అవసరమైనంత హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. ఒకవేళ ఉత్పత్తయినా ఎక్కువకాలం అది నిల్వ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు పడిపోయిన ప్రతిసారీ హిమోగ్లోబిన్‌ని కృత్రిమంగా రక్తం ఎక్కించి అందించాలి. సకాలంలో రక్తం ఎక్కించకపోతే చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. తలసేమియా ఆప్రభావమైన ఆటోషోమాల్ పద్ధతిలో వ్యాపిస్తుంది. తల్లిదండ్రుల్లో ఉండే జన్యుపరమైన లోపాల కారణంగా కానీ, జన్యువుల్లో ఉండే వ్యత్యాసాల కారణంగా తలసేమియా సంక్రమిస్తుంది. మనదేశంలో 4.50కోట్ల మంది తలసేమియా బారిన పడ్డారని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో గ్రామీణ ప్రాంతంలో సుమారు 68.8శాతం మంది తలసేమియా వ్యాధి కలిగిన వారు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో 31.2 శాతం తలసేమియా వ్యాధి కలిగిన వారు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 3వేల మంది తలసేమియా బాధితులు ఉన్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం, సంగారెడ్డి జిల్లాలో బీటా తలసేమియా వ్యాధి వేగంగా విస్తరిస్తుంది. మైనార్టీ, దళిత, గిరిజన, బీసీలలో ఇతర ప్రజల కంటే వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఏటా 2.7కోట్ల మంది పిల్లలు జన్మిస్తే 32,400మంది పిల్లలు తీవ్రమైన హిమోగ్లోబిన్ రుగ్మతతో జన్మిస్తున్నరని అనేక అధ్యయనాలు తెలియ చేస్తున్నాయి.



ఎం. అడివయ్య
9490098713

పట్టణ ప్రాంతాల్లో జన్మించే 12,000మందిలో కొద్ది మంది మాత్రమే సరైన వైద్యం పొందగలుగుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో తలసేమియా రోగుల రక్త మార్పిడి కోసం 2 మిలియన్ యూనిట్ల ప్యాక్ట్ రెడ్ సెల్స్ అవసరం అవుతున్నాయని అంచనా. ఈ వ్యాధి మూడు నెలల వయస్సు నుంచి 18నెలల వయసు మధ్యలో బయటపడుతుంది. ముఖం పీక్కుపోయి, బాల్యంలోనే ముడతలు పడినట్టుగా తయారవుతుంది. శరీర రంగు తేడాగా ఉంటూ, పాలి పోయినట్టుగా మారుతుంది. శారీరక ఎదుగుదల ఉండదు. బొడ్డు భాగంలో వాపుంటుంది. తరచుగా అనారోగ్యాలకు గురవుతుంటారు. తలసేమియా వ్యాధి కలిగిన వారికి ఉన్న లక్షణాల ఆధారంగా చికిత్స చేయాలి. శరీరంలో ఎర్రరక్త కణాల సంఖ్యను పెంచడానికి 15 నుంచి 20 రోజులకు ఒక్కసారి రక్తం ఎక్కిస్తారు. ఎముకల మూలుగలో ఉన్న రక్త కణాలను మార్పిడి చేసి వ్యాధిని నివారించవచ్చు. దీన్ని వైద్య పరిభాషలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. తలసేమియా వ్యాధి కుటుంబాలను జన్యుపరమైన పరీక్షలకు హాజరు కావటం అవసరం. గర్భిణీలు తలసేమియా వ్యాధి సంబంధిత పరీక్షలకు హాజరుకావాలని ది అమెరికన్ కాలేజీ ఆఫ్ అబ్‌స్ట్రేటి యాన్స్ అండ్ జినెకోలోజిస్ట్ సూచించింది. ప్రపంచ వ్యాపితంగా వివిధ దేశాలలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తల్లితండ్రులను పరీక్షించటం ద్వారా ప్రతి 158మంది శిశువులలో ఒక్కరికి మాత్రమే తలసేమియా ఉండే పరిస్థితి నుండి బయట పడవచ్చు.

తలసేమియా వ్యాధి పూర్తి సమాచారం కోసం అనేక జాతులను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. చిన్న భౌగోళిక ప్రాంతాలు కొన్ని తెగల్లో తలసేమియా ఎక్కువగా ఉంటుంది. జాతీయ తలసేమియా నియంత్రణ కార్యక్రమం రూపొందించిన లక్ష్యాలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు స్క్రీనింగ్ కోసం తగిన కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తలసేమియా వ్యాధి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరైన వైద్యం అందించేందుకు ప్రినేటల్ డయాగ్నసిస్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ప్రసూతి వైద్యులు, సోనాలజిస్టులకు పిండం నమూనా విధానాలపై శిక్షణను క్రమం తప్పకుండా నిర్వహించడం అవసరం. ఇప్పటికే ఉన్న వాళ్ల తలసేమియా రోగులకు వైద్యం అందించేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో డే కేర్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అన్ కమ్యూనిటీ కంట్రోల్ ఆఫ్ తలసేమియా రూపొందించిన కార్యక్రమం మన దేశంలో బీటా తలసేమియాను కనుగొనేందుకు దోహదపడింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేసి తక్కువ రిస్క్ ఉన్న వారికి స్టెమ్ సెల్ మార్పిడి కోసం ప్రోత్సహించాలి. జాతీయ తలసేమియా నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలి. దీనికి ఎన్‌జీఓలు, తలసేమియా సొసైటీలు, కార్పొరేట్ సంస్థల సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

(మే 8న అంతర్జాతీయ తలసేమియా డే)

బెత్తం



జంధ్యాల రఘుబాబు
9849753298

ఇక మళ్ళీ బడులు తెరిచే సమయ మొస్తోంది. బడి అంటే బెత్తం, బెత్తం అంటే బడి గుర్తొస్తుంది. బడిలో టీచరంటే చేతిలో బెత్తం లేకుండా ఊహించలేం. తప్పు చేసినా, కరెక్టు చేయకపోయినా ఈ బెత్తం తన పని తను చేస్తుంది. చిన్నప్పుడు బడిలో బెత్తం తెమ్మని ఎవరో ఒకరిని పంపేవారు. ఇదే సందని బయట ఉండే చెట్టెక్కి ఓ కొమ్మను తుంచి ఆకులు రెమ్మలు తీసేసి బెత్తం తెచ్చి సారుకిస్తే ఆయన ఎదిరా ఎలాగుందో చెప్పు అని ఆ బెత్తం తెచ్చినోడి మీదనే మొదటి ప్రయోగం చేసేవాడు. అలా చెప్పుకుంటూ పోతే బెత్తం గురించి చాలానే ఉంటుంది. ఇక ఇంట్లో అయితే ఏదిపడితే అది బెత్తం లాగే పనిచేస్తుంటుంది. చిన్నప్పుడు ఎన్ని బెత్తం దెబ్బలు తింటే అంత బాగుపడతారని కొందరి విషయంలో తేలింది. అందుకే ఈ బెత్తం తరగతిలోని విద్యార్థులను కాపాడినట్టే, మనిషి జీవితాన్ని కాపడుతుంది. పుస్తకం హస్త భూషణం అన్నట్టు బెత్తం హస్త ఆయుధం అనొచ్చు.

బెత్తమంటే సర్కారు బడిలోనే ఎక్కువ వాడతారని మనకు అనుభవంలో తెలుస్తుంది. నిజంగా దాని పని నిజంగా కొట్టడం కాదు, భయపెట్టడం. ఎప్పుడో అవసరమొచ్చి ఆ బెత్తంతో క్లాసులో ఒకరిని కొడితే చాలు అందరి మెదడుల్లో అది రికార్డయిపోయి ఉంటుంది. అది ఎక్కడో మూలకు పెట్టి చెబితే ఒకలాగ, చేతిలో పట్టుకుని చెబితే ఒకలాగ ఉంటుంది. తరగతి గదిలో ఒకరకమైన క్రమశిక్షణను తెస్తుంది ఆ బెత్తం. కొందరు అయ్యవార్లుంటారు చేతిలో ఎప్పుడూ బెత్తం ఉంటుంది కాని దాన్ని ఎప్పుడూ వాడరు. కోపమొస్తే చెవి పిండి లేదా పొట్టదగ్గర పట్టుకొని గిచ్చి మరీ తమ కోపాన్ని చూపే వాళ్ళు కొందరు.


ఇక సర్కారు బడులతో పాటు ప్రయివేటు బడులు ఎప్పుడొచ్చాయో అప్పుడు ఈ బెత్తం గురించిన అవగాహన చాలా మందికి పోయింది. ఆ ప్రయివేటు కాన్వెంటుల్లో, బడుల్లో పిల్లల్ని కొట్టకూడదు. కొడితే నేరం. అప్పుడప్పుడూ అక్కడక్కడా కొడతారు కాని అలాంటి కేసులు చాలా తక్కువ. బడిలో తెలుగు మాట్లాడినందుకు కొట్టిన టీచరమ్మను కూడా మనం చూశాం. బడిలో తెలుగు మాట్లాడొద్దు అని రాసిన బడులనూ చూశాం. అప్పుడెప్పుడో ఇంగ్లీషోడు ఉన్నప్పుడే బాగుండేదని కొందరు చెబితే, ఇప్పుడు ఈ కొత్త ఇంగ్లీషోడు చెప్పకుండానే అన్నీ చేసేస్తున్నాడని చూసేవారికి తెలిసిపోతుంది. వాడి డాలర్ ఇప్పుడు అంత విలువైనది. అది బెత్తం పట్టుకొని ప్రపంచాన్నే శాసిస్తోంది మరి. వాడు చెర్నాకోలా లాంటి బెత్తాన్ని పట్టుకొని ప్రపంచమంతా తిరుగుతాడు. వాడు ఎక్కడ యుద్ధం చేయమంటే అక్కడ చేయాలి. ఎలా చేయించాలో కూడా వాడికి బాగా తెలుసు. ఎలాంటి ఆయుధాలు వాడమంటే అవి వాడాలి. వాటివల్ల వచ్చే కాలుష్యం గురించి మాట్లాడడు వాడు. బెత్తం పట్టుకొని కాలుష్యం కాలుష్యం అనుకుంటూ దునియా మొత్తం చక్కర్లు కొడుతుంటాడు. అన్నీ తన వ్యాపారానికే వాడుతుంటాడు. అయినా వాడి బ్యాంకులు దివాలా తీస్తుంటే ఊరకే చూస్తూ ఉంటాడు. వాటిపైన వాడి బెత్తం పనిచేయదు.

బెత్తం మనుషులకేనా వాడేది అంటే అదేం కాదు. గుర్రాలకు, ఎద్దులకు ఇంకా మనుషులు పెంచుకునే జంతువులన్నిటికీ వాడతారు. అయితే ఒక్కోదానికీ ఒక్కో పేరుంటుంది.



పులులు సింహాలకు కూడా బెత్తం వాడతారని తెలుసు కదా! అయితే అవి కరెంటు బెత్తాలు. షాక్ కొడతాయి. వాటి చిన్నప్పటినుండి దాంతో భయపెడతారు కాబట్టి పెద్దగైనా కూడా కరెంటు బెత్తమంటే హడల్ వాటికి. అది చూపిస్తే బోనులోనుండి రావలసిందే, లోనికి పోవలసిందే. అంతంత క్రూర జంతువులను ఒక్క కరెంటు బెత్తంతో ఆడించే రింగ్ మాస్టర్లని చూస్తే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఒక్కోసారి దానిలో కరెంటు లేకపోయినా కూడా ఏనుగుకు కట్టిన తాడు లాగా పనిచేస్తాయవి.

నిజం చెప్పుకోవాలంటే సురుకు తగిలించడం ఈ బెత్తం ముఖ్య ఉద్దేశ్యం. కొట్టినప్పుడు తగిలే సురుకు పైన చెప్పుకొన్నట్టు మెదడులో రికార్డయిపోయి ఉంటుంది. ఈత



చెట్టు, కానుగ కొమ్మలలాంటి కొన్ని బెత్తాలు గాలిలో ఊపుతుంటేనే అవి చేసే సవ్వుండు చాలు పిల్లలు మాట వినడానికి. చిన్నప్పుడు ఆ బెత్తం ఉపయోగాలు కొన్ని నేర్చుకున్నట్టు పెద్దగయ్యాక కూడా కొన్ని ఉంటాయని మనకు తెలుస్తుంది. ఎన్నికలప్పుడు ప్రజల చేతిలో ఉండె బెత్తమే ఓటు అని మనం తెలుసుకోవాలి. ముఖ్యంగా రాజకీయ నాయకులు. డబ్బులు పడేస్తే ఓటేస్తారులే అనుకుంటే పొరబాటే. ఒక్కోసారి రెండువైపులా డబ్బులిచ్చి మభ్యపెట్టినా అంతకు ముందు ప్రభుత్వాలు చేసిన పనులను ప్రజలు బాగా గుర్తు పెట్టుకుంటారు. పెరిగిన ధరలను, రైతులు పడ్డ బాధలను, రకరకాల రూపాల్లో వేస్తున్న పన్నులను వాళ్ళు బాగ యాదుంచుకుంటారు. ఎప్పుడు ఎక్కడ సురుకు తగిలించాలో వాళ్ళకు బాగా తెలుసు. బెత్తంతో ఎప్పుడు శబ్దం చేయాలో, ఎప్పుడు నిజంగా కొట్టాలో ఎరిగినోళ్ళు వాళ్ళు.

జీతాలు, పెన్షన్లు ఊరకే ఇచ్చేవి కాదు అవి మా హక్కులని కార్మికులు ఎప్పుడూ

> ఇప్పుడు ఫ్రాన్స్‌లో కార్మికులు పెన్షన్ కోసం బెత్తాలు పట్టుకొని వీధికెక్కారు. కార్మికులు, ఉద్యోగుల పనైపోయింది, వాళ్ళ కోరలు పీకేశారు అని సంకలు గుద్దుకునే వాళ్ళకు ఇలాంటి సమ్మెలు, మన రైతులు చేసిన సమ్మెలు కూడా బెత్తంతో చేసే శబ్దాల లాంటివేనని గుర్తు చేయాలి. అసలైన దెబ్బ కొట్టినప్పుడు ఆ బెత్తం సురుకు తెలుస్తుంది. అప్పుడు వీపంతా వ్యాజిలైనులు, నవనీతాలు పట్టించుకున్నా ఫలితముండదు. బెత్తం దెబ్బ అంటే ఏమిటో అప్పుడు తెలుస్తుంది.

చెబుతుంటారు. లక్షల కోట్లు ఒకరిద్దరు మనుషులకే కట్టబెట్టి మరీ వారి బెత్తం కింద జీ హుజూర్ అని పని చేసి మంచి బాలుడు అని పేరు తెచ్చుకోవడానికి తహతహలాడే నాయకులను చూశాం. ఇది ప్రపంచమంతా జరిగేదే. ఇప్పుడు ఫ్రాన్స్‌లో కార్మికులు పెన్షన్ కోసం బెత్తాలు పట్టుకొని వీధికెక్కారు. కార్మికులు, ఉద్యోగుల పనైపోయింది, వాళ్ళ కోరలు పీకేశారు అని సంకలు గుద్దుకునే వాళ్ళకు ఇలాంటి సమ్మెలు, మన రైతులు చేసిన సమ్మెలు కూడా బెత్తంతో చేసే శబ్దాల లాంటివేనని గుర్తు చేయాలి. అసలైన దెబ్బ కొట్టినప్పుడు ఆ బెత్తం సురుకు తెలుస్తుంది. అప్పుడు వీపంతా వ్యాజిలైనులు, నవనీతాలు పట్టించుకున్నా ఫలితముండదు. బెత్తం దెబ్బ అంటే ఏమిటో అప్పుడు తెలుస్తుంది.

ఊపిరున్నంత వరకు సమాజం కోసమే...

"స్త్రీకి సమాన అవకాశం ఇస్తున్న రంగం ఎక్కడైనా ఉందా..? మహిళ కన్నీటితో తడవని నేల ఎక్కడైనా ఉందా..?" అని ఆమె గట్టిగా ప్రశ్నిస్తున్నారు. స్త్రీ సమానత్వానికై ప్రశ్నించడానికే ఆమె గొంతు ఉంది. సమసమాజం వైపు వేసేందుకే ఆమె అడుగులు వున్నాయి. మొన్నటి వరకు బాధ్యతగల ఓ ఉపాధ్యాయినిగా భావి భారతాన్ని తీర్చిదిద్దారు. ఓ ఉద్యమకారిణిగా మహిళా సమస్యలపై కదం తొక్కారు. ఉద్యమమే జీవితంగా బతుకుతున్న ఆమెను గుర్తించి ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా నియమించింది. ఆమే సుమిత్రా ఆనంద్... ఆమె జీవిత విశేషాలు ఆమె మాటల్లోనే...

మాది మెదక్ జిల్లాలోని ఆరేపల్లి గ్రామం. చిన్న పల్లెటూరు అది. 30, 40 కుటుంబాలు మాత్రమే ఉండేవి. నాన్న మాణిక్యరావు, అమ్మ విఠాబాయి. నాన్న గర్నమెంట్ స్కూలు టీచర్‌గా చేస్తూ చనిపోయారు. అమ్మ ఇటీవలె చనిపోయింది. మేము మొత్తం ఐదుగురం. నేను నాల్గో సంతానాన్ని. మా అందరినీ బాగా చదివించారు. మా అన్నయ్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా రిటైర్డ్ అయ్యాడు. తమ్ముడు ప్రైవేట్ విద్యా సంస్థలు నిర్వహిస్తున్నాడు. నేను గవర్నమెంట్ టీచర్‌గా చేస్తూ వీఆర్ఎస్ తీసుకుని పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా పని చేస్తున్నాను.



నాన్న భావాలతో...

నాన్న ఆదర్శ భావాలు కలిగిన వ్యక్తి. గ్రామంలో తనే మొదటి విద్యావంతుడు, తనే మొదటి టీచర్. అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అనే తపన బాగా ఉండేది. ఊళ్ళో ప్రతి ఇంటి నుండి కనీసం ఒకరైన చదివేటట్లు ప్రోత్సహించేవారు. మనం అంటే కేవలం కుటుంబం మాత్రమే కాదు, సమాజం కూడా అనే ఆలోచనలు ఉన్న నాన్న పెంపకంలో పెరిగాను. నేను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు నాన్న చనిపోయాడు. నా పదో తరగతి తర్వాత పెండ్లి చేశారు. పెండ్లి విషయంలో నాకు కొన్ని ఆలోచనలు ఉండేవి. అప్పట్లో వరకట్న సమస్య ఎక్కువగా ఉండేది. ఆడపిల్ల ఎందుకు కట్నం ఇవ్వాలి అనుకునేదాన్ని. నేను పెండ్లి చేసుకుంటే కట్నం తీసుకోని వ్యక్తినే చేసుకోవాలనుకున్నాను. అనుకోకుండా అలాంటి వ్యక్తే నా జీవితంలోకి వచ్చాడు.

అనుకోకుండా దొరికాడు

ఆనందరావు చదువుకునే రోజుల్లో పీడీఎస్‌యూలో పని చేసేవారు. కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తి. పెండ్లి చూపులకు వచ్చినప్పుడు "నాకు కట్నం వద్దు, మన పెండ్లిలో తాళి, మెట్టెలు, వేదమంత్రాలు, బాజాభజంత్రీలు ఏమీ ఉండవు. దండలు మార్చుకొని పెండ్లి చేసుకోవడమే నీకు ఇష్టమేనా" అని అడిగారు. నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఏడారిలో నీటి చెలిమ కోసం వెదుకుతున్న నాకు పెద్ద సరస్సే దొరికినట్టు భావించాను. ఆదర్శవంతమైన వ్యక్తి దొరకడం, మా జంట రేపటి తరానికి ఆదర్శం కాబోతుందని గర్వంగా అనిపించింది.

వాళ్ళలా పని చేయాలని...

1989లో మా పెండ్లి జరిగి అత్తగారి ఊరైన చిన్నమల్లారెడ్డి వచ్చాను. మాకు దగ్గరల్లో లైబ్రరీ ఉండేది. పుస్తకాలు తెచ్చుకొని విపరీతంగా చదివేదాన్ని. 'కాలుతున్న పూలతోట' అని ఓ నవల చదివాను. అది నన్ను బాగా ప్రభావితం చేసింది. అయితే అందులో ముగ్గురు అమ్మాయిలు సమాజంలో మార్పు కోసం, మహిళల సమస్యల పరిష్కారం కోసం అజ్ఞాతంలోకి వెళతారు. నాకూ వాళ్ళలా సమాజం కోసం ఏదైనా చేయాలని ఉంది అని ఆనందరావుకు చెప్పాను. అయితే ఆయన "అజ్ఞాతంలోకి వెళ్ళడం కంటే బయటే ఉండి మహిళల కోసం ఏదైనా చేస్తే మంచిది. అక్కడికి వెళితే ప్రజల కోసం చేసేది ఒక ఎత్తైతే నిన్ను నువ్వు కాపాడుకోవల్సి వుంటుంది" అన్నారు.

సాటి మహిళలకు అండగా...

అప్పట్లో మా ఊరులోనే ఓ మహిళా మండలి ఉండేది. అయితే అది కేవలం కుట్లు, అల్లికలు నేర్పించడానికే పరిమితమై ఉండేది. మహిళలంటే కుట్లు, అల్లికలు, వంటలు చేయడం మాత్రమే కాదు సాటి మహిళలకు ఎక్కడ సమస్య వచ్చినా వారికి అండగా మనం నిలబడాలి అని వారిలో అవగాహన కల్పించే ప్రయత్నం చేశా. దాదాపు 200 మంది మహిళలు నాతో చేరారు. మేమంతా కలిసి ఆ చుట్టుపక్కల ఎవరికి ఎక్కడ సమస్య వచ్చినా వెళ్ళేవాళ్ళం. కొంత కాలానికి మా కామారెడ్డి ప్రాంతంలో ఓ మహిళ సమస్యతో మా దగ్గరకు వచ్చిందంటే చాలు అవతలి వారు భయపడిపోయేవారు. అంతగా పని చేశాము. మమ్మల్ని చూసి చుట్టు పక్కల ఊర్లల్లో కూడా మహిళా మండలి ఏర్పాటు చేసుకున్నారు.



అక్షర కిరణం

చదువు లేని చోట మహిళ హింసకు గురవుతుంది. బానిసగా బతుకుతుంది. అందుకే మహిళా అక్షరాస్యత సాధించాలని మా మహిళా మండలి ఆధ్వర్యంలో 'అక్షర కిరణం' అనే ఉద్యమం మొదలుపెట్టాము. అప్పట్లో ఆడపిల్ల అంటే బీడీలు చుట్టడానికి మాత్రమే పుట్టిందా అనేట్టు ఉండేది. వాళ్ళను చదివించమని అవగాహన కల్పించాము. చాలా మందిలో మార్పు వచ్చింది. ఇవన్నీ నేను చదువుకుంటూనే చేసేదాన్ని. కామారెడ్డిలో సాయంత్రం కాలేజీలో చేరి ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాను. ఇంటి బాధ్యతలు చూసుకుంటూ, చదువుకుంటూనే నా కార్యక్రమాలన్నీ చేసేదాన్ని. అలాగే సారా వ్యతిరేక ఉద్యమంలో కూడా పాల్గొన్నాను. చివరకు విజయం సాధించాము. పోరాటం ఎప్పుడూ వృధా పోదూ అనే ధైర్యాన్ని ఇచ్చింది ఆ ఉద్యమం.

మెరుగైన సమాజం కోసం...

1996లో తెలుగు పండిట్ ట్రైనింగ్ తీసుకున్నాను. ఆనందరావు ప్రోత్సాహం నాకు బాగా ఉండేది. ప్రతి దాంట్లో నన్ను ముందు నిలబెట్టేవారు. చదవడానికి అనేక పుస్తకాలు ఇచ్చేవారు. రాజు పేద అనే నవల చదివాను. అది కూడా బాగా నచ్చింది. అలాగే ఓల్గా స్వేచ్ఛ, శ్రీశ్రీ, తిలక్ పుస్తకాలు అన్నీ చదివేదాన్ని. 1998లో తెలుగు ఉపాధ్యాయురాలిగా చేరాను. తరగతి గదుల్లోనే దేశ భవిత నిర్మితమవుతుంది అంటారు. ఓ మెరుగైన సమాజం నిర్మించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా అనిపించింది. ఉపాధ్యాయ సంఘాల్లో కూడా పని చేశాను. టీచర్‌ని కావడంతో పిల్లలకు కథలు, పద్యాలు చెబుతుండేదాన్ని. పిల్లల కోసం చాలా చదివేదాన్ని. అప్పట్లో పాఠ్యపుస్తకాల్లో మహిళా వివక్షను చూపే పాఠాలు చాలా ఉండేవి. వాటి వల్ల సమాజంలో మహిళల పరిస్థితి మరింత దిగజారుతుంది. ఆ విషయాలను పిల్లలకు వివరంగా చెబితే అర్థం చేసుకునేవారు. పాఠ్యాంశాల్లోని కొన్ని ఇతిహాసాలు, పురాణాలు మహిళలు కించపరిచే విధంగా ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠ్యాంశాల్లో కొంత మార్పు వచ్చింది.

తెలంగాణ ఉద్యమంలో...

తెలుగు పండిట్ ట్రైనింగ్ తీసుకునేటపుడు నా భాషను ఎగతాళి చేసేవారు. ఆ కోపంతో భాష కోసం ఏర్పడిన సంఘాల్లో పని చేశాను. తెలంగాణ రచయితల సంఘంలో కూడా ఉన్నాను. ఆ తర్వాత కాలంలో ఉపాధ్యాయినిగా పని చేస్తూనే తెలంగాణ ఉద్యమంలో విస్తృతంగా పని చేశాను. వేదికలకు ఎక్కి పాటలు పాడేదాన్ని. చివరకు పోరాటం ఫలించి ప్రత్యేక తెలంగాణ వచ్చింది. ఉద్యమాలే జీవితంగా బతుకుతున్నప్పుడు మనల్ని కచ్చితంగా సమాజం గుర్తిస్తుంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం నన్ను గుర్తించి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా నియమించింది.

మార్పుకు ఆయుధం విద్యనే

మీడియా కూడా యువతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అసహజాన్ని సహజం అనే స్థాయికి తీసుకుపోతున్నారు. ఎల్‌కేజీ నుండే ప్రేమ వ్యవహారాలు చూపిస్తున్నారు. ప్రేమించవకపోతే మనిషే కాదు అని నేర్పుతున్నారు. వీటిలో మార్పు రావాలి. ఎక్కడైనా దాడి జరిగితే కొంతమందికి ఉరి వేస్తున్నారు. ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. దీని వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. అసలు ఈ నేరాలు జరగడానికి కారణం ఏంటి, మూలాలు ఎక్కడ ఉన్నాయి అనేది పరిశీలించాలి. మార్పు మూలాల నుండి రావాలి. అప్పుడే మహిళల మీద దాడులు తగ్గుతాయి. అలాగే మార్పు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. నా ఊపిరి ఉన్నంత వరకు సమాజంలో మార్పుకోసం కృషి చేయాలి అనేది నా బలమైన కోరిక. నేను ఏ స్థానంలో ఉన్నా సమాజం కోసం, మహిళల కోసమే పని చేస్తాను. సమాజ మార్పుకు శక్తివంతమైన ఆయుధం విద్య. ఆ విద్య అందరికీ అందుబాటులో ఉండాలి.



ప్రభుత్వ ద్వంద్వ వైఖరి

మహిళలు ఏ విషయంలోనైనా ధైర్యంగా ఉండాలి. అలా ఉండాలంటే ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. రేపటి సమాజాన్ని నిర్మించేది మహిళలు. అలాంటి మహిళలు ఆరోగ్యంగా ఉండాలి అనేది నా కోరిక. అయితే మహిళల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు ఆ సమస్యలకు కారణం మహిళనే అని నిందిస్తున్నారు. ఒక పక్క మీ బట్టలు సరిగా లేవు అందుకే అత్యాచారాలు జరుగుతున్నాయి అంటున్నారు. మరో పక్క నిండుగా బట్టలు వేసుకుంటున్న చోట హిజాబ్ ఎందుకు అంటున్నారు. ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నారు. బేటీ పడావో - బేటీ బచావో అనేవి నినాదాలకే పరిమితం అవుతున్నాయి.

– సలీమ

ఫొటోలు: పిప్పళ్ల వెంకట్

చెమట పడుతుందా..?



మెనోపాజ్ వయసులో కొన్ని సమస్యలు సర్వసాధారణం. అయితే నిద్రలో చెమటలు పట్టడమనేది తరచూ తలెత్తినా, దీంతో అసౌకర్యంగా అనిపించినా ఆలస్యం చేయకుండా నిపుణుల్ని సంప్రదించాలి. తద్వారా సమస్యేంటో తెలుసుకొని.. చికిత్స తీసుకోవాలి. దీంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు.

– మెనోపాజ్‌కు దగ్గరవుతున్న, మెనోపాజ్‌లో దశలో ఉన్న మహిళలు ఆహారంలో పలు మార్పులు చేర్పులు చేసుకోవాలి. ఈ క్రమంలో మసాలా, కారం.. వంటివి దూరం పెట్టాలి.

– బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల కూడా రాత్రుళ్ల చెమట సమస్యను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసుకుంటూనే.. వ్యాయామాలు చేయడం ముఖ్యం.

– కెఫీన్, మసాలాలు, కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, చాక్లెట్.. వంటి వాటిని ఎంత దూరం పెడితే అంత మంచిది.

– నిద్రించే ప్రదేశం చల్లగా ఉండేలా చూసుకోవాలి. అలాగే చల్లదనాన్ని పంచే పరుపులు, దిండ్లకు ప్రాధాన్యమివ్వడం ముఖ్యం.

– కొన్ని రకాల మందుల వల్ల ఈ సమస్య ఎదురవుతోందని గమనిస్తే వాటికి ప్రత్యామ్నాయంగా ఇతర మందులేవైనా వాడచ్చేమో నిపుణుల్ని అడిగి సలహా తీసుకోవడం మంచిది.

– మానసిక ఒత్తిళ్ల, ఆందోళనల్ని తగ్గించుకునేందుకు నచ్చిన పనులు చేయడం, ఆహారంలో అవసరమైన మార్పులు చేసుకోవడం మంచిది.

ఆదివాసీ అస్థిత్వానికి ఆర్ఎస్ఎస్ ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీ సంస్కృతికి బదులు హనుమంతుడు, రాముడు, దుర్గ, గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తూ ఆదివాసీలను హిందూ మతారాధకులుగా మార్చే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. జనగణన సర్వే పత్రంలో ఆదివాసి అనే పదం ఎక్కడా లేదని, జార్ఖండ్ ప్రభుత్వం గిరిజనులు అనే పదాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. జన గణనలో ఆదివాసీ అనే పదం లేకుంటే హిందూ అనే కాలమ్‌లోనే ఆదివాసీలు నమోదు అవుతారని, తద్వారా ఆదివాసీల ఉనికినే అత్యంత ప్రమాదంలోకి నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని అన్నారు. జనాభా సర్వే పట్టికలో ఆదివాసీ అనే పదం చేర్చాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ అధికార మంచ్‌కు 15 రాష్ట్రాల్లో అనుబంధ సంఘాలు ఉన్నట్టు చెప్పారు. మంచ్ ఆధ్వర్యంలో ఆదివాసీలను సంఘటితం చేస్తున్నట్టు తెలిపారు. మంచ్‌కు అనుబంధంగా సీఏఆర్‌డీ (కార్డ్) అనే సంస్థను నెలకొల్పి ఆదివాసీ ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వర్గాల గిరిజన సమస్యలపై సర్వేలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర సంఘం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆశయాల కోసం అమరులైన వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలని..అందుకు తాము తోడుంటామని హామీ ఇచ్చారు.

విజయవంతంగా ముగిసిన సభలు

సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మిడియం బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలు శనివారం నాటితో విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల నుంచి 260 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారు. మహాసభల ప్రారంభానికి ముందు మిడియం బాబురావు ముందుగా టీఏజీఎస్ పతాకాన్ని ఆవిష్కరించి కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేశారు. కుంజా బొజ్జి చిత్రపటానికి ఆహ్వాన కమిటీ అధ్యక్షులు రవివర్మ, సున్నం రాజయ్య చిత్రపటానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీమ్ రావు పూలమాలలు వేశారు. గత మహాసభ నుంచి నేటి వరకు మృతి చెందిన అమరవీరులకు మహాసభ సంతాపం ప్రకటించింది. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు మహాసభలనుద్దేశించి సంఘీభావం తెలియజేశారు. అధ్యక్షవర్గం మిడియం బాబురావు, కూసం సచిన్, సున్నం గంగా, నాయకులు కారం పుల్లయ్య, పి.సోమయ్య, వజ్జా సురేష్, నగేష్ తదితరులు మొత్తం 16 తీర్మానాలను మహాసభల్లో ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సభల్లో బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, దుగ్గి కృష్ణ, దబ్బకట్ల లక్ష్మయ్య, ఊకే వీరస్వామి, మడివి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని పంటల తెలంగాణ కావాల్నా.. మతం మంటల్లో ఉండే తెలంగాణ కావాల్నా..

(మొదటిపేజీ తరువాయి)

ఒక దిక్కు ఉన్నాడు.. 15 లక్షల మంది వలసలు ఆపి ఉపాధి కల్పించిన కేసీఆర్ మరో దిక్కు ఉన్నాడు. ఆలోచించి ఓటేయండి తప్పా ఆగం కాకండి.' అని మహబూబ్‌నగర్ జిల్లా ఓటర్లను కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని గతంలో మోడీ, అమిత్ షా చెప్పారని, మరి ఇచ్చారా..? అని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేండ్లు అవుతున్నా.. కృష్ణా నదిలో మన వాటా, ఏపీ వాటా తేల్చలేదన్నారు. రైతుల ఆదాయం పెంచలేదు కానీ అదానీ ఆదాయం పెంచిండు అని విమర్శించారు. 'గుజరాతోళ్ల చెప్పులు మోసేటోళ్లు మన రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. కానీ రోషం కల్ల తెలంగాణ బిడ్డలు, పాలమూరు పౌరుషంతో ఉండే తమ్ముళ్లంతా ఆలోచన చేయాలి. ఎవరు ఈ రాష్ట్రానికి మంచివారు. ఎవరి వల్ల ఈ రాష్ట్రంలోని రైతు బాగుపడుతాడు అనే విషయాన్ని ఆలోచించాలి' అన్నారు.. పెద్దలకు రుణాలు మాఫీ చేసే సన్నాసులు కావాల్నా. పేద ప్రజల కష్టాల్లో అండగా ఉండే కేసీఆర్ కావాల్నా తేల్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఎన్నికలు సమీపంచే కొద్ది చాలా మంది టూరిస్టులు వస్తారు.. మొన్ననే రేవంత్ రెడ్డి వచ్చి నోటికొచ్చినట్లు అడ్డగోలు మాటలు మాట్లాడారు. తెలంగాణను తెచ్చిన సీఎం, రెండు సార్లు ప్రజల చేత ఎన్నుకోబడ్డ సీఎం. కేసీఆర్‌ను గౌరవించకుండా నోటికొచ్చినట్టు నీచమైన మాటలు మాట్లాడిండు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని రేవంత్ రెడ్డి అడుగుతున్నారు. 55 ఏండ్లు పరిపాలించింది నీ సన్నాసి పార్టీ. ఆనాడు అధికారం ఇచ్చినప్పుడు అన్ని చేసి ఉంటే నేడు ఎందుకు సమస్యలు ఉంటుండే. తెలంగాణను భారతదేశంలో అగ్రశ్రేణి రాష్ట్రంగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం' అని కేటీఆర్ తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు పాలమూరు పౌరుషాన్ని చూపించాలని చెప్పారు.

పోడు పట్టాలు కొందరికేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఉప ఎన్నిక సందర్భంగా ఓ ప్రకటన చేశారు. "నేను అధికారులను వెంట పెట్టుకుని పర్సనల్‌గా నాగార్జున సాగర్ వస్తా. రెండు రోజులు ఇక్కడే ఉంటా. పోడు భూముల సమస్య పరిష్కరిస్తా. అందుకు ప్రజా దర్బార్ కూడా ఏర్పాటు చేస్తాం." అని కేసీఆర్ అప్పట్లో చెప్పారు.

జాప్యం కోసమే ప్రకటనలా?

పోడు పట్టాల పంపిణీ జాప్యం కోసమే ప్రకటనల మీద ప్రకటనలు చేస్తున్నారని విమర్శలున్నాయి. 2021 అక్టోబర్ 1వ తేదీన సీఎం మరో ప్రకటన చేశారు."పోడు భూముల వ్యవహారం తేలుస్తామని మేం హామీ ఇచ్చి ఉన్నాం. అటవీ అధికారులు, గిరిజనుల మధ్య గొడవలు ఉండటం, ఘర్షణపూరిత వాతావరణం ఉండటం ఏ రకంగానూ మంచిది కాదు. కాబట్టి సమస్య పరిష్కారం కావాలి." అని చెప్పారు. అంతకుముందు 2019 జులై 19న అసెంబ్లీలో మరో ప్రకటన చేశారు. "అన్ని జిల్లాలకు, అన్ని డివిజన్లకు నేనే స్వయంగా పోతా.. నేను ఒక్కడినే కాదు, మంత్రివర్గాన్ని, అధికార గణాన్ని, అటవీ శాఖ ఉన్నతాధికారులను, చీఫ్ సెక్రటరీని, రెవెన్యూ సెక్రటరీని అందర్ని తీసుకెళ్లి, ప్రజాదర్బార్ పెట్టి.. ఇదిగో ఇది పోడు భూమి.. ఇదిగో ఇది మీ పట్టా.. అని ఇచ్చేస్తాం." ఇలా ప్రకటన చేయగా..తాజాగా.."పోడు పట్టాలను త్వరలోనే పంచుతాం. గిరిజనులకు తప్పక తీపి కబురు చెబుతాం"మంటూ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఫిబ్రవరి 1న మీడియా సమావేశంలో చెప్పారు. ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీ తరఫున నివేదిక ప్రభుత్వానికి ఇచ్చామని తెలిపారు. ఇలా వివిధ సందర్భాల్లో ప్రకటనల మీద ప్రకటనలు చేస్తున్నారు. కానీ.. నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఎన్నికల వరకు ఇలానే సాగదీయాలనే వ్యూహంతో ప్రభుత్వం ఉన్నదా? అంటూ పోడు సాగుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారీ ఎన్నికలప్పుడు ఇది రాజకీయ అస్త్రంగా మారుతోందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని మరో పక్క గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి. ఆలస్యం కావటం వల్ల ఇప్పటికీ పలు జిల్లాల్లో పోడు భూముల విషయంలో అక్కడి అధికారులు, స్థానికుల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

54కు చేరిన మృతుల సంఖ్య

ఇంఫాల్ : బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో చెలరేగిన హింసాత్మక అల్లర్లలో 54 మంది మృతి చెందారు. ఈ సమాచారాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. మృతుల సంఖ్యపై శుక్రవారం వరకూ అధికారికంగా ఎలాంటి సమాచారమూ అందకపోవడంతో వివిధ వార్త సంస్థల్లో వచ్చిన కథనాలు, బాధితులు, ఆస్పత్రుల రికార్డుల మీదే ఆధారపడాల్సి వచ్చింది. మృతుల సంఖ్యపై ఈ గందరగోళం నేపథ్యంలో అధికారిక సమాచారం వెల్లడైంది. అయితే, ఈ మరణాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉన్నదని ఒక అంచనా.

ఇటు రాష్ట్రవ్యాప్తంగా భద్రతను సైతం కట్టుదిట్టం చేశారు. ఆర్మీ, పారామిలిటరీ, రిజర్వ్ పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. శుక్రవారం కూడా సాయుధ గుంపు మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 355ను కేంద్రం ప్రయోగించింది. దీంతో రాష్ట్ర భద్రత బాధ్యతను కేంద్రం తీసుకున్నది.

చనిపోయినవారిలో 16 మృతదేహాలు చురాచాంద్‌పూర్ జిల్లా ఆస్పత్రి, 15 మృతదేహాలను ఇంఫాల్ తూర్పు జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో, 23 శవాలను ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో భద్రపరిచారు. కాగా, ఇంఫాల్‌లో ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్‌తో సచివాలయంలో సమావేశమనంతరం వస్తున్న క్రమంలో నిరసనకారుల దాడికి గురైన బీజేపీ ఎమ్మెల్యే వుంగ్జాగిన్ వాల్టే ఢిల్లీకి పారిపోయినట్టు తెలిసింది. హింసను అణచివేయడానికి రాష్ట్ర ఇంటెలిజెన్స్ అదనపు డీజీ అశుతోశ్ సిన్హాను రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషనల్ కమాండర్‌గా నియమించింది. కాగా, అల్లర్లతో ప్రభావితమైన ప్రాంతాల నుంచి సుమారు 13 వేల మంది పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలో గత మూడు రోజులుగా తీవ్ర హింసాత్మక అల్లర్లతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ అల్లర్లను కట్టడి చేయడంలో రాష్ట్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం విఫలమైందని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు, రాష్ట్ర ప్రజలు అభిప్రాయపడ్డారు.

నిరుద్యోగులఆశలు నెరవేర్చని బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నిరుద్యోగుల ఆశలను బీఆర్ఎస్ సర్కారు నెరవేర్చలేదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే విమర్శించారు. ఈ క్రమంలోనే రానున్న కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులకు ఏం చేయబోతుందో చెప్పేందుకే 'నిరుద్యోగ డిక్లరేషన్' పేరుతో భరోసా పత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి కరువై నిరుద్యోగులు నిరుత్సాహంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యూత్ డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు జి. నిరంజన్, శివసేనారెడ్డి, నగేష్‌ముదిరాజ్, సునీతారావు, ఆడం సంతోష్, నూతి శ్రీకాంత్, ఫిరోజ్ ఖాన్‌తో కలిసి ఠాక్రే విలేకర్లతో మాట్లాడారు. నిరుద్యోగ యువ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యువత ఆకాంక్షలమేరకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆయన విమర్శించారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం : ఉత్తమ్

నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఉద్యోగాలు వస్తాయనే ఆశతోనే రాష్ట్ర సాధన కోసం యువత పోరాడిందని తెలిపారు. రాష్ట్రం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందన్నారు. గతంలో 25 లక్షలు నిరుద్యోగులు ఉంటే, ఇప్పుడు 40 లక్షల మందికి చేరారని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ అసమర్థత, అవినీతి వల్లే పరీక్ష పేపర్లు లీకు అయినట్టు తెలిపారు. వాటిపై సీఎం ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు.

కర్నాటకలో కాంగ్రెస్సే : బెల్లయ్యనాయక్

కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఏఐసీసీ ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షులు బెల్లయ్య నాయక్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ, అమిత్‌షా రెండుసార్లు సభకు ప్లాన్ చేసుకుని రద్దు చేసుకున్నారని గుర్తు చేశారు. మోడీకి అనుకూలమైన మీడియాలోనే బీజేపీ గెలుస్తుందని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రెజ్లర్లపై చైర్మెన్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఏడుస్తున్నా చర్యలు తీసుకోవడంలో మోడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ కూడ అస్తవ్యస్తంగా ఉందన్నారు.

దుర్మార్గాలు... దుష్ప్రచారాలు

(మొదటిపేజీ తరువాయి)

ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆయన వివరణ కోరారు. అయితే ఒక సభ్యుడు వార్తాపత్రికలో రాసిన వ్యాసం ఆధారంగా ఆయనకు ఎలా నోటీసు ఇస్తారో అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని అసాధారణ చర్యగా అభివర్ణిస్తున్నారు.తప్పుడు ప్రచారాలతో, అంకెల గారడీతో బీజేపీ నాయకులు కేరళపై చేస్తున్న దుష్ప్రచారం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. ప్రజలకు మార్గదర్శనం చేయాల్సిన ప్రధానే ఇలాంటి కువిమర్శలకు దిగడం విచారకరం. వాస్తవాలను మరుగుపరిచే ఇలాంటి ప్రయత్నాలను కేరళ ప్రజలు తప్పనిసరిగా తిప్పికొడతారనడంలో ఎలాంటి సందేహం లేదు.

హింసపై మౌనం ఎందుకు ?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ మరోసారి భావోద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. బజరంగ్‌దళ్‌కు, హనుమంతుడికి లంకె పెట్టి ఓట్లు దండుకోవాలని మోడీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది. మణిపూర్‌లో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించడానికి అక్కడి బీజేపీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ తెలిపింది. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అవసరమని ప్రధాని మోడీ చెబుతుంటారని, అయితే కేంద్రంలోనూ, మణిపూర్ లోనూ బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ మత హింస జరిగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ చెప్పారు. మణిపూర్ ఘటనలపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

బ్రిటన్ రాజు చార్లెస్-3కి పట్టాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

వందల ఏండ్ల నాటి సాంప్రదాయాల మధ్య రాజ కిరీటాన్ని ధరించి పట్టాభిక్తుడయ్యారు. చార్లెస్ సతీమణి కెమెల్లా కూడా రాణిగా కిరీటం ధరించారు. చట్టాన్ని పరిరక్షిస్తానని, దయ, కరుణలతో, న్యాయంతో పరిపాలన సాగిస్తానని చార్లెస్ ప్రమాణం చేశారు. అనంతరం ఇంగ్లండ్ చర్చికి విధేయుడైన క్రైస్తవునిగా కొనసాగుతానని మరో ప్రమాణం చేశారు. పట్టాభిషేకం ముగియగానే సభలో ప్రార్థనలు చేశారు. పట్టాభిషేక వేడుకల్లో ఈసారి భిను మతాల విశ్వాసాలను ప్రతిబింబించేలా ప్రార్థనలు వుంటాయని కాంటెర్‌బరీ ఆర్చిబిషప్ కార్యాలయం గతంలోనే ప్రకటించింది. ఈ సందర్భంగా బ్రిటన్ ప్రధానిరిషి సునాక్ బైబిల్‌లోని కొన్ని వాక్యాలను చదివి వినిపించారు. రాజు చార్లెస్‌కు పలువురు దేశాధినేతలు అభినందనలు తెలియచేస్తూ సందేశాలు పంపారు. భారత్ తరపున ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ దంపతులు ఈ కార్యక్రమానికి హజరయ్యారు. పట్టాభిషేకానికి ఆహ్వానం అందిన ముంబయి డబ్బావాలాలు 'పుణేరి పగడి'ని చార్లెస్‌కు బహుమతిగా అందచేశారు.

సైనికులు చనిపోతుంటే పట్టని ప్రధాని...

- రాజకీయ లబ్ధి కోసం 'కేరళ స్టోరీ' మాటలు :ఓవైసీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఒకవైపు సైనికులు చనిపోతుంటే అవేవి పట్టించుకోకుండా ప్రధాని మోడీ రాజకీయ లబ్ధి కోసం 'ది కేరళ స్టోరీ' గురించి మాట్లాడుతున్నారని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి అసత్యాలు, తప్పుడు ప్రచారాలతో కూడిన కేరళ స్టోరీని ఉపయోగించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని మాట్లాడుతున్న వీడియోను ఓవైసీ షేర్ చేశారు.

టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాబూరావు,సచిన్

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం-టీఏజీఎస్ రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ మిడియం బాబూరావు, పూసం సచిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సమ్మక్క-సారలమ్మ ఫంక్షన్ హాల్ కుంజా బొజ్జి, సున్నం రాజయ్య నగర్‌లో నిర్వహించిన మహాసభల్లో శనివారం ఈ ఎన్నిక జరిగింది. 34 మందితో కూడిన టీఏజీఎస్ రాష్ట్ర నూతన కమిటీ వివరాలను సీనియర్ నాయకులు పి.సోమయ్య ప్రకటించా రు. సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా భద్రాచలం మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బండారు రవికుమార్, పి.సోమయ్య, తోడసం భీమ్రావ్, మెస్రం రాజు, సున్నం గంగ, దబ్బకట్ల లక్ష్మయ్య ఎన్నికయ్యారు. నూతన ప్రధాన కార్యదర్శిగా కూసం సచిన్ ఎన్నిక కాగా సహాయ కార్యదర్శులుగా కారం పుల్లయ్య, ఎర్మ పున్నం, బైరి సోమేశ్, సరియం కోటేశ్వరరావు, పొలం రాజేందర్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, ఆహ్వానితులుగా లంకా రాఘవులు, సూడి కృష్ణారెడ్డి, కోటా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ కమిటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచే ఆరుగురికి చోటు లభించింది.

క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తాం

నవతెలంగాణ-ఓయూ



బ్లైండ్ ఫుట్ బాల్ క్రీడలో రాణిస్తున్న క్రీడాకారులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత హామీనిచ్చారు. యూకేలో జరగబోయే ఏషియా వరల్డ్ బ్లైండ్ ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన నాగ గేయని, జాతీయ పోటీలకు రాణిస్తున్న అఖిలేష్‌లను తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డితో కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారిని అన్నివిధాలా ప్రోత్సహిస్తున్న మహేందర్ రెడ్డిని అభినందించారు. తెలంగాణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం రావడం ఈ ప్రాంతానికి గర్వకారణమని ప్రశంసించారు. బ్లైండ్ ఫుట్ బాల్ క్రీడాకారులకు ప్రభుత్వం తరపున తోడ్పాటు అందేలా కృషి చేస్తామని చెప్పారు.

టీఎస్పీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలి

నవతెలంగాణ-ఓయూ



టీఎస్పీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. శనివారం బోర్డు సెక్రెటరీ అనితా రామచంద్రన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షను ఆగస్టులో కాకుండా నవంబర్‌లో నిర్వహించాలని కోరారు. రెండు నెలలుగా పేపర్ లీకేజీ అంశం, గ్రూప్-2, గ్రూప్-3, పేపర్-2 పాలిటి, పేపర్-3 ఎకానమీ సిలబస్‌లో 60 నుంచి 70 శాతం వరకు కొత్త అంశాలు చేర్చినట్టు తెలిపారు. పేపర్ లీకేజీ కారణంగా తాము మానసికంగా ఇబ్బంది పడినట్టు తెలిపారు. సమయం తక్కువగా ఉన్నందున పోస్ట్ పోన్ చేయాలని టీఎస్పీఎస్సీ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ అంశం పట్ల బోర్డు సెక్రెటరీ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. పోస్ట్ పోన్ చేసే దిశగా ప్రయత్నం చేస్తామని హామీనిచ్చినట్టు తెలిపారు.

అర్హులైన పేదలకు లబ్ది చేకూరే విధంగా ఇండ్లు పంపిణీ చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్

నవతెలంగాణ-ధూల్‌పేట్



ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు లబ్ది చేకూరే విధంగా నిర్మించి పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఇండ్ల సాధన సదస్సు చాంద్రాయణగుట్టలోని గౌస్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో లక్ష ఇండ్లు నిర్మించి పేదలకు, అర్హులైన వారికి లబ్ది చేకూరే విధంగా పంపిణీ చేస్తామన్నారన్నారు. ఇప్పటికె కొన్నేండ్లు గడిచి పోయినా డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ మాత్రం జరగలేదన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు వస్తాయని కోటి ఆశలతో పేద ప్రజలు వేచి చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక కొలిక్కి రాని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే నిర్మాణం పూర్తయినా డబుల్ ఇండ్లు అర్హులైన స్థానిక పేదలకు గుర్తించి కేటాయించాలని డిమాండ్ చేశారు. గౌస్‌నగర్‌లో ఇప్పటికే పూర్తయిన ఇండ్లు ఉన్నాయనీ, వాటిని అక్కడ నివసించే పేదలకు పంపిణీ చేయాలన్నారు. చాలా మంది ఇండ్లు లేని వారు కిరాయి ఇండ్లలో నివసిస్తూ అద్దెలు చెల్లించలేని స్థితిలో ఉన్నారనీ, వారికి స్థానికత ఆధారంగా గుర్తించి ఇండ్లు లేని నిజమైన పేదకు ఇండ్లు ఇవ్వాలనీ, లేని పక్షంలో పేదలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కిషన్, కృష్ణ, స్వామి, జీవన్, శ్రీను, మీరాజ్, అశ్మ, పర్వీన్, ఎండీ గౌస్, రషీద్ పాల్గొన్నారు.

బీజేపీ, ఎంఐఎం అనుబంధం దేశానికి ప్రమాదకరం



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నరసింహ

నవతెలంగాణ-అంబర్‌పేట

తమ స్వార్ధ మతతత్వ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య ఘర్షణలు సృష్టిస్తూ బీజేపీ ఎంఐఎంతో కొనసాగిస్తున్న అనుబంధం దేశానికి ప్రమాదకరం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీయేతర ఓట్లు విభజించడం ద్వారా బీజేపీని గెలిపించాలనే కచ్చితమైన లక్ష్యంతో ఎంఐఎం దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయాల్లోకి అడుగు పెట్టిందనీ, ఇది వాస్తవమనీ, బీజేపీ ఎంఐఎం మధ్య కచ్చితమైన చీకటి ఒప్పందం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక ఫాసిస్ట్ విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని కోరుతూ "బీజేపీ హటావ్-దేశ్ బచావ్" నినాదంతో తిలక్‌నగర్, నల్లకుంట, విద్యానగర్, శివమ్ రోడ్ ప్రాంతాల్లో శనివారం సీపీఐ పాదయాత్ర నిర్వహించింది. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం ఇంటింటికీ, వ్యాపార సముదాయాలు తిరిగి కరపత్రాలను పంచుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ బీజేపీ ఫాసిస్టు భావజాలం దేశ శాంతి, సుస్థిరతకు ముప్పు కలిగిస్తుందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సామాజిక అశాంతితో లక్షలాది మంది ప్రజలు జీవన వ్యయ సంక్షోభంతో పేదరికంలోకి నెట్టవేయబడుతున్నారనీ, ఇవేవి పట్టించుకోకుండా ప్రధాని మోడీ మాత్రం మౌన దీక్షలో ఉంటాడన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం, హక్కులను కాలరాయడం, చట్టాలను దుర్వినియోగం చేయడం వంటి క్రూరమైన విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలను కోరారు. ఛాయాదేవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వల్ల అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లు తప్ప సామాన్య ప్రజలు ఎవరూ లబ్ది పొందలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మతతత్వ రాజకీయాలు చేయడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం తప్ప ప్రజా సంక్షేమానికి ఎప్పుడు పాటుపడలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నిరంకుశ పాలన కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు 2024 ఎన్నికల్లో ఓడించి ప్రజాస్వామ్యం నిర్ణయాత్మక విజయానికి మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేశారు. బి.వెంకటేశం మాట్లాడుతూ నిరుద్యోగం, ధరల పెరుగుదలను ఎదుర్కోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమై తన అసమర్థతను నిరూపించుకుందన్నారు. ఎనిమిదేండ్ల పాలనలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు ఏఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. మోసపూరిత మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓడించి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నగర నేతలు నిర్లేకంటి శ్రీకాంత్, బైరగోని రాజు గౌడ్, వెంకట్ స్వామి గౌడ్, సీహెచ్. శ్రీనివాస్, ఎండి. ఒమర్ ఖాన్, భూపాల్, లతీఫ్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా టీచర్లను పర్మినెంట్‌గా విధుల్లోకి తీసుకోవాలి



- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 937 మంది కస్తూర్బా టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కస్తూర్బా పాఠశాలల్లో పర్మినెంట్‌గా టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని పలు జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది కస్తూర్బా పాఠశాల టీచర్లు ముట్టడించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 937 మంది కస్తూర్బా పాఠశాల టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండేండ్ల క్రితం అక్టోబర్ మాసంలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ జీవో నెం.1321 తేది: 19/10/2021న ఆర్డర్స్ ఇస్తూ కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో 937 టీచర్ పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేశారని గుర్తు చేశారు. ఆ జీవోలో కాంట్రాక్టు టీచర్లుగా భర్తీ చేయాలని స్పష్టంగా ఉందన్నారు. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం ఈ విషయాన్ని దాటవేస్తున్నారన్నారు. ప్రతి ఏడాదీ వారిని మార్చిలో టర్మినేట్ చేస్తున్నారనీ, ప్రస్తుతం ఉన్న 937 మంది టీచర్లను మెరిట్ పై నియామకం చేసి కేజీబీవీలలో బోధకులుగా పని చేస్తున్నప్పటికీ వారికి పూర్తిగా ఆదేశాలు ఇవ్వడం లేదన్నారు. వీరిని ప్రతి ఏటా మార్చిలో టర్మినేట్ చేస్తూ మళ్లీ ఆగస్టులో తీసుకుంటున్నారని తెలిపారు. పని చేస్తున్న తాత్కాలిక పోస్టుల్లో మళ్లీ తాత్కాలిక ఉద్యోగులను నియమించవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రతి ఏడాదీ విద్యాశాఖ అధికారులు కొత్త వారిని నియమిస్తూ వారిని బెదిరిస్తున్నారని తెలిపారు. 2021 నవంబర్ నుంచి పని చేస్తున్న 937 టీచర్లను యధాతధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీరిని ప్రతి ఏటా తొలగించి కొత్తగా నియమిస్తే సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడమే అవుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీంకోర్టు తీర్పు నిబంధన ప్రకారం వీరికి కనీసం చేసిన పని దినాలకు సరైన వేతనం చెల్లించడం లేదన్నారు. కేజీబీవీలో కాంటాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పాత ఉద్యోగులతో సమానంగా డే అండ్ నైట్ డ్యూటీలు, పండుగలు, హాలిడేస్ డ్యూటీలను సమానంగా చేశారనీ, వీరిని వాళ్లతో సమానంగా భావించి ఆర్డర్ ఆఫ్ మెరిట్ కాపీలను ఇప్పించి, పీఆర్సీని వర్తింపచేయాలని కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయనీ, కార్పొరేట్ స్కూళ్లకు ప్రభుత్వం దారదత్తం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను వెంటనే పటిష్టం చేయాలనీ, లేకపోతే విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిపోయి సమాజంలో రౌడీలు, గూండాలుగా తయారవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ, బీసీ నాయకులు భూపేష్‌సాగర్, అంజి, అనంతయ్య, నాని, నిఖిల్, రాందేవ్, పాల్గొన్నారు.



గౌడ జనాభా దామాషా ప్రకారం పార్లమెంటు సీట్లు కేటాయించాలి

- తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

తెలంగాణ-ముషీరాబాద్

గౌడ జనాభా దామాషా ప్రకారం పార్లమెంటు స్థానాలు కేటాయించాలనీ, కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడ సామాజికవర్గం సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక పొందుపర్చాలని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా గాంధీభవన్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిక్కడపల్లిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైన్సులు, బార్లు 50 శాతం గౌడ సామాజిక వర్గానికి కేటాయించాలన్నారు. కలుగీత కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు కేటాయించి విధి విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడ్డ జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ బాలగౌని బాలరాజు గౌడ్, కన్వీనర్ ఐలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మెన్ వెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల్లో భయం మొదలైంది

- తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జలకాంతం

నవతెలంగాణ-బంజారాహిల్స్



ప్రపంచంలో ఎక్కడలేని విధంగా 125 అడుగులు బీఆర్ అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక చిహ్నం ఏర్పాటు చేయడం, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడాన్ని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జెల కాంతం ఆధ్వర్యంలో ధన్యవాద సభ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. శనివారం గన్ పార్క్ వద్ద తెలంగాణ ప్రజా సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోనూ ధన్యవాద సభలు జరుపుతామని చెప్పారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం గర్వకారణమన్నారు. దీన్ని ఓర్వలేని వారు కొంత మంది ఉన్నారనీ, అందులో ఒక్కటి బీజేపీ నాయకుల తట్టుకోలేక పోతున్నరని చెప్పారు. తెలంగాణలో జరిగే అభివృద్ధి దేశంలో ఎక్కడా జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తారని భయం బీజేపీ నాయకుల్లో మొదలైందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నోరు తెరిస్తే అబద్దాలడుతున్నారన్నారు. హిందువులు అని చెప్పుకుంటారే తప్పా వారికి ఇచ్చిన వాగ్దానాలను ఎరవేర్చడం లేదన్నారు. యువతకు 2కోట్ల ఉద్యోగాలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అధికారంలో వచ్చేముందు అవినీతిమయ దేశానికి తాము దీక్షులం అని ప్రగల్భాలు పలికిన బీజేపీ నాయకులు నల్లధనం తీసుకొస్తామని చెప్పి ఏండ్లు గడిచినా ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ వేదిస్తున్నారనీ, మహిళా క్రీడాకారిణులు ధర్నా చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీని దేశం నుంచి తరిమి కొట్టి రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు ఉదోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు, సంచార జాతుల సంఘం అధ్యక్షులు కోల రాములు, బీజే సంఘాల జేఏసీ చైర్మెన్ ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్ని, గిరిజన రాష్ట్ర నాయకులు డాక్టర్ బానోత్ సంజీవ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని గజానంద్ గడ్డ నుండి పాముల బస్తీకి వెళ్లే దారిలో సిమెంట్ రోడ్డు పనులను కార్పొరేటర్ జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గజానంద్ గడ్డ నుండి పాముల బస్తీకి వెళ్లే సిమెంటు రోడ్డును తవ్వి అలాగే వదిలేయడంతో స్థానిక ప్రజలు, వచ్చిపోయే వారికి, అనేకమందికి ఇబ్బందులు కలుగుతుందనీ, ఇప్పటికైనా పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సిమెంట్ రోడ్డు వేసిన తర్వాత నీటితో సరైన క్యూరింగ్ జరిగే విధంగా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి అజయ్ కుమార్, నాయకులు మిరియాల శ్రీనివాస్, విజయ్ కుమార్, బాలకృష్ణ, గుగ్గిళ్ళ శ్రీనివాస్, రవీందర్ వంజరి, అనిల్ రామ్, నర్సింగ్‌రావు ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, యాదగిరి, స్వామి, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ అయిన ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆరు మంది లబ్దిదారులకు రూ.2 లక్షలా 46వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మందికి ఉపయోగకరంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ పేద ప్రజల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆయన ముందు నిలబడి అండగా ఉంటారనీ, అందులో భాగంగానే వివిధ అనారోగ్య కారణాల వల్ల చికిత్సలు చేయించుకున్న పేద ప్రజలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటుమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల ఆత్మబంధువు నారాయణస్వామి



- హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-బంజారాహిల్స్

కార్మికుల ఆత్మబంధువు నారాయణస్వామి అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా ఆయన వలస జననేస్తం తెలుగు పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులు డాక్టర్ పజల్లుల్లా ఖాన్ ఆంగ్లంలో అనువాదించిన "ద అన్ స్పోకెన్ లీడర్" పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 86 శాతం అసంఘటిత కార్మికులు భారతదేశంలో ఉన్నారన్నారు. నైపుణ్యత ఉంటే కార్మికులు రనించవచ్చునీ సీనియర్ పాత్రికేయులు పూలూరి నారాయణ స్వామి లాగే అంకిత భావంతో పని చేయలని సూచించారు. తాను కేంద్రమంత్రిగా కార్మికశాఖ మంత్రిగా చేయడంతో తన జీవితం ధన్యమైందన్నారు. రాష్ట్రంలో 15 లక్షలు వలస కార్మికులు ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో కూడా 15 లక్షల వరకు ఉన్నారనీ, రెండు తెలుగు రాష్ట్రాల్లో 30 లక్షల మంది కార్మికులు వివిధ దేశాల్లో పని చేస్తున్నారని తెలిపారు. కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసిందనీ, ముఖ్యంగా పెన్షన్, ఆరోగ్య సంరక్షణ బీమా సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. కార్మికుల నిధులు, ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించి దుర్వినియోగం చేయడం మంచిది కాదని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. నారాయణ స్వామి కుమారులు కిరణ్ భార్గవ్ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఆంగ్లంలో రచించడం వల్ల తన తండ్రి సేవలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. తాను ఆ సేవను ముందుకు కొనసాగించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ మీడియా సంఘం మాజీ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు దిలీప్ రెడ్డి, కల్యాణ్, మై గ్రాంట్స్ రైటర్స్ కౌన్సిలింగ్ ప్రధాన కార్యదర్శి ఎండి ఎలియాస్, న్యాయవాది శశి కిరణ్, పాలమూరు మైగ్రాంట్స్ లేబర్ యూనియన్ సెక్రెటరీ అబ్రహం, ఎండి సలీం, షోయబుల్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన గురుకులాల సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-సిటీబ్యూరో



15 రోజులుగా గురుకుల విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిబిరం ముగిసింది. నగరంలోని ఫలక్‌నుమా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వి.జయంతి అధ్యక్షతన శనివారం ముగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, స్కిట్లతో అలరించారు. ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రధాన కార్యాలయం నుంచి ఓఎస్‌డీ చంద్రకాంత్‌రెడ్డి, టెక్నికల్ డీఎస్ వెంకటరమణ, ఫలక్‌నుమా సీఐ రాఘవేంద్ర, హెచ్ఆర్ఆర్ ఈస్ట్ ఆర్‌సీఓ నాగకళ్యాణి, మహేంద్రహిల్స్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వినోల, పేరెంట్స్ కమిటీ సభ్యులు మల్లేశ్, దరశరథ, స్వామి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



'యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్' ఆపన్న హస్తం

నవతెలంగాణ-అంబర్‌పేట



ఆపదలో ఉన్న వారికి, ఎక్కడ బ్లడ్ అవసరం ఉన్నా మొదటగా గుర్తుకు వచ్చేది యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జర్పుల బాలు. ఇతను వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలంలో పని చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న బాలుకు మొదటి నుంచి సేవా కార్యక్రమాలపై ఆసక్తి ఎక్కువే. బాలు పని చేసే పాఠశాలలో సిలబస్‌లో లేని ఎన్నో యాక్టివిటీస్ పిల్లలతో చేయిస్తుంటారు. స్వచ్ఛ పాఠశాలగా తీర్చిదిద్దుతారు. కొవిడ్ టైంలో పేషంట్లకు కావల్సిన మందులు, హాస్పిటల్‌లో బెడ్స్, ఆక్సిజన్, భోజనాలు ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాల్లో అవసరం ఉన్న వారికి రక్తదాతలను ఏర్పాటు చేస్తుంటారు. ఇప్పటి వరకు 15 వేల మందికి రక్తదానం చేయించారు. పేద విద్యార్థులకు ఇతర ఎన్జీవోల సహకారంతో ల్యాప్ ట్యాప్‌లు, బుక్స్, మెటీరియల్స్ ఎరెంజ్ చేస్తుంటారు. నిరుపేదలకు ఆర్థిక సాయం చేయిస్తారు. బాలు జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఎన్నో సత్కారాలు పొందారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఇప్పుడు బెస్ట్ సోషల్ సర్వీస్ చేసే వారికి బాలు తన ఫౌండేషన్ తరపున అవార్డులు ఇస్తుండటం విశేషం. వీరి ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా గతేడాది ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఏపీ అండ్ తెలంగాణ స్టేట్‌లలో బెస్ట్ సోషల్ సర్వీస్ చేసే వారికి ఘన సన్మానం చేశారు. వీరి సేవలను సోనుసూద్ మెచ్చుకున్నారు. ఇంటికొక రక్త దాతను తయారు చేయడమే లక్ష్యంగా చేసుకుని సర్వీస్ చేస్తున్నారు. రక్త దానం, సంబంధిత సహాయ చర్యల కోసం యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ 97051 93913ను సంప్రదించగలరు.

చిక్కడపల్లి పోలీసులకు రివార్డులు

నవతెలంగాణ-ముషీరాబాద్

వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిక్కడపల్లి పోలీస్ అధికారులకు హైదరాబాద్ నగర కమిషనర్ సీవీ ఆనంద్ శనివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, ఎస్సై సందీప్ రెడ్డి, శశి పాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సుశీల్ మిత్ర, కానిస్టేబుల్స్ రామాంజనేయులు, శ్రీకాంత్, ప్రశాంత్, రమేష్, రవీందర్, స్వామి, ప్రవీణ్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ జోహ్రా ఫాతిమా అవార్డులు అందుకున్నారు. అనంతరం సీపీ వారిని అభినందించారు.



నాయిని నర్సింహారెడ్డి పౌండేషన్ మెమోరియల్ క్రికెట్ లీగ్-2 ప్రారంభం

నవతెలంగాణ-అడిక్‌మెట్



నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెమోరియల్ క్రికెట్ లీగ్ టు క్రికెట్ పోటీలు శనివారం అటహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందిరా పార్క్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను సెంట్రల్ జోన్, రాజేంద్రనగర్ డీసీపీలు వెంకటేశ్వర్లు జగదీశ్వర్ రెడ్డి, చిక్కడపల్లి ఏసీబీ యాదగిరి, ఫౌండేషన్ ప్రెసిడెంట్ సమతారెడ్డి టాస్ వేసి మ్యాచులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో దాదాపు 100కు పైగా టీంలు పాల్గొంటారని తెలిపారు. మొదటిరోజు క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్ గాంధీనగర్, నల్లకుంట చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అజయ్ 18 బంతుల్లో 65 పరుగులు చేసి అజయంగా నిలిచాడు. క్రికెట్ లీగ్ మ్యాచుల్లో పాల్గొనే టీమ్‌లకు ప్రత్యేక వసతులతో పాటు గ్రౌండ్‌లో అంబులెన్స్ సౌకర్యం కూడా కల్పించామని తెలిపారు. నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ద్వారా నిర్వహించే క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా సే నో టు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు కలవ గోపి, నేత శ్రీను, బలకరి రమేష్, సిరిగిరి శ్యామ్, కిరణ్ టక్కరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్ పర్సన్‌గా ధనలక్ష్మి



నవతెలంగాణ-అంబర్‌పేట

యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్ పర్సన్‌గా ధనలక్ష్మిని యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నేషనల్ ప్రెసిడెంట్ ఆరుట్ల అంజిరెడ్డి చేతుల మీదగా శనివారం ధనలక్ష్మికి నియమకపాత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పెద్దలక్కు కృతజ్ఞతలు తెలిపారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారించాలి

- కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆమె ఎలక్ట్రికల్ డీఈ సుశీంద్రనాథ్, ఏడీ రామా చారిలను కలిసి కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మట్లాడుతూ... డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్, మారుతీ నగర్, వెస్ట్ వెంకటాపురం, భూదేవి నగర్, శివ నగర్, వెంకటాపురం రాజీవ్ గాంధీ నగర్, ఇంద్రానగర్, కానాజిగూడ తదితర ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్యలు ఉన్నాయని, త్రీ ఫేస్ కరెంట్ పునరుద్దరించాలని అధికారులను కోరారు.

పబ్లిక్ టాయిలెట్ల కోసం స్థల పరిశీలన

నవతెలంగాణ-కంటోన్మెంట్



మోండా డివిజన్‌లోనిః పాట్ మార్కెట్, మీట్ మార్కెట్లలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేసేందుకు శనివారం కార్పొరేటర్ దీపిక స్థల పరిశీలన చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సంవత్సరాలుగా టాయిలెట్ నిర్మాణాల పనులు ప్రతిపాదనలో ఉన్నాయని అయితే ప్రస్తుతం వ్యాపారస్తుల అవసరం తక్షణమే ఈ నిర్మాణాలు చేపట్టేందుకు స్థల పరిశీలన చేశామని పేర్కొన్నారు.

దేశంలో 'తెలంగాణ' మోడల్‌గా ఉంది

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- నాగారంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



దేశంలో మోడల్ రాష్ట్రంగా తెలంగాణ మారిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డీ అన్నారు. శనివారం నాగారం మున్సిపల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అభివద్ధి సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడానికి నిరంతరం కషి చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది ఏమి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ఇతర రాష్ట్రాలలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలియజేశారు. నాగారం మున్సిపాల్టీలో ప్రధాన సమస్య గా ఉన్న రోడ్డు సమస్య కోసం నాగారం ,రాంపల్లి ,చర్లపల్లి నుంచి కరింగుడా రోడ్డు కు రూ ,209 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి , బీఆర్ఎస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు తెల్ల శ్రీధర్ , వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు ,పార్టీ నేతలు హాజరయ్యారు.



ఎంఈఎస్ దారిలో మురుగు పరుగు..

- రోడ్డుపై పారుతున్నా పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ- నేరేడ్ మెట్



అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీ వెంకటాపురంకు వెళ్లే దారిలో డ్రయినేజీ నీరు రోడ్లపై పారుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే దారిలో అనునిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రాకపోకలు సాగిస్తుంటారే తప్ప, కన్నెత్తి చూడరని, ఈ సమస్యను పరిష్కరించే నాధుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో తరుచూ ఈ సమస్య తలెత్తుతుందని స్థానికులు తెలిపారు. ఈ దారిన వెళ్ళే పాదచారులు ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన దుస్థి తి ఏర్పడింది. దుర్వాసనను భరించ లేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం అయిందంటే చాలు డ్రయినేజీ నీరు రోడ్డు పైకి చేరి పరిసరాలు మరింత అపరిశుభ్రంగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనాలు వేగంతో అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అనునిత్యం డ్రయినేజీ నీరు రోడ్డుపై చేరుతుండటంతో గుంతలు పడ్డాయని, చిన్న పాటి వర్షం వస్తే సమస్య తీవ్రంగా ఉంటోందని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. అంతే కాకుండా ఈగలు, దోమలు వద్ధి చెందాయని, సాయంత్రమైతే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కాప్రా



మేడ్చల్ జిల్లా చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మేడే వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా గండూరి ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రహమతుల్లా, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, చంద్రశేఖర్ హాజరై ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యల పైన కూడా పనిచేయడం అభినందనీయం అన్నారు రక్తదానం ప్రాణదానం లాంటిదని చెప్పారు. రాబోయే కాలంలో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించి కార్మికులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసులు, నాయకులు ఎమ్మెస్ రావు , టి.నరసింహ, జె వెంకటేష్, మణికంఠ, ఆదాం, కెవిఆర్ సురేష్ ,సోమ చారి , శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

9న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శ్మశాన వాటిక ప్రారంభం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట శ్మశాన వాటికను ఈ నెల 9న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. నూతనంగా నిర్మించిన బేగంపేట శ్మశాన వాటికను అధికారులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అడ్డంకులు తప్పించుకుని నేడు హైదరాబాద్ మహానగరంలో అత్యంత సుందరంగా స్మశాన వాటిక నిర్మించామని చెప్పారు. బేగంపేట వాసుల దశాబ్దాల కల నెరవేరబోతుందని ఇది కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో సాధ్యమైం దన్నారు. ఎంతోమంది పాలకులు చేయలేని పని కేవలం 9 ఏండ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో చేసి చూపిస్తున్నారని అన్నారు.. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దినసరి కార్మికుల వాహనాలకు చలాన్‌ను విధించవద్దు



- సీపీ ఆనంద్‌ను కోరిన క్రిశాంక్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలోని రెండో వార్డ్ అన్నా నగర్‌లో జీవనోపాధి కోసం ఆటో ట్రాలీలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికుల ఆటోలు అన్నానగర్-బీరప్ప గుడి రోడ్డులో పార్కింగ్ చేసుకుంటారని.. అయితే వారి వాహనాలకు పోలీసులు తరచూ చలాన్లు విధిస్తున్నారని తెలంగాణ ఖనిజ సంపద చైర్మెన్ క్రిశాంక్ సీపీ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం క్రిశాంక్ సీపీ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. పేద కార్మికులు రాత్రుల సమయంలో వాహనాలను అన్నానగర్-బీరప్ప గుడి రోడ్డులో పార్కింగ్ చేసుకుంటారని కాగా పోలీసులు వందలాది వాహనాలకు చలాన్‌లు, పెట్టి కేసులతో జరిమానా విధిస్తున్నారని, వారిని ఇబ్బంది పాలు చేస్తున్నారని క్రిశాంక్ తెలిపారు. వారికి న్యాయం చేయాలని సీపీని కోరారు. ఈ వాహనాలతో వారు ఉపాధి పొందతున్నారని, ట్రాఫిక్ క్రమశిక్షణ కూడా అవసరమని తెలియజేస్తూ ఈ సమస్యను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని లేఖలో పేర్కొన్నారు.

ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్వర్ణ దంపతులు వారి పెండ్లి రోజును పురస్కరించుకుని శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ పండితులు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వారికి తీర్ధప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయం లోపల భక్తుల కోసం వ్యాపారి సురేష్ అనే దాత సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా రూ. 15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి అరుణ గౌడ్, మల్లిఖార్జున్ గౌడ్, కిరణ్మయి, ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నంది కంటి శ్రీధర్ అన్నారు. శనివారం వినాయకనగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, శివ సాయి నగర్ లలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, 80 గజాల లోపు స్థలమున్న పేదలకు ఇల్లు నిర్మాణం కోసం రూ. 5 లక్షల రుణ సహాయం అందచేస్తా మని తెలిపారు. నిరుద్యోగులకు రూ. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఆరోగ్యశ్రీ పరమితిని రూ.5 లక్షల వరకు పెంచుతామన్నారు. ఇవన్నీ అర్థం చేసుకొని వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వినాయక నగర్ డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, ఎంఆర్ శ్రీనివాస్ యాదవ్, సాయికుమార్, దుర్గా సాయి, నరసింహ గౌడ్, గిరి యాదవ్, సురేందర్ రెడ్డి, బాలకృష్ణ, అమర్నాథ్, సంజీవ్ యాదవ్, పిడుగు వెంకటేష్, మోమిన్ భాష, ఆశ, సాయిరాం పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-మల్కాజిగిరి

డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, డ్రయినేజీ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ శనివారం జలమండలి అధికారి వేణుగోపాల్ నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని ఎన్ఎండీసీ కాలనీలో డ్రయినేజీ మ్యాన్ హెూల్ పొంగి రోడ్డు మీదకు వాటర్ ఓవర్ ఫ్లో అవ్వడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మోటార్ తో చేపడుతున్న పంపింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కాలనీలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓరుగంటి రమేష్, భాస్కర్,కిషోర్ తదితరులు పాల్గొన్నారు

కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివ సాయి కాలనీ, శ్రీ గణేష్ కాలనీల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శనివారం పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు కొన్ని డ్రయినేజీ లైన్‌లు, ఎలక్ట్రిక్ పోల్స్, మంచి నీటి పైప్ లైన్ కావాలని కోరడంతో వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి, సమస్యను త్వరగా పరిష్కరించాలని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి ,రాజేశ్వర్ రెడ్డి ,శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, ధనుంజయ్ గౌడు, రాజు గౌడ్, నరసింహ వంశి రాజు, ముత్యాలు, భానుచందర్ ,మురళి గౌడ్ వెంకట్ రెడ్డి, గణేష్ గౌడ్,శేఖర్ నాయక్, రాములు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాపై మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ శివ సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్డును కబ్జా చేసి నిబంధనకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిపై మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు కాసుల రవీందర్ గౌడ్ కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ శంకర్‌ను ఆయన కలిసి అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిపై, రోడ్డు కబ్జాపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాసుల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ... శివ సాయి నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4లో... ప్లాట్ నెంబర్ 3 బీ యజమాని ప్లాటు చుట్టూ ఉన్న మూడు వైపులా సీసీ రోడ్డును యథేచ్ఛగా... కబ్జా చేసి ఇంటిని నిర్మిస్తున్నారని ఆరోపించారు. దాంతో రోడ్డు కూచించకపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్డు చిన్నగా మారడంతో వీధుల్లో ప్రమాదాలు జరుగుతు న్నాయని తెలిపారు. అలాగే జీ ప్లస్ టూ ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని... అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నాడని ఆరోపించాడు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తూ... జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నాడని పేర్కొ న్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇంటిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. అలాగే అక్రమ నిర్మాణం పై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

కంటోన్మెంట్ బోర్డ్ ఐదో వార్డులో ఆత్మీయ సమ్మేళనం

- పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ బోర్డ్ ఐదో వార్డ్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ,కంటోన్మెంట్ నియోజకవర్ వర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్ఖానాలోని గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ నగర ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్, కార్పొరేషన్ చైర్మెన్‌లు క్రిశాంక్ , గజ్జల నగేష్, మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి మాజీ సభ్యులతో పాటు పలువురు కార్యకర్తలు ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్‌ను అధికారంలో తెచ్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కేసీఆర్ చేసినటువంటి అభివృద్ధి పనులను తోందరగా చేపడా తామని వివరించారు.

జలమండలి సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ రమణా రెడ్డి మృతి

- సంతాపం తెలిపిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి సికింద్రాబాద్ విభాగంలో పనిచేస్తున్న జనరల్ మేనేజర్ రమణా రెడ్డి శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మతి పట్ల గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రంతి వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన అధికారిగా అయన విశిష్ట సేవలను అందించి తన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. అయన మతి బాధాకరమని, రమణా రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇదిలాఉండగా రమణా రెడ్డి మృతి తీరనిలోటని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు అన్నారు. రమణా రెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

కల్వర్టు పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ పరిధిలోని చిన్న చర్లపల్లి-రాంపల్లి రహదారిలో జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న కల్వర్టు పనులను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. వేసవి సెలవులు ఉన్నాయి కాబట్టి పిల్లలు అటు వైపు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి చుట్టూ బారికేడ్లను, ఒక సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కాంట్రాక్టరు, అధికారులకు సూచించారు.వర్షాకాలం మొదలయ్యే లోపు పనులు పూర్తి అయ్యేలా చూడాలని, ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో. బాల్ రెడ్డి రాజేశ్వర్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్ శ్రీకాంత్ రెడ్డి ధనుంజయ్ గౌడ్, రాజు గౌడ్, నరసింహ, వంశీ, రాజు, ముత్యాలు, భానుచందర్, మురళి గౌడ్, వెంకట్ రెడ్డి , గణేష్ గౌడ్ , శేఖర్ నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు

మైనారిటీ కమిషన్ చైర్మెన్‌కు ఎంపీజే అధ్యక్షులు అభినందనలు



నవతెలంగాణ-ధూల్ పేట్

తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మెన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన తారిక్ అన్సారీకి ఎంపీజే తెలంగాణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మైనారిటీ కమిషన్ చైర్మెన్ పదవికి తారిక్ అన్సారీ వన్నె తీసుకోవాలని ఆకాంక్షిం చారు. మైనారిటీలపై జరుగుతున్న దాడులను అడ్డుకో వాలని, బాధితులకు తగిన న్యాయం చేయాలని కోరారు. మైనారిటీలకు న్యాయం చేసేందుకు కషి చేయాలని తారీక్ అన్సారీని కోరారు. చైర్మెన్‌ను కలిసిన వారిలో ఎంపీజే జనరల్ సెక్రటరీ సలీమ్ హిందీ ఉన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ నేత పత్తికుమార్ ప్రచారం

నవతెలంగాణ-కాప్రా



కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో సీవీ రామన్ నియోజకవర్గం ఏఐసీసీ పరిశీలకులుగా ఉన్న కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మెన్ పత్తి కుమార్.. అభ్యర్థి ఆనంద్ కుమార్ విజయం కోసం 57, 58 వార్డులల్లో పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కమిషన్లతో నడుస్తున్నదని, తిరిగి మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి రాకుండా చూడాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాన్ని నడిపించే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అభ్యర్థి ఆనంద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అలాగే జేడీఎస్‌కు చెందిన పలువురు నాయకులను, కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఇందిరా నగర్‌లో క్రీస్తు రక్షణ సువార్త ప్రార్థన మందిరంలో జరిగిన 10 రోజుల సీబీసీ అనివర్సరీ డే శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం చర్చిలో గల పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జేన్ శేకర్, ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి చర్చి నిర్వాహకులు అబ్రహం, సుశీల శంకర్ , కాటర్ల భాస్కర్,దూసరి నవీన్ గౌడ్,నాదెండ్ల నవీన్, కుమార్ , చింటు యాదవ్, మనీష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా



కాంగ్రెస్ నిర్వహించే యువ సంఘర్షణ సభ విజయవం తం చేయాలని ఓయూ లైబ్రరీ వద్ద శనివారం కాంగ్రెస్ నేతలు నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. సరూర్ నగర్ స్టేడియం లో మే 8 న టీపీసీసీ-టీఎస్ పీ ఎస్‌సీ పేపర్స్ లీక్స్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు ఓయూ విద్యార్థులు, నిరుద్యోగులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ మల్లు రవి, టీపీ సీసీఅధికార ప్రతినిధి రియాజ్, ఓయూ విద్యార్థి నాయకులు, బాలలక్ష్మి, చనగాని దయాకర్, కౌశిక్ తదితరులు. పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఓయూ

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE-CUM- XVII ADDITIONAL METROPOLITAN MAGISTRATE, R. R. DISTRICT, AT MAHESHWARAM
O.S. No. 271 of 2022

Between:
Smt. Y.Prameela Rani ... Plaintiff
AND
D.Vijay Kumar and Others ... Defendants

NOTICE

To,
1. Sri D.Vijay Kumar S/o. Late Maha Rudrappa, Aged about 50 years, Occ: Business, R/o. 2-23-545, Aditya Nagar, Kukatpally, Hyderabad, Telangana ....**D 1**
2. Sri. D.Shiva Kumar S/o. Late Maha Rudrappa, Aged about 36 years, Occ: Business, R/o. 9-6-201, Srinivasa Nilayam, Sagar Road, Saidabad, Hyderabad. ... **D 2**

Please take notice that, the above Suit is filed by the Plaintiff against the Defendants 1 to 4 for declaration, declaring the Plaintiff as absolute owner and possessor of the Suit Schedule Property, grant permanent injunction restraining the Defendants 1 and 2 from interfering and alienating the Suit Schedule Property i.e., All that the piece and parcel of agricultural dry land bearing Survey No. 140 admeasuring Ac.0-03 gts, Survey No. 141 admeasuring Ac.0-09 gts, Survey No. 150 admeasuring Ac.0-05 gts and Survey No. 151 admeasuring Ac.0-10 gts total admeasuring Ac.0-27 gts situated at Dubbacherla Revenue Village and Grampanchayat, Maheshwaram Mandal, RR District under SRO, Maheshwaram, and to direct the Defendants No. 3 and 4 to enter the names of Plaintiff in the revenue records as Pattadar and possessor by deleting the names of D1 and D2 and the said suit is pending on the above file of the above said Hon'ble Court and the same is posted to 06/06/2023 for your appearance.
Hence you are hereby requested to make it convenient to appear either in person or through an advocate in the above said court on **06/06/2023 at 10:30 am** without fail. On Failing to appear the matter will be decided accordingly.

// BY ORDER OF THE COURT//
S.Vijaya Prakash,
S.Radhika,
Advocates
G-1, Ravichandra Apartments,
Karthikeya Nagar, Nacharam,
Mrdchal-Malkajgiri District.
Cell:9885156232.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE-CUM- XVII ADDITIONAL METROPOLITAN MAGISTRATE, R. R. DISTRICT, AT MAHESHWARAM
I.A.No. 1126 of 2022
IN
O.S. No. 271 of 2022

Between:
Smt. Y.Prameela Rani
... Petitioner/Plaintiff
AND
D.Vijay Kumar and Others
... Respondents/Defendants

NOTICE

To,
1. Sri D.Vijay Kumar S/o. Late Maha Rudrappa, Aged about 50 years, Occ: Business, R/o. 2-23-545, Aditya Nagar, Kukatpally, Hyderabad, Telangana.
2. Sri. D.Shiva Kumar S/o. Late Maha Rudrappa, Aged about 36 years, Occ: Business, R/o. 9-6-201, Srinivasa Nilayam, Sagar Road, Saidabad, Hyderabad.
... Respondents/Defendants 1 and 2

Please take notice that, the above Petition is filed by the Petitioner/Plaintiff against the Respondent/Defendants 1 and 2 under Order 39 Rule 1 and 2 restraining the Responents/Defendants 1 and 2 from alienating the Suit Schedule Property i.e., All that the piece and parcel of agricultural dry land bearing Survey No. 140 admeasuring Ac.0-03 gts, Survey No. 141 admeasuring Ac.0-09 gts, Survey No. 150 admeasuring Ac.0-05 gts and Survey No. 151 admeasuring Ac.0-10 gts total admeasuring Ac.0-27 gts situated at Dubbacherla Revenue Village and Grampanchayat, Maheshwaram Mandal, RR District under SRO, Maheshwaram, and the said I.A. is pending on the above file of the above said Hon'ble Court and the same is posted to 06/06/2023 for your appearance.
Hence you are hereby requested to make it convenient to appear either in person or through an advocate in the above said court on **06/06/2023 at 10:30 am** without fail. On Failing to appear the matter will be decided accordingly

// BY ORDER OF THE COURT//
S.Vijaya Prakash,
S.Radhika,
Advocates
G-1, Ravichandra Apartments,
Karthikeya Nagar, Nacharam,
Mrdchal-Malkajgiri District.
Cell:9885156232.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE-CUM- XVII ADDITIONAL METROPOLITAN MAGISTRATE, R. R. DISTRICT, AT MAHESHWARAM
I.A.No. 1127 of 2022
IN
O.S. No. 271 of 2022

Between:
Smt. Y.Prameela Rani
... Petitioner/Plaintiff
AND
D.Vijay Kumar and Others
...Respondents/ Defendants

NOTICE

To,
1. Sri D.Vijay Kumar S/o. Late Maha Rudrappa, Aged about 50 years, Occ: Business, R/o. 2-23-545, Aditya Nagar, Kukatpally, Hyderabad, Telangana.
2. Sri. D.Shiva Kumar S/o. Late Maha Rudrappa, Aged about 36 years, Occ: Business, R/o. 9-6-201, Srinivasa Nilayam, Sagar Road, Saidabad, Hyderabad.
... Respondents 1 and 2

Please take notice that, the above Petition is filed by the Petitioner/Plaintiff against the Respondents/Defendants 1 and 2 under Order 39 Rule 1 and 2 for restraining the Respondents/Defendants 1 and 2 from interfering with the peaceful possession of the Petitioner/Plaintiff over the Suit Schedule Property i.e., All that the piece and parcel of agricultural dry land bearing Survey No. 140 admeasuring Ac.0-03 gts, Survey No. 141 admeasuring Ac.0-09 gts, Survey No. 150 admeasuring Ac.0-05 gts and Survey No. 151 admeasuring Ac.0-10 gts total admeasuring Ac.0-27 gts situated at Dubbacherla Revenue Village and Grampanchayat, Maheshwaram Mandal, RR District under SRO, Maheshwaram, and the said I.A. is pending on the above file of the above said Hon'ble Court and the same is posted to 06/06/2023 for your appearance.
Hence you are hereby requested to make it convenient to appear either in person or through an advocate in the above said court on **06/06/2023 at 10:30 am** without fail. On Failing to appear the matter will be decided accordingly.

// BY ORDER OF THE COURT //
S.Vijaya Prakash,
S.Radhika,
Advocates
G-1, Ravichandra Apartments,
Karthikeya Nagar, Nacharam,
Mrdchal-Malkajgiri District.
Cell:9885156232.

ఎల్బీనగర్ జోన్ వెటర్నరీ జోనల్ లెవెల్ కమిటీ సభ్యురాలుగా గీత



నవ తెలంగాణ- ఉప్పల్

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ వెటర్నరీ జోనల్ లెవెల్ కమిటీ సభ్యురాలుగా చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి కుక్కల సంతాన నియంత్రణ, వాటి వల్ల సంభవించే సమస్యలను అధిగమించడానికి ఎల్బీనగర్ జోన్ జీహెచ్ఎంసీ పరిధిలో జోనల్ స్థాయి మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ ప్రతి నెలా జోనల్ స్థాయిలో సమావేశం జరుగుతుందన్నారు. ఇందులో నెలవారిగా వీధి కుక్కలకు చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, ఏదైనా కుక్క కాటు సమస్యలు, జంతు సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, సూచనలు అందిస్తామని వివరించారు.

37వ సారి రక్తదానం చేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు



నవతెలంగాణ - చైతన్యపురి

ఈఎస్ఐ ఆస్పత్రిలో శనివారం అత్యవసర ఆపరేషన్ ఉన్న వ్యక్తికి రక్తం అవసరం అనగానే ఎల్బీనగర్ ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు వెంటనే వెళ్లి రక్తదానం చేశారు. ఈయన ఇప్పటి వరకు 37 సార్లు వివిధ సందర్భాల్లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి, గుండె ఆపరేషన్ ఉన్నవారికి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడిన వారం అవుతమని, అందుకే ప్రతిఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు.

మైనార్టీలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం : మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణలోని మైనారిటీలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం ఉందని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. తన్నీరు హరీశ్ రావు సేవాసమితి అధ్యక్షుడు, రంగారెడ్డి బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ సీనియర్ నాయకుడు ఎస్కె మహమూద్ ఆధ్వర్యంలో శనివారం ఆర్కేపురం నుండి కార్యకర్తలతో కలిసి హరీశ్‌రావు కాలిశారు. ఈ సందర్భంగా మంత్రికి బుద్ధ విగ్రహాన్ని అందించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం ప్రభుత్వం ఎంతో కషి చేస్తోందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ సహకారాలు ఇంకా ఎక్కువగా అందుతాయని తెలిపారు. ఎస్కే మహమ్మద్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మైనార్టీల కోసం షాది ముబారక్, మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లను ప్రారంభించి వారి అభివద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరరావు, ఇస్మాయిల్, అబ్దుల్ కరీం ఉద్దీన్, అజాజ్, రఫీక్ బాబ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం'



నవతెలంగాణ - హయత్‌నగర్

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ వీరన్నగుట్ట (శ్రీ షిర్డీ సాయినగర్ కాలనీ)లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మూడు బోర్లను శనివారం మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు బోర్ల మంజూరుకు సహకరించిన మేయర్‌కు, జలమండలి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరాలోనే రూ.53లక్షల వ్యయంతో ఆకాశ నగర్ రోడ్డు నుండి స్వాతి రెసిడెన్సీ రోడ్డు ఎల్ షేప్‌గా సీసీ రోడ్డు పనులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. వీరన్న గుట్టకు వద్ద యూజీడీ భూగర్భ డ్రయినేజీ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, ఈ విషయాన్ని అధికారుల దష్టికి తీసుకెళ్లి త్వరాలోనే పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు కెకెల్ గౌడ్, కోటయ్య, సత్తయ్య, నర్సింహా యాదవ్, చిన్న యాదవ్, వెంకటేష్, రమేష్ చారి, రమ, లావణ్య, లక్ష్మి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదు

మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ - చైతన్యపురి

చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని, సీఎం కేసీఆర్ నేతత్వంలో విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ హాల్లో నిర్వహించిన శ్రీరామ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి పరీక్షల్లో ఉత్తీర్ణులై దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యరంగ వ్యవస్థ అభివద్ధికి ఎంతో కషి చేశారని తెలిపారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమేష్, ప్రిన్సిపల్ శ్యామల, నాగమణి, నాగలత, రవీంద్రం, నాగేశ్వరరావు, వెంకటేశం, రామశేషు, రామలక్ష్మి, సరళ, యాదగిరి, రాజు, శ్వేత, నవనీత, మానస పాల్గొన్నారు.

భరోస సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ -హయత్ నగర్

భరోస సభను విజయవంతం చేయాలని రాష్ట్ర బీఎస్పీ కార్యదర్శి గుండెల ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీఎస్పీ అధినేత్రి మాయావతి వస్తున్న సందర్భంగా ఈ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పార్టీ బీఎస్పీ అన్నారు. అంతేకాదు అన్ని కులాలకు రిజర్వేషన్ల వారికి సీట్లు కేటాయిస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ అని పేర్కొన్నారు.

పేదలకు అండగా ఉంటా

మహేశ్వరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



నవతెలంగాణ - బడంగ్ పేట్

పేదలకు అండగా ఉంటానని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే కొత్త మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పరిధిలోని కుర్మల్‌గూడలో నివాసం ఉంటున్న నూర్ జహబేగంతో పాటు కొంత మంది పేదలకు స్వంత భూమిలో 60 గజాల ఇంటి స్థలాన్ని ఆయన ఉచ్చితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా నిరుపేదలకు 60గజాల నివాస స్థలం ఉచితంగా పంపిణీ చేస్తున్నానని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కపాటి పాండు రంగారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

కాంట్రాక్టర్లు సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని చిగురింత పారిజాత నర్సింహారెడ్డి సూచించారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 18వ డివిజన్ సాయి గణేష్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు కషి చేస్తున్నానని అన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి, కార్పొరేటర్ బండారి మనోహర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు పంపిణీ



నవతెలంగాణ - చైతన్యపురి

రెడి టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఉచిత ఓల్డ్ ఏజ్ హోమ్‌కు శనివారం సినీ హీరో విజయ భాస్కర్, ఆర్టిస్ట్ శ్రావణి, సుప్రియ, తడివేల్, గాంధీ సినీ ప్రముఖులు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నివసిస్తున్న వద్ధులకు తమవంతు సహాయంగా 50 కేజీల రైస్ బాగ్, రోజు వారీ నిత్యావసర సరుకులు ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్‌కి అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎవరైనా సహాయం చేయాలనుకుంటే 9701295527కి సంప్రదించగలరనిఫౌండేషన్ చైర్మన్ పెద్ది తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చేసిన కృషి నేటికీ మరువలేనిది

- భారతరత్న అవార్డును ప్రకటించాలి
- దివంగత ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ -ధూల్ పేట్

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నాడు దివంగత సీఎం ఎన్టీఆర్ చేసిన కృషి నేటికీ మరచిపోలేనిదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జియాగుడ లోని ఎస్పీపీ గార్డెన్ లో శనివారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం, కార్వాన్ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బండారు వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎం అరవింద్ కుమార్ గౌడ్, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు అలీ మస్కతిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందుగా కార్వాన్ రామ్ సింగ్ పుర నుండి సమావేశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ..1982లో పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ 9 నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు.బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివద్ధి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. వాటితో నిరుపేదలు ఇప్పటికీ లబ్ధి పొందుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కొనసాగించారన్నారు. పార్టీ చేపట్టిన ఇంటింటికీ కరపత్రం పంచడంతో ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు.

టీడీపీతోనే తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం...

పొలిట్ బ్యూరో సభ్యులు ఎం. అరవింద్ కుమార్ గౌడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు ఎంతో నష్టపోయారని, వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.కరోనా సమయంలో సైతం రైతులు పంటలు పండించారని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ ఉన్నంత వరకు ఎన్టీఆర్ ఉంటారని చెప్పారు.దివంగత ఎన్టీఆర్ కు భారత రత్న అవార్డును ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీడీపీతోనే తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిసిప్లినరీ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సీనియర్ నాయకులు సాయిబాబా, ఉపాధ్యక్షులు అల్లి మస్కతి, కాసాని వీరేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి అనుప్ బుడిగి, ఎ. సురేందర్ సింగ్, జియాగూడ అధ్యక్షులు కె. నరసింగరావు, పి. లక్ష్మణ్ యాదవ్, పొగరు జయ రామచంద్ర, షకీలా రెడ్డి, చంద్రహాస్, ఎస్ గజేంద్ర గౌడ్, ఐలయ్యా యాదవ్, నాయకుల తదితరులు పాల్గొన్నారు.

విశ్వ మానవాళి శ్రేయస్సు ఠాగూర్ సాహిత్యం



నవతెలంగాణ - కల్చరల్

దేశాల మధ్య సరిహద్దులు, ప్రజల నడుమ ఎట్టి బేధాలు లేని మానవాళి శ్రేయస్సు లక్ష్యం ఠాగూర్ సాహిత్యం అని రాష్ట్ర సమాచార హక్కు చట్టం విశ్రాంత ప్రధాన కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని లలిత కళా వేదిక పై శతాబ్ద పూర్వ మహనీయుల యాదిలో భాగంగా విశ్వకవి రవీంద్ర నాథ్ ఠాగూర్ సంస్మరణ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా మురళి పాల్గొని మాట్లాడారు. దేశ భక్తి ని ఉత్తేజితం చేసే జాతీయ గీతం రాసిన, దేశ ప్రజలు స్వేచ్ఛ స్వాతంత్రాలతో తలెత్తుకు తిరగాలని ఆకాంక్షతో వేర్ ద మైండ్ ఈ స్ విత్ ఔట్ ఫియర్ గీతం రాసిన ఠాగూర్ ప్రపంచ సాహిత్య వేత్తల లో ఒకరుగా నిలిచారని చెప్పారు. నోబెల్ బహుమతి అందుకొన్న తొలి భారతీయుడు ఠాగూర్ అని కొనియాడారు. ప్రముఖ గాయకుడు త్రినాథ రావు మాట్లాడుతూ ఠాగూర్ జాతీయ గీతంతో పాటు శాంతినికేతన్ విద్యాలయం గీతాంజలి సంపుటి దేశానికి ఇచ్చారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కళా పోషకుడు వెంకట రెడ్డి, గుండవరపు గీతా దేవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎస్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్ 2లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..కాలనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేకుంటే కాంట్రాక్ట్ పై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పీవీ బీడీ శర్మ, సెక్రటరీ రంగప్ప, కె ఎస్ శర్మ, పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ శర్మ, డివిజన్ కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, కాలనీ సభ్యులు కష్ణ గౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'118 జీవో అమలు, రిజిస్ట్రేషన్ చేయాలి'

నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ లో 118 జీవో అమలు చేస్తూ వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. ఈ జీవోకు సంబంధించి ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్,మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమేయ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాహుల్ బొజ్జలను శనివారం ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి పలు సందేహాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నవీన్ మిట్టల్ మాట్లాడుతూ దానిలో భాగంగా ఇంటి వెరిఫికేషన్ అయిన వాళ్లకు కన్వీయాన్స్ డీడ్ ఇచ్చే ప్రక్రియ 10 నుంచి 15 రోజుల్లో ప్రారంభించబడుతుందని తెలిపారు. అలాగే కన్వీయాన్స్ డీడ్ నిమిత్తం స్టాంప్ డ్యూటీ, మ్యుటేషన్ ఫీజు కూడా చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. స్టాంప్ డ్యూటీ వివరాల్లో భాగంగా ఉదాహరణకు గజానికి రూ. 250 కట్టిన మొత్తం మీద 7.5%, రూ. 3,550 ల మ్యుటేషన్ ఫీజు చెల్లించాల్సి వస్తుంది. అంటే 267 గజాల్లో ఇల్లు ఉందనుకోండి 267X250X7.5% ప్లస్ రూ. 3,550 లేదా పాయింట్ 1% మొత్తం అమౌంట్ కట్టాలని వివరించారు. అలాగే మ్యుటేషన్ ప్రక్రియ, రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ వాళ్ళు డివిజన్ల వారీగా బాధిత కాలనీ వాసులకు సంక్షేమ సంఘంలో భవనంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారులకు అన్ని సౌకర్యాలు కల్పించి..రోజుకు 200 మందికి రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈసేవలో రూ.500 చెల్లించిన వాళ్ళ ఇండ్ల వెరిఫికేషన్ కోసం తొందరలోనే అధికారులను నియమించి కాలనీలకు పంపిస్తామని చెప్పారు. వెరిఫికేషన్ అయ్యి ఇంకా డిమాండ్ నోటీసు రాని యెడల ఒక సారి ఈసేవకు, మీ సేవలకు వెళ్లి చెక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయినా కూడా రాకపోతే వారి వివరాలు కాలనీ సంక్షేమ సంఘం వారి దష్టికి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, బీఎస్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పలు కాలనీ సంఘాల సభ్యులు పొగుల రాంబాబు, గుజ్జ జగన్ మోహన్, అనసూయ,పుల్లారెడ్డి,సుధాకర్ రెడ్డి,శరత్ రెడ్డి,గోపాల్ ముదిరాజ్,అంజిరెడ్డి,మల్లేష్,మల్లికార్జున్,శేఖర్ రెడ్డి,అశోక్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి,కష్ణ రెడ్డి,ముత్యంరావు,మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా సుచరిత



నవతెలంగాణ - హయత్‌నగర్

హయత్‌నగర్ డివిజన్ టీఎస్ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా సుచరిత శనివారం బాధ్యతలు తీసుకొని వెంటనే హయత్‌నగర్‌లోని డిపో-2ను, ఎన్జీవోస్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె డిపో కండక్టర్లను, డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ సంస్థ అభివద్ధికి అందరూ క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, టీఏవైఎల్ టికెట్లను విరివిగా అమ్మి, డిపో అభివద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ మేనేజర్ రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జరిగే బహిరంగ సభకు యువత తరలిరావాలి



నవతెలంగాణ - ఎల్బీనగర్

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ 'యువ సంఘర్షణ' పేరుతో రేపు హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభకు శ్రీకారం చుట్టిందని, ఈ సభకు యువత భారీ సంఖ్యలో తరలిరావాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఆయన నవతెలంగాణకు ప్రతేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

1.ఎందుకు సభ పెడుతున్నారు?

జవాబు : రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఉద్యోగాల భర్తీ లేదు, ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. ఉన్నత చదువులు చదివి యువత నిరాశలో ఉన్నారు. యువతను ఆదుకోవడం కాంగ్రెస్ బాధ్యతగా తీసుకుంది. అందు కోసం సరూర్‌నగర్ స్టేడియంలో తొలి రాజకీయ వేదిక కాబోతుంది.

2.తెలంగాణకు ప్రియాంక గాంధీ ఎందుకు వస్తున్నారు..?

జవాబు : రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు లేవు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. అందుకోసం ప్రియాంక గాంధీ వస్తున్నారు. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారు. అదేవిధంగా ప్రియాంక గాంధీ యువత డిక్లరేషన్ ప్రకటించనున్నారు.

3. సభకు ఎంత మంది వస్తారు..?

జవాబు : రాష్ట్ర నలుమూలల నుండి నిరుద్యోగులు వస్తారు. నగరం నుండి రెండు లక్షల మంది నిరుద్యోగులు సంఘర్షణ సభకు తరలి రానున్నట్లు సమాచారం. ఎల్బీనగర్, మహేశ్వం, ఇబ్రహీంపట్నం, ఉప్పల్ నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున యువత వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 11 డివిజన్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ సభకు తరలివస్తారు. ఎల్బీనగర్‌లోని అన్ని డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తల సహకారంతో 25వేల మంది వస్తున్నారు. ఆశించిన దాని కంటే ఎక్కువగా యువత వచ్చే అవకాశాలు ఉన్నాయి. మొత్తం 20లక్షల నుండి 30 లక్షల మంది వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మానవ అక్రమ రవాణా హేయమైన చర్య

- ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా హేయమైన చర్య అని మహేశ్వరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.రాధిక అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బడంగ్ పేట (మహేశ్వరం)లో శనివారం మనుషుల అక్రమ రవాణా పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రాధిక మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందని, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ పరిధిలోని ఉన్న అన్ని వర్గాల ప్రజల సామజిక, ఆర్థిక స్థితి గతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కష్ణ మాట్లాడుతూ..ప్రజ్వల సంస్థ ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా 20 ఏండ్లుగా పద్మ శ్రీ డా.సునీత కష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత ఐసీడీఎస్,పోలీస్, విద్యా శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 26500 మందిని కాపాడి, పునరావాసం కల్పించినట్లు తెలిపారు. అన్ని జిల్లాల పాఠశాలు, కళాశాలలోని విద్యార్థులందరికీ అవగాహనా కల్పిస్తూ, సమాజ జాగతి సంఘాలను ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్య వంతం చేస్తున్నామని తెలిపారు. లఘు చిత్రల ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల సిబ్బంది సురేష్, శ్రావ్య, వినోద్ వైస్ ప్రిన్సిపల్ అనిల్ కుమార్, చందూజీ రావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ యువ సంఘర్షణ సభకు వేలాదిగా తరలిరావాలి'



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఈ నెల 8న సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే నిరుద్యోగ యువ సంఘర్షణ సభకు వేలాదిగా తరలి రావాలని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాం రెడ్డి కోరారు. దిల్ సుఖ్ నగర్ లోని కోచింగ్ సెంటర్ లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఈ సంఘర్షణ సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఎల్బీనగర్ లోని పలు విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్స్ లోని విద్యార్థులు అధిక సంఖ్యలో సభ రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంకపెల్లి సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి, ప్రవీణ్ రెడ్డి పీసీసీ జనరల్ సెక్రెటరీ, కిశోర్ గౌడ్ కొత్తపేట డివిజన్ అధ్యక్షులు, సురేందర్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధిష్టాన నిర్ణయానికి కార్యకర్తలు కట్టుబడి ఉంటారు

- కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీని అధిష్టానం గుర్తించి సరైన నిర్ణయం తీసుకుంటే పార్టీ శ్రేణులు ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటారని జాతీయ ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం నవతెలంగాణ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్, బీజేపీలు వ్యవహరిస్తున్న దొంగ డ్రామాలను గుర్తిస్తున్నారని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో పది లక్షల మంది జనాభాలో ఐదు లక్షల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సంతస్థాయి ఇస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి బలం చేకూరుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో సరైన నాయకుడు నిలబడాలని ఆశభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు యువతకు సంక్షిత స్థానాన్ని ఇస్తూ ముందుకు సాగాలని కోరారు. సీఎం కేసీఆర్‌ను ఢీ కొట్టే నాయకుడు రేవంత్‌రెడ్డి అని అన్నారు. వనస్థలిపురం ప్రజలకు ఎల్లకాలంలో రుణపడి ఉంటానని, ఎలాంటి సమస్యనైనా పరిష్కరించేందుకు ఎల్లవేళలా ముందు ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్న దానికి కట్టుబడి బ్రదర్ సమస్యలపై పోరాడతానని, తన పోరాటంలో తన మన విభేదాలు లేకుండా ప్రజల సమస్యలపై నిలుస్తానని అన్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- కార్పొరేటర్ కొలుకుల జగన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజల సహాయ సహకారాలతోనే అభివద్ధి సాధ్యపడుతుందని జగద్గిరి గుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని రింగ్ బస్తీలో రూ 26 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాంతంలో సుమారుగా మౌలిక వసతులన్నీ కల్పించడం జరిగిందని పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తానని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించేలా కషి చేస్తానన్నారు. బస్తీలలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు స్థానిక నాయకులు పాపయ్య గౌడ్, భాగ్య రావు, నరసింహ, శ్యామ్, ఉపేందర్, నరసయ్య,బస్తీ వాసులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌నగర్ గుండు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది కనిపించాడు. గమనించిన స్థానికులు నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతడి వివరాలకై దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు యాచకుడు అని తెలిసింది.

సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు విశేష స్పందన



- 915 సెంటర్లలో 44 రకాల క్రీడలు
- విద్యార్థులతో కిక్కిరిసిపోతున్న జీహెచ్ఎంసీ క్రీడామైదానాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

చిన్నారులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్న మాటలు పదేపదే వినిపిస్తున్నవే. ఇక గ్రామీణ ప్రాంతాలల్లో క్రీడా మైదానాలున్నట్టు హైటెక్ సిటీలో పిల్లలు ఆడుకునేందుకు క్రీడా మైదానాలు దాదాపు అందుబాటులో లేవు. ఈ క్రమంలో నగరంలోని జీహెచ్ఎంసీ క్రీడా మైదానాలకు నగరవాసుల నుంచి విశేష ఆధరణ లభిస్తోంది. ఇక సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తే చెప్పనక్కర్లేదు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా పరుగులు పెడుతున్నారు. దాంతో జీహెచ్ఎంసీ క్రీడా మైదానాలు విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆరు సంవత్సరాల నుండి 16 సంవత్సరాల విద్యార్థులు ఆనందోత్సాహాలతో సమ్మర్ కోచింగ్‌లో పాల్గొంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్లే గ్రౌండ్‌లలో ఘనంగా సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. చార్మినార్ కులి కుతుబ్ షా స్టేడియం, సికింద్రా బాద్ మారేడ్పల్లి ప్లే గ్రౌండ్, కుకట్ పల్లి, శేరిలింగంపల్లి చందా నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం, ఎల్.బి.నగర్, ఉప్పల్ స్టేడియంతోపాటు ఇతర క్రీడా మైదానాలల్లో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొంటున్నారు.

37రోజులపాటు

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో గత నెల 25న ప్రారంభమైన సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు ఈ నెల 31వరకు 37 రోజులపాటు కొనసాగ నున్నాయి. దాదాపు 44 రకాల క్రీడలలో 915 సెంటర్లలో ఉదయం 6:15 గంటల నుంచి 8:15 గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు.

వందలాది మంది కోచ్‌ల పర్యవేక్షణ

శిక్షణలో 6 సంవత్సరాల నుండి 16 సంవత్సరాలలోపు పిల్లలు పాల్గొంటుండడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు 77 మంది పార్ట్ టైం కోచ్‌లతోపాటు 712 హానర్ రోరియం కోచ్‌లు పనిచేస్తున్నారు. ముఖ్యంగా స్విమ్మింగ్, క్రికెట్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్, రోలర్, కరాటే, కోకో, జిమ్నాస్టిక్స్, ఉషు, బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, హాకీ, రెజ్లింగ్, థైక్వాండో, హ్యాండ్ బాల్, సపక్ తక్రా, స్కై మార్షల్, వాలీబాల్ తదితర క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. స్పోర్ట్స్ క్విజ్, ఇంటర్ టోర్నమెంట్ విద్యార్థులకు నిర్వహిస్తారు.

అంబర్‌పేట్‌లో 8 బ్యాచ్‌లు

సికింద్రాబాద్ జోన్ అంబర్ పేట స్విమ్మింగ్ పూల్‌లో ప్రతి రోజు ఉదయం 6:00 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి 7 గంటల వరకు వరకు ఇలా 8 గంటల పాటు నిర్వహిస్తున్నారు. 8 బ్యాచ్‌లు ప్రతీ గంటకు 100 మంది పాల్గొంటున్నారు. ఇదిలావుండగా ఖైరతాబాద్‌జోన్‌లోని మెహిదీ పట్నం విజయనగర్ కాలనీ స్విమ్మింగ్ పూల్, కార్వాన్ గోల్కొండ స్విమ్మింగ్ పూల్, సనత్ నగర్ స్విమ్మింగ్ పూల్‌లలో గంటకు 60 మంది చొప్పున పాల్గొంటున్నారు. ఇక చార్మినార్ జోన్‌లోని మొఘల్ పుర స్విమ్మింగ్ పూల్, చారు లాల్ బరాదారి స్విమ్మింగ్ పూల్‌లలో గంటకు 100 మంది పాల్గొంటున్నారు. ఎల్బీనగర్ జోన్ వనస్థలిపురం స్విమ్మింగ్ పూల్ (2)లలో గంటకు 50 మంది చొప్పున విద్యార్థులు పాల్గొంటున్నారు. శేర్లింగంపల్లి జోన్ పీ.జే.ఆర్ స్టేడియం చందానగర్‌లో కరాటే శిక్షణకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

మహిళల భద్రతపై కీలక నిర్ణయాలు



- సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ట్రై కమిషనర్ల సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మూడు కమిషనరేట్ల పరిధిల్లో శాంతిభద్రతలు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన, సాధికారత కలిగించే వాతావరణాన్ని సృష్టించడంతోపాటు మహిళల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు పోలీస్ అధికారులు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ట్రైసిటీ కమిషనరేట్ పరిధిల్లో సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా బంజారాహిల్స్‌లోని టీఎస్‌పీఐ సీసీసీలోని 17వ అంతస్తులో హైలెవల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశమైంది. శనివారం హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రా, ఉమెన్ సేఫ్టీ అదనపు డీజీ శిఖా గోయెల్ పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలకు, చిన్నారుల రక్షణకు కావాల్సిన వివిధ అంశాలపై చర్చించారు. ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను మెరుగుపర్చడం, సీసీ కెమెరాల పనితీరు, డయాల్ 100కు ప్రాధాన్యతపై చర్చించారు. మూడు కమిషనరేట్ల పరిధిలోవున్న భరోసా సెంటర్ల భవనాల ప్రస్తుత పరిస్థితితోపాటు కొత్తగా ఏర్పాటు చేసే భరోసా కేంద్రాలపై ఆరా తీశారు. వివిధ ప్రాంతాల్లో షీ మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలాల సేకరణపై చర్చించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్, జీ.సుధీర్‌బాబుతోపాటు జీహెచ్ఎంసీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు.

ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు హర్షణీయం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గంలోని నిరుపేదలకు ఖార్డ్ సంస్థ చేస్తున్న సేవలు హరషణీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ లోని ఖార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఏఎండీ సంస్థ వారు సంయుక్తంగా మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇప్పించి వారికి సర్టిఫికెట్స్, కుట్టు మిషన్ల ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గంలో నిరుపేదలు ఎక్కువగా ఉన్నారని, నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాంతాలలో వారిని గుర్తించి అవసరమైన నిత్యావసరాలు అందించడమే కాకుండా వారు స్వయం సమద్ధి సాధించే దిశగా వారికి వత్తి విద్య కోర్సులో శిక్షణ ఇప్పించి సంబం ధించిన ఉద్యోగాలు ఇప్పించి స్వతహాగా వారి కాళ్లపై నిలబడేటట్లు తీర్చిదిద్దడం ఎంతో సంతోషంగా ఉందన్నా రు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుమన్, మం జులత దంపతులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. అదేవిధంగా ఏఎండీ పరిశ్రమ డైరెక్టర్ అనిల్ ను అభినందిస్తూ ఎంతో నిరుద్యోగులకు తమ కంపెనీ ద్వారా ప్రోత్సాహం అందిస్తూ వారి కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఖార్డ్ సంస్థ నిర్వాహకులు సుమన్ దంపతులు, ఏఎండీ డైరెక్టర్ అనిల్, డివిజన్ అధ్యక్షులు దర్శనం శాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల గురించి మాట్లాడని ప్రధాని..
కేరళ ఫైల్స్ గురించి మాట్లాడడం సిగ్గుచేటు

- సీపీఐ జాతీయ సమితి అధ్యక్షులు ఎండీ యూసుఫ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మహిళా రెజ్లర్ల నిరసన, అదానీ వ్యవహారం, సైనికుల మరణాల గురించి మాట్లాడని ప్రధాని మోడీ.. కేరళ ఫైల్స్ గురించి మాట్లాడడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ సమితి అధ్యక్షులు ఎండీ యూసుఫ్ అన్నారు. బీజేపీకి హఠావో దేశ్ కో బచావో అనే నినాదంతో సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి ఇంటింటికి సీపీఐ పాదయాత్ర షాపూర్‌నగర్, మార్కెట్, కళావతి నగర్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యూసుఫ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్య లను వివిధ రూపాలలో చెబుతుంటే పట్టించుకోని మోడీ, ఎన్నికలలో గెలవడానికి మాత్రం మతం గురించి మాట్లాడుతారన్నారు. ఒక ప్రధాని స్థాయి ఉన్న వ్యక్తి ప్రజల మధ్య సఖ్యత పెంచల్సింది పోయి విద్వేషం కలిగించే అంశాలను ఎన్నికల లబ్ది కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటు అన్నారు. సైనికుల మతి పై వ్యక్తమైన అభిప్రాయాలను మాట్లాడని మోడీ నేడు కేరళ స్టోరీ గురించి మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలు నిరుద్యోగంతో ప్రజలు బాధపడుతుంటే అవేమీ పట్టించుకోకుండా ఎన్నికల్లో మతం వాడుకోవడంలో ఇప్పటివరకు పనిచేసిన ప్రధానుల్లో మోడీ ప్రథముడు అని అన్నారు. దేశానికి పతకాలు తెచ్చిన రెజ్లర్లు నిరసన వ్యక్తం చేస్తుంటే ఆ విషయం, అదాని వ్యవహారం గురించి ప్రధాని నోరు విప్పాడు అన్నారు. ఇలాంటి ప్రధాని వల్ల మత సామరస్యం పెరగకపోగా మరింత మత విద్వేషం పెరుగుతుందని కావున ఇలాంటి ప్రధానిని ఇంటికి సాగనంపడానికి సీపీఐ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ , యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, సీపీఐ నాయకులు శ్రీనివాస్, ఇమామ్ ,చంద్రమౌళి, నరేష్ , ఉపేంద్ర , యువజన నాయకులు శ్రీకాంత్, మధు, నాగరాజు, అజయ్, ఆశయ్యలు పాల్గొన్నారు.

నిరుద్యోగ జంగ్ సైరన్ సభను విజయవంతం చేయండి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జోత్స్నా శివారెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

ఈనెల 8న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంకా గాంధీ హాజరయ్యే 'నిరుద్యోగ జంగ్ సైరన్' సభను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కొంపల్లి కౌన్సిలర్ జోత్స్నా శివారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'భారత్ జోడో' కార్యక్రమానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై, పేపర్ లీక్‌లకు నిరసనగా 'నిరుద్యోగ జంగ్ సైరన్' సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ప్రియాంక గాంధీ వస్తున్న తరుణంలో నియోజకవర్గంలో నలుమూలల నుంచి భారీగా జనసమీకరణం చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోతే నిరుద్యోగభతి ఇస్తామంటూ 2018 ఎన్నికలకు ముందు కేసీఆర్ హామీ ఇచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగు లకు ఉద్యోగాలివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ తొమ్మిదేండ్ల పాలనలో ఉద్యోగాలెందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. అందుకే ఈ నిరుద్యోగ జంగ్ సైరన్ సభకు వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు.

డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని నాగార్జున హెూమ్స్ లో రూ.35 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో తరితగతిన చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి, కాలనీ వాసులు వెంకట రత్న కుమార్, రాంబాబు రాజు, డీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్థలం కాపాడి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలి'



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 186, హౌసింగ్ బోర్డ్ స్థలం (ఆర్‌జీకే) సమీపంలో దాదాపు 6 ఎకరాల పైచిలుకు ప్రభు త్వ భూమిలో 59 జీవో కింద రెగ్యులర్ చేసుకోవడానికి గత రెండు రోజులుగా మట్టి పోసి చదును చేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ కోరారు. అలాగే కాలనీ ప్రజల అవసరా లకు ప్రభుత్వ భూమిని ఉపయోగించాలన్నారు. శనివారం ఆ స్థలానికి వెళ్లి పరిశీలించిన ఆయన నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి రెగ్యులరైజ్ చేయించు కోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యక్ష పరోక్ష రాజకీయ సహకారం అందిస్తూ మొత్తం భూమిని కొట్టేయడానికి అధికార బీఆర్ఎస్ పార్టీ ఇద్దరు కార్పొరేటర్ భర్తలు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని ఫెన్సింగ్ వేసి కాపాడి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని , ఇప్పటికే ఈ స్థలంపై బీజేపీ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ పోలీస్ అధికారుల దష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు హౌసింగ్ బోర్డ్ అధికారులు ఈ ప్రభుత్వ స్థలాన్ని కాపాడని ఎడల మంగళవారం ఉదయం బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున కాలనీ ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కాశి, నిజాంపేట్ కార్పొరేషన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు కుంటి రాము, కాలనీ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిది కొలన్ హన్మంత్ రెడ్డి 58వ పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యుఐ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయ కులు, మహిళా కాంగ్రెస్ నాయకులు అశేష జనవాహిని మధ్యలో ఘనంగా వేడకలు జరిగాయి. నియోజకవర్గంలోని నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కొలను హనుమంత రెడ్డితో కేకులు కట్ చేయించి, వారిని గజ మాలలతో సత్కరిం చారు. అనంతరం డప్పు చప్పుల మధ్య వాహనాలతో, బైకులతో జై జై హనుమంత్ రెడ్డి జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయవద్దు



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రజలు నాలాల్లోగానీ చెరువుల్లో గానీ ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు వేయరాదని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాలలో, దోమల నివారణ కోసం ఎంటమాలాజి సిబ్బందితో కలిసి ఎల్లమ్మ చెరువులోని గుర్రపు డెక్కను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒకసారి నీటి నిల్వలను తనిఖీ చేసి మళ్ళీ నీటిని నింపుకోవాలని సూచించారు. తమ ఇంటితోపాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. కాలనీలోకి వచ్చే చెత్త సేకరించే ఆటోలోనే, తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు చేసి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ నాయక్, పోశెట్టిగౌడ్, ఎంటమాలాజీ సూపర్వైజర్ డి. నరసింహులు, ఎంటమాలాజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వం కోసం వ్యాయామం తప్పనిసరి



- బీఆర్ఎస్ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ ఖాజా

నవతెలంగాణ - బాలానగర్

మనిషి ఆరోగ్యాన్ని తనకు తానుగా రక్షించుకోవడం తన బాధ్యతగా గుర్తించినప్పుడు తను చేయాల్సిన కార్యసాధన ఎంతో దోహదపడుతుందని, అదేవిధంగా మన శరీరాన్ని దృఢంగా, ఆరోగ్యా ఉండాలంటే పోషకాహారం ఎంత ముఖ్యమో, వ్యాయమం కూడా అంతే ముఖ్యమని బీఆర్ఎస్ బాలానగర్ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ ఖాజా(ఉమర్) అన్నారు. మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో మహ్మద్ ఖాజా స్వయంగా నిర్వహిస్తున్న బాడీ గ్యారేజ్ జిమ్ మొదటి వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ డివిజన్ కార్యదర్శి, బాడీ బిల్డింగ్ నిర్వాహకులు ఖాజా మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే విద్యార్థులు బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని జిమ్ కోచ్ ఇనాయత్ ఖాన్ శిక్షణలో పొందుతూ బంగారు, రజత పతకాలను గెలుచుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. మనిషి శరీరం బరువును నియంత్రించడానికి, కండరాలను దఢంగా, శక్తివంతంగా ఉంచడానికి, ఎముకలను బలంగా చేయడానికి, వ్యాధి నిరోధక శక్తిని వద్ధి పెంపొందిం చుకోవడానికి వ్యాయామం తోడ్పడుతుందని మన దైనందిక వ్యాయామం వలన అధిక రక్తపోటు, స్థూలకా యం, గుండె జబ్బులు, మధుమేహం, నిద్రలేమి, మానసిక రోగాల వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యాలని కాపాడుకునేందుకు, శారీర దృఢత్వం కోసం వ్యాయామం తప్పనిసరి అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయంలో పోషక ఆహార పదార్థాలు తీసుకోవడమే కాక వ్యాయామం చేసి శారీరక దఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఖాజా కోరారు.

కమ్యూనిస్టు ఐడియాలజీతోపాటు తాత్విక పునాదుల మీద రచించిందె 'హార్ట్ బీట్'

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య



నవతెలంగాణ ముషీరాబాద్

కమ్యూనిస్టు ఐడియాలజీతోపాటు తాత్విక పునాదుల మీద రచించిన పుస్తకమే హార్ట్ బీట్ పుస్తకమని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ రచయిత మందుల విప్లవ కుమార్ రచించిన హార్ట్ బీట్ ద సౌండ్ ఆఫ్ తెలంగాణ పుస్తక ఆవిష్కరణ సభను మోదుకుపోలు సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య ,ప్రజాగాయకురాలు విమలక్క, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా కంచె ఐలయ్య మాట్లాడుతూ తాను కమ్యూనిస్టు మేనిఫెస్టో చదువుతూ ఇంగ్లీషు రాయడం రచనలు చేయడం నేర్చుకున్నానన్నారు. రైటింగ్ ప్యాషన్‌గా ఎంచుకున్న వారే మంచి రచయితగా రాణిస్తారని తెలిపారు. సమాజాన్ని చదవకుండా రచయిత కాలేరన్నారు. ఉత్పత్తి, మానవ సంబంధాల మీద రచనలు ఎక్కువగా రావాలని సూచించారు. టీచర్లు ప్రొఫెసర్లు మెసేజ్ స్కాలర్లు పుస్తకాలు చదవడం లేదని.. ఇది సమాజానికి ప్రమాదం అన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ పుస్తక రచయిత సామాజిక ఆర్థిక అంశాల పట్ల నేటి యువతకు ఉపయోగపడే విధంగా అద్భుతమైన వ్యాసాలు రచించారని కొనియాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు న్యాయ వ్యవస్థ పై దాడి ఏ విధంగా జరుగుతుందో పూర్తిగా వివరించినట్టు తెలిపారు. విమలక్క మాట్లాడుతూ పుస్తక రచయిత మానవ మనుగడ ఏ విధంగా ఉండాలనే అంశాలపై చక్కటి వ్యాసాలు రాశారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో వాస్తవాలను వక్రీకరించి మేధావులు ఎక్కువగా పుట్టుకొస్తున్నారని, ఈ సమయంలో ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నల్లమల అడవి పై కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాలపై తీసుకున్న నిర్ణయాలపై రాసిన వ్యాసాలు కళ్లకు కట్టినట్లుగా ఉన్నాయని అభివర్ణించారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ పుస్తక రచయిత కమ్యూనిస్టు నేపథ్యంలో వ్యాసాలు రాశారని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మరిన్ని రచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్, సీనియర్ అడ్వకేట్ చెలకాని వెంకట్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ ఎస్ కే సలీమా, కలుకూరి రాజు, మూర్తి పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచన మేరకు, మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ తోట ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను శ్రావణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలను కొనియాడా రు. కూకట్ పల్లి నియోజకవర్గంలో దాదాపు ప్రతీ డివిజన్‌లో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.హెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్, మంజుల, మోహన్ రెడ్డి, సత్యం, ఉదయ్, ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్, మురళి, తిరుపతి, తుకారాం, జైరాజ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



చెపాక్‌లో ముంబయి ఇండియన్స్ ఆధిపత్యానికి తెరపడింది. 2011 తర్వాత చెపాక్‌లో ముంబయి ఇండియన్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ విజయం సాధించింది. జూనియర్ మలింగ మతీశ పతిరణ (3/15), దీపక్ చాహర్ (2/18) నిప్పులు చెరగటంతో సీజన్లో వరుసగా రెండోసారి ముంబయిపై సూపర్‌కింగ్స్ గెలుపొందింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానంతో చెన్నై సూపర్‌కింగ్స్ (13) ప్లేఆఫ్స్ ముంగిట నిలిచింది!.

సూపర్‌కింగ్స్ పంజా

- ముంబయి ఇండియన్స్‌పై గెలుపు
- నిప్పులు చెరిగిన మతీశ పతిరణ
- ప్లే ఆఫ్స్‌కు చేరువైన చెన్నై



నవతెలంగాణ-చెన్నై

ఐపీఎల్ దిగ్గజాల సమరం ఏకపక్షంగా ముగిసింది. శనివారం చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో ముంబయిపై చెన్నై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ముంబయి ఇండియన్స్‌కు స్వల్ప స్కోరుకు కట్టడి చేసిన చెన్నై సూపర్‌కింగ్స్.. ఛేదనలో చెమట పట్టకుండా దుమ్మురేపింది. సూపర్‌కింగ్స్ పేస్ త్రయం జూనియర్ మలింగ మతీశ పతిరణ (3/15), దీపక్ చాహర్ (2/15), తుషార్ దేశ్‌పాండె (2/26) నిప్పులు చెరిగే ప్రదర్శనతో చెలరేగారు. స్పిన్ స్వర్గధామం చెపాక్ పిచ్‌పై పేసర్లు పంజా విసరగా తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులే చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ నేహల్ వదేర (64, 51 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో ముంబయి ఇండియన్స్‌ను ఆదుకున్నాడు. ఓపెనర్లు డెవాన్ కాన్వే (44, 42 బంతుల్లో 4 ఫోర్లు), రుతురాజ్ గైక్వాడ్ (30, 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివం దూబె (26 నాటౌట్, 18 బంతుల్లో 3 సిక్స్‌లు) రాణించటంతో చెన్నై సూపర్‌కింగ్స్ 17.4 ఓవర్లలోనే లాంఛనం ముగించింది. మూడు వికెట్లతో మెరిసిన మతీశ పతిరణ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. 11 మ్యాచుల్లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఇది ఆరో విజయం కాగా.. ఓ ఫలితం తేలని మ్యాచ్‌తో ఓవరాల్‌గా 13 పాయింట్లు సాధించింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది!. ముంబయి ఇండియన్స్‌కు పది మ్యాచుల్లో ఐదో పరాజయం కావటం గమనార్హం.



పేసర్ల ప్రతాపం

టాస్ నెగ్గిన చెన్నై సూపర్‌కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. చెపాక్‌లో తిరుగులేని రికార్డున్న ముంబయి ఇండియన్స్‌కు ఆరంభం కలిసిరాలేదు. పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు చేజార్చుకుంది. దీపక్ చాహర్, తుషార్ దేశ్‌పాండె విజృంభించటంతో 14 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. కామెరూన్ గ్రీన్ (6), ఇషాన్ కిషన్ (7), రోహిత్ శర్మ (0)లు విఫలమయ్యారు. గ్రీన్ కథ తుషార్ ముగించగా.. దీపక్ చాహర్ ఒకే ఓవర్లో కిషన్, రోహిత్‌లను అవుట్ చేశాడు. నం.3 బ్యాటర్‌గా వచ్చిన రోహిత్ శర్మ మూడు బంతులు ఆడి డకౌట్‌గా నిష్క్రమించాడు. సూపర్‌కింగ్స్ పేసర్లు పంజా విసిరిన తరుణంలో నేహల్ వదేర (64) స్ఫూర్తిదాయక అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. రెండు కీలక 50 ప్లస్ భాగస్వామ్యాలు నమోదు చేసి ముంబయి ఇండియన్స్‌కు గౌరవ ప్రద స్కోరు అందించాడు. సూర్యకుమార్ యాదవ్ (26, 22 బంతుల్లో 3 ఫోర్లు)తో కలిసి నాల్గో వికెట్‌కు 55 పరుగులు జోడించాడు. ట్రిస్టన్ స్టబ్స్ (20, 21 బంతుల్లో 2 ఫోర్లు)తో కలిసి ఐదో వికెట్‌కు 54 పరుగులు జత చేశాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 46 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన నేహల్.. ముంబయి ఇండియన్స్ స్వల్ప స్కోరుకు పరిమితం కాకుండా చూశాడు. టాప్‌ను చాహర్, తుషార్ చూసుకోగా.. టెయిల్ కథను మతీశ పతిరణ ముగించాడు. స్టబ్స్, అర్షద్ ఖాన్ (1) సహా నేహల్‌లను మతీశ అవుట్ చేశాడు.

ఆడుతూ పాడుతూ

ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మధ్య పోరు మహా సమరమే!. ఐపీఎల్‌లో 9 ట్రోఫీలు దక్కించుకున్న ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడినా నరాలు తెగే ఉత్కంఠ ఖాయం. కానీ ఈ సీజన్ అందుకు భిన్నంగా సాగింది. వాంఖడె, చెపాక్‌లో సూపర్‌కింగ్స్ ఏకపక్ష విజయాలు నమోదు చేసింది. 139 పరుగుల ఛేదనలో సూపర్‌కింగ్స్‌కు ఓపెనర్లు అదిరే ఆరంభాన్ని అందించారు. డెవాన్ కాన్వే (44) ఓ ఎండ్‌లో సావధానంగా ఆడగా.. మరో ఎండ్‌లో రుతురాజ్ గైక్వాడ్ (30) రెచ్చిపోయాడు. తొలి వికెట్‌కు 46 పరుగులు జోడించిన అనంతరం గైక్వాడ్ నిష్క్రమించినా.. అజింక్య రహానె (21) దూకుడు పట్టాలు వీడలేదు. శివం దూబె (26) సూపర్ ఫామ్ కొనసాగించాడు. మూడు సిక్సర్లతో చెన్నై గెలుపు లాంఛనం చేశాడు. ఆరంభంలో వికెట్లతో చెన్నైపై ఒత్తిడి పెంచే అవకాశాన్ని ముంబయి చేజార్చుకుంది. స్పిన్నర్ పియూశ్ చావ్లా (2/25) మాయ ముంబయికి ఊరట. ఛేదనలో చివర్లో ఎం.ఎస్ ధోని (2 నాటౌట్) అభిమానులను అలరించాడు. బ్యాటర్ల మెరుపులతో 17.4 ఓవర్లలోనే చెన్నై సూపర్‌కింగ్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



స్కోరు వివరాలు :

ముంబయి ఇండియన్స్ : కామెరూన్ గ్రీన్ (బి) తుషార్ 6, ఇషాన్ కిషన్ (సి) మహీశ్ (బి) చాహర్ 7, రోహిత్ శర్మ (సి) జడేజా (బి) చాహర్ 0, నేహల్ వదేర (బి) మతీశ 64, సూర్యకుమార్ యాదవ్ (బి) జడేజా 26, ట్రిస్టన్ స్టబ్స్ (సి) జడేజా (బి) మతీశ 20, టిమ్ డెవిడ్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 2, అర్షద్ ఖాన్ (సి) రుతురాజ్ (బి) మతీశ 1, జోఫ్రా ఆర్చర్ నాటౌట్ 3, పియూశ్ చావ్లా నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 139.

వికెట్ల పతనం : 1-13, 2-13, 3-14, 4-69, 5-123, 6-127, 7-134, 8-137.

బౌలింగ్ : దీపక్ చాహర్ 3-0-18-2, తుషార్ దేశ్‌పాండె 4-0-26-2, రవీంద్ర జడేజా 4-0-37-1, మొయిన్ అలీ 1-0-10-0, మహీశ్ తీక్షణ 4-0-28-0, మతీశ పతిరణ 4-0-15-3.

చెన్నై సూపర్‌కింగ్స్ : రుతురాజ్ గైక్వాడ్ (సి) ఇషాన్ (బి) పియూశ్ చావ్లా 30, డెవాన్ కాన్వే (ఎల్బీ) ఆకాశ్ 44, అజింక్య రహానె (ఎల్బీ) చావ్లా 21, అంబటి రాయుడు (సి) రాఘవ్ (బి) స్టబ్స్ 12, శివం దూబె నాటౌట్ 26, ఎం.ఎస్ ధోని నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 5, మొత్తం : (17.4 ఓవర్లలో 4 వికెట్లకు) 140.

వికెట్ల పతనం : 1-46, 2-81, 3-105, 4-130.

బౌలింగ్ : కామెరూన్ గ్రీన్ 1-0-10-0, జోఫ్రా ఆర్చర్ 4-0-24-0, అర్షద్ ఖాన్ 1.4-0-28-0, పియూశ్ చావ్లా 4-0-25-2, రాఘవ్ గోయల్ 4-0-33-0, ట్రిస్టన్ స్టబ్స్ 2-0-14-1, ఆకాశ్ 1-0-4-0.

ఇక తగ్గేదే లేదు!

- రెండు కమిటీలు ఏర్పాటు
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ

రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన



నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసే వరకు జంతర్‌మంతర్ నుంచి కదిలేది లేదని ఆందోళనలో కూర్చున్న రెజ్లింగ్ క్రీడాకారులు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై బెయిలుకు వీలులేని సెక్షన్ల ప్రకారం రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా.. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంపై రెజ్లర్లు మండిపడుతున్నారు. అంతర్జాతీయ వేదికలపై దేశం గర్వపడే విజయాలు సాధించిన మహిళా అథ్లెట్ల ఆవేదన ప్రధానమంత్రి నరెంద్ర మోడికి పట్టడం లేదని, సొంత పార్టీ ఎంపీని కాపాడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని క్రీడాకారులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు విమర్శలు గుప్పిస్తున్నారు.

న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన 14వ రోజుకు చేరుకుంది. ఒలింపియన్లు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగినా.. కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం కనిపించటం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చట్టపర చర్యలు తీసుకునేందుకు ఢిల్లీ పోలీసులు ఆసక్తి చూపటం లేదు. దీంతో రెజ్లింగ్ క్రీడాకారులు దీర్ఘకాలిక ప్రణాళికలపై దృష్టి సారించారు. జంతర్‌మంతర్ వద్ద దీర్ఘకాలిక ఆందోళనకు రూపొందించాల్సిన కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు రెండు కమిటీలు ఏర్పాటు చేశారు.

ఈ మేరకు అగ్రశ్రేణి రెజ్లర్ బజరంగ్ పూనియా శనివారం తెలిపారు. 'న్యాయపరంగా ముందుకెళ్లాల్సిన మార్గాలపై న్యాయ బృందంతో వినేశ్ ఫోగట్ చర్చలు జరుపుతోంది. ఆ విషయాలు త్వరలోనే వెల్లడిస్తాము. జంతర్‌మంతర్ వద్ద ఆందోళన కార్యక్రమాల రూపకల్పనకు రెండు కమిటీలు ఏర్పాటు చేశాం. 31 మందితో కూడిన తొలి కమిటీలో కాప్ పంచాయతీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, వ్యవసాయ సంఘాలు సహా వివిధ వర్గాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ నిరసన కార్యక్రమాల రూపకల్పనపై మార్గనిర్దేశనం చేస్తుంది. 9 మందితో మరో కమిటీ ఏర్పాటు చేశాం. రెండో కమిటీ పూర్తిగా రెజ్లింగ్ ఆటపై దృష్టి పెడుతుంది. ఈ రెండు కమిటీలు తీసుకునే నిర్ణయాలతో ఇక నుంచి ఆందోళన ముందుకు సాగుతుంది. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసేంత వరకు ఈ పోరాటం కొనసాగుతుంది. బ్రిజ్‌భూషణ్ జైలుకు వెళ్లే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని' బజరంగ్ పూనియా వెల్లడించారు.

రోహిత్.. విరామం తీసుకో!

హిట్‌మ్యాన్‌కు సునీల్ గవాస్కర్ సూచన



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యధిక టైటిళ్లు సాధించిన కెప్టెన్‌గా రికార్డు సృష్టించిన రోహిత్ శర్మ.. తాజా ఐపీఎల్ సీజన్లో అత్యంత పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్నాడు. ముంబయి ఇండియన్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన నాయకుడు రోహిత్ శర్మ. ఐపీఎల్16లో రోహిత్ శర్మ ఏకంగా 8 ఇన్నింగ్స్‌ల్లో పవర్‌ప్లే ముగిసేలోపే వికెట్ కోల్పోయాడు. వరుస మ్యాచుల్లో సున్నా పరుగులకే నిష్క్రమించిన రోహిత్ శర్మ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక సార్లు డకౌట్ అయిన బ్యాటర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. సునీల్ నరైన్, దినేశ్ కార్తీక్‌లు 15 సార్లు డకౌట్ కాగా.. చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఆ చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో క్రికెట్ దిగ్గజం లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ అతడికి ఓ సూచన చేశాడు. తాత్కాలికంగానైనా ఐపీఎల్ నుంచి విరామం తీసుకోవాలని సూచించాడు. 'రోహిత్ శర్మ కొంత కాలమైనా ఐపీఎల్ నుంచి విరామం తీసుకోవాలని సూచిస్తున్నాను. రానున్న ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌కు ఫిట్‌గా ఉండేందుకు విరామం ఉపయోగపడుతుంది. ఐపీఎల్ చివరి దశ మ్యాచులకు రోహిత్ శర్మ తిరిగి అందుబాటులోకి రావచ్చు. కానీ ప్రస్తుతానికి అతడు కాస్త ఊపిరి తీసుకునేందుకైనా విరామం తీసుకోవాలి' అని సునీల్ గవాస్కర్ అన్నాడు. వరల్డ్ నం.1 భారత్, వరల్డ్ నం.2 ఆస్ట్రేలియాలు ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌లో పోటీపడనున్న సంగతి తెలిసిందే. జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో మహా టెస్టు సమరం జరుగనుంది. గాయాలతో రిషబ్ పంత్, జశ్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ ఇప్పటికే జట్టుకు దూరమైన నేపథ్యంలో కీలక పోరుకు భారత క్రికెటర్ల ఫిట్‌నెస్‌పై ఆందోళన నెలకొంది.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X లక్నో
వేదిక : అహ్మదాబాద్, సమయం: మ:3.30

హైదరాబాద్X రాజస్థాన్
వేదిక : జైపూర్, సమయం : రా: 7.30

స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం

నవచిత్రం

మా ఊరి పొలిమేరకు మించి..



శ్రీకృష్ణ క్రియేషన్స్ బేనర్ పై గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మాతగా డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మా ఊరి పొలిమేర -2'. సత్యంరాజేష్, డా.కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, అక్షత, బాలాదిత్య, సాహితి దాసరి, రవి వర్మ, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. శనివారం ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత గౌరికృష్ణ మాట్లాడుతూ, "మా ఊరి పొలిమేర' చిత్రాన్ని చూసి చాలా ఎగ్జైట్ అయ్యాను. దానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాని మా బ్యానర్‌లో చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. దర్శకుడు 'మా ఊరి పొలిమేర'ను మించి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. త్వరలోనే టీజర్ రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. "మా ఊరి పొలిమేర' చిత్రాన్ని ప్రేక్షకులందరూ బాగా ఆదరించారు. ఈ చిత్ర విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం' అని దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు.

70 దేశాల్లో ట్రైలర్ రిలీజ్..



ప్రభాస్

ప్రభాస్ రాముడిగా ఓమ్ రౌత్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆది పురుష్' చిత్ర ట్రైలర్ ఈనెల 9న గ్లోబల్ ట్రైలర్ లాంచ్‌తో చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉంది. ఈ ట్రైలర్ లాంచ్‌ని ప్రకటిస్తూ, 'ఆదిపురుష్' నుంచి ప్రభాస్ కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా ఇప్పటికే ట్రిబెకా ఫెస్టివల్‌లో అంతర్జాతీయ ప్రీమియర్‌కు సెలెక్ట్ కావడం ద్వారా ఓ గొప్ప మైల్ స్టోన్‌ను సాధించింది. ఇక లేటెస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కోసం అద్భుతమైన ట్రైలర్‌తో రెడీ అయ్యింది. మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలలో ఈ ట్రైలర్‌ను రికార్డ్ స్థాయిలో లాంచ్ చేయబోతున్నారు. జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

'ఓ మంచి జ్ఞాపకం లాంటి సినిమా..'

ప్రముఖ నిర్మాణ సంస్థ స్వప్న సినిమా నిర్మాణంలో నందిని రెడ్డి దర్శకత్వంలో సంతోష్ శోభన్, మాళవిక నాయర్ ప్రధాన పాత్రలలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 18న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్మాతలు స్వప్న దత్, ప్రియాంక దత్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి కథ చెప్పాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాం. వేసవిలో మన అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లి ఓ పది రోజులు హాయిగా గడిపి వస్తే ఆ జ్ఞాపకం ఎలా ఉంటుందో..ఈ సినిమా అలా ఉంటుంది. ఈ సినిమా అంతా కునూర్ హిల్ స్టేషన్‌లో జరుగుతుంది. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా నందిని క్రియేట్ చేసిన టౌన్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఓ చిన్న ప్రపంచంలోకి తీసుకెళుతుంది.కథాను గుణంగా ఇందులో గౌతమీ, ఊర్వశి లాంటి నటీమణులు ఉన్నారు. సంతోష్ శోభన్ లాంటి హీరోతో చేసినప్పుడు ఎలాంటి కాలిక్యులేషన్ వేసుకోం. నాన్నగారు 50 ఏళ్ళుగా ఇండస్ట్రీలో నిలబడ్డారు. ఈ రోజు ఆయన పిల్లలు సినిమాలు తీస్తున్నారు. ఆయన ఏ రోజు లెక్కలు వేసుకోలేదు. బహుశా అదే మాకూ వచ్చింది. ఈ సినిమా చూసినప్పుడు మీకే అనుభవంలోకి వస్తుంది. ఒక మంచి జ్ఞాపకం లాంటి ఎమోషన్, ఆనందం వస్తే కంటి తడి పెట్టె ఎమోషన్. ఎమోషన్స్ అన్నీ చాలా సెటిల్డ్‌గా ఉంటాయి. నందిని రెడ్డి సినిమాల పంథాలోనే ఈ సినిమా కూడా ఉంటుంది. ప్రభాస్ 'ప్రాజెక్ట్ కె' 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది. మా వైజయంతి వచ్చిన క్లాసిక్స్‌లో 'జగదీక వీరుడు అతిలోక సుందరి'కి పార్ట్ 2 చేయాలనేది మా కోరిక. మాకు నచ్చి, ముచ్చట పడి చేస్తున్న ప్రతి సినిమా ప్రేక్షకులకు నచ్చడం అదృష్టం.



ప్రియాంక దత్, స్వప్న దత్

బిచ్చగాడు 2 హిట్ ఖాయం




విజయ్ ఆంటోని, కావ్యథాపర్

'బిచ్చగాడు' సినిమాతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్నారు విజయ్ ఆంటోనీ. ఈ మూవీకి సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2'తో ఈనెల 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. విజయ్ ఆంటోనీ స్వీయ దర్శకత్వంలోనే ఈ సినిమా రూపొందడం విశేషం.

ఈ సినిమా గురించి ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని నాకు బాగా తెలిసిన ఉషా పిక్చర్స్ వారు విడుదల చేయడం సంతోషంగా ఉంది. ఫస్ట్‌పార్ట్‌లో అద్భుతమైన పాయింట్‌తో వచ్చారు. ఆ టైమ్‌లో ఈ సినిమా అన్ని బంధాలను బాగా గుర్తు చేసింది. ఇప్పుడు మరోసారి అలాంటి సెంటిమెంట్‌తోనే ఈ చిత్రం వస్తున్నట్టు కనిపిస్తోంది' అని తెలిపారు.

"బిచ్చగాడు 2 బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుంది. పార్ట్ 1లో చూసిన దానికంటే లార్జర్ స్కేల్‌లో సెకండ్ పార్ట్‌లో చూస్తారు. మొదటి భాగంలో మదర్ సెంటిమెంట్ చూశారు. ఈసారి సిస్టర్ సెంటిమెంట్ చూడబోతున్నారు. ఈ 19న మీరంతా ఫ్యామిలీస్‌తో వచ్చి థియేటర్స్‌లో సినిమా చూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని విజయ్ ఆంటోనీ చెప్పారు.

కొత్త రంగుల ప్రపంచం



క్రాంతి, శ్రీలు

ప్రముఖ హాస్య నటుడు పృథ్వీ డైరెక్టర్‌గా మారుతూ, తన కూతురు హీరోయిన్‌గా 'కొత్త రంగుల ప్రపంచం' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. క్రాంతి హీరోగా నటిస్తుండగా, పృథ్వీ కూతురు శ్రీలు హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ పిఆర్ మూవీస్ బ్యానర్‌పై పద్మ రేఖ, గుంటక శ్రీనివాస్ రెడ్డి, కుర్రి కృష్ణా రెడ్డి కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదలకు సిద్ధమైన సందర్భంగా నాగబాబు ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. చిత్ర నిర్మాతలు పద్మ రేఖ,గుంటక శ్రీనివాస్ రెడ్డి, కుర్రి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ,'పృథ్వీ చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశాం. మంచి కాన్సెప్ట్‌తో తీసిన మా చిత్ర టీజర్‌ను విడుదల చేసిన నాగబాబుకు ధన్యవాదాలు' అని తెలిపారు.'ఓ మంచి సినిమా ద్వారా వస్తున్న మా అందర్నీ ప్రేక్షకులు ఆదరించి, ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. మా సినిమా చూసిన అందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ అన్నారు.

మెప్పించే సరికొత్త కాన్సెప్ట్



మంచు మనోజ్, కేతన్ శివ ప్రీతమ్

'గడిచిన కాలం' ఫ్యూచర్ ఫిల్మ్‌ని మంచు మనోజ్ శనివారం లాంచ్ చేశారు. దీన్ని చిత్తూరు మాజీ ఎం.పీ శివప్రసాద్ గారి మనవడు కేతన్ శివ ప్రీతమ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

మంచు మనోజ్ మాట్లాడుతూ, 'ప్రీతమ్ ఈ ఫ్యూచర్ ఫిల్మ్‌ని చాలా బాగా తీసాడు. తను త్వరలో మెగాఫోన్ పట్టుకుంటాడు. అంతేకాదు తన తండ్రి గుంతాటి వేణుగోపాల్, తాత శివ ప్రసాద్ అడుగుజాడల్లో నడుస్తూ అన్నీ రంగాలలో రాణించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. 'నేను చాలా కవర్ సాంగ్స్, షార్ట్ ఫిల్మ్స్ చేశాను. శనివారం నుంచి నా యూట్యూబ్ ఛానెల్ కె.ఎస్.పి.టాకీస్‌లో ఈ ఫ్యూచర్ ఫిల్మ్ రిలీజ్ అవుతుంది. సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన దీన్ని అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అని దర్శక, నిర్మాత ప్రీతమ్ చెప్పారు.

ఆద్యంతం వినోదాత్మకం

స్టార్ ఫిలిం ఫ్యాక్టరీ పతాకంపై ఎస్.శివకళ్యాణ్ దర్శకత్వంలో ఎమ్‌డి అసీఫ్ జానీ నిర్మిస్తోన్న చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. శ్రీరామ్ నిమ్మల, దేవరాజ్ పాలమూర్, అవినాష్ చౌదరి, సీతాపులి, ఐశ్వర్య ఉల్లింగల, శ్రియాంక, విజయ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్ర మోషన్ పోస్టర్ ఆవిష్కరణ శ్రీ సత్య సాయి నిగమాగమంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకులు వి.సముద్ర మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్మాత మాట్లాడుతూ, 'నిర్మాతగా ఇది నా తొలి చిత్రం. దర్శకుడు చెప్పిన మంచి కథని అనుకున్న విధంగా తెరకెక్కించారు. ఫస్ట్ కాపీ సిద్ధమైంది. జూన్‌లో సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. 'పల్లెటూరి నేపథ్యంలో సాగే రివేంజ్ కామెడీ డ్రామా చిత్రమిది. సినిమా చాలా అల్లరల్లరిగా ఉంటూ అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది. ఇందులో 4 అద్భుతమైన పాటలు ఉన్నాయి. త్వరలో పాటలను రిలీజ్ చేస్తాం' అని దర్శకుడు ఎస్.శివ కళ్యాణ్ అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : దేవరాజ్ పాలమూర్, కో-ప్రొడ్యూసర్ : కె.కళ్యాణ్ రావ్.



సర్పంచ్‌లకు అంకితం

సమాజంలో, కుటుంబాలలో జరుగుతున్న అనుమానాస్పదమైన సమస్యలను, మంచి చెడులను ఎత్తి చూపిస్తూ ఆ సమస్యలను ఎలా అరికట్టాలి అనే దాని పై చిత్రీకరిస్తున్న మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రం 'అయ్యో పాపం'. బాలా క్రియేషన్స్ పతాకంపై రజినీ కుమార్, జీవన్ కుమార్ సపాన్స్ హీరో, హీరోయిన్స్‌గా, దర్శకుడు కొర్ర శంకర్ నాయక్ ముప్పలను పరిచయం చేస్తూ ప్రసాద్ రాజు నిర్మిస్తున్న చిత్రమిది. ఇటీవల ఫిలింఛాంబర్‌లో చిత్ర ఫస్ట్ లుక్, సాంగ్‌ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన టి.యఫ్.సి.సి. ప్రెసిడెంట్ ప్రతాని రామకృష్ణ గౌడ్, లయన్ సాయి వెంకట్ విడుదల చేశారు. చిత్ర దర్శకుడు కొర్ర శంకర్ నాయక్ మాట్లాడుతూ, 'తెలంగాణలో 12,000, ఆంధ్రలో 13,000 సర్పంచ్‌లు ఉన్నారు. వారందరి సాధక బాధకాలను ఇతివృత్తంగా చేసి 'మా మంచి సర్పంచి మా..శంకరన్న మాట తప్పని వాడు మన శంకరన్న" పాటను రెండు తెలుగు రాష్ట్రాల సర్పంచ్‌లందరికీ అంకితం చేస్తున్నాము. ఇప్పటి వరకు 30 శాతం షూటింగ్ పూర్తయ్యింది' అని తెలిపారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

యూనియన్ బ్యాంక్ ఫలితాలు ఆకర్షణీయం

- క్యూ4 లాభాల్లో 93 శాతం వృద్ధి
- తగ్గిన మొండి బాకీలు



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 93.3 శాతం వృద్ధితో రూ.2,782 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.1,440 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 21.88 శాతం పెరిగి రూ.8,251 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 62.48 శాతం వృద్ధితో రూ.5,269 కోట్లుగా చోటు చేసుకుంది.2023 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.3 లేదా 30 శాతం డివిడెండ్‌ను ప్రతిపాదిస్తూ యుబిఐ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. బ్యాంక్ కరెంట్ ఎకౌంట్, సేవింగ్ ఎకౌంట్ (కాసా) డిపాజిట్లు 4.47 శాతం పెరిగి రూ.11,17,716 కోట్లకు చేరాయి. అడ్వాన్సులు 13.05 శాతం వృద్ధితో రూ.8.09 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 358 బేసిస్ పాయింట్లు తగ్గి 7.53 శాతానికి దిగివచ్చాయి. 2022 ఇదే సమయం నాటికి 11.11 శాతం జిఎన్‌పిఎ నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 198 బేసిస్ పాయింట్లు తగ్గి 3.68 శాతం నుంచి 1.70 శాతానికి పరిమితం కావడంతో ఆ బ్యాంక్ మెరుగైన ప్రగతిని కనబర్చినట్లయ్యింది.

బిఒఐ లాభాలు రెట్టింపు

- నికర వడ్డీ ఆదాయంలో 38 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) 2023 మార్చితో ముగిసిన త్రైమాసికం లో 123 శాతం వృద్ధితో రూ. 1,350 కోట్ల నికర లాభాలు సాధించింది. ఈ ప్రభుత్వ రంగ సంస్థ గతేడాది ఇదే సమయంలో రూ.606 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 37.77 శాతం పెరిగి రూ.5,493 కోట్లకు చేరింది. 2022-23కు గాను ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.2 డివిడెండ్‌ను అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణాల జారీ 12.87 శాతం పెరిగి రూ.5.15 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం డిపాజిట్లు 6.64 శాతం వృద్ధితో రూ.6.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏడాదికేడాదితో పోల్చితే 9.98 శాతం నుంచి 7.31 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 2.34 శాతం నుంచి 1.66 శాతానికి దిగివచ్చాయి. 2022-23లో మొత్తంగా 18.15 శాతం వృద్ధితో రూ. 4,023 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 2021-22లో రూ. 3,405 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో నికర వడ్డీపై ఆదాయం రూ.14,063 కోట్లుగా ఉండగా.. గడిచిన 2022- 23లో 44.17 శాతం పెరుగుదలతో రూ.20,275 కోట్లకు చేరింది. వడ్డీ యేతర ఆదాయం రూ.7,100 కోట్లుగా చోటు చేసుకుంది. ఆ బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ 9.27 శాతం వృద్ధితో రూ.10,84,910 కోట్లుగా ఉంది. వ్యవసాయ రుణాలు 8.99 శాతం పెరిగి రూ.72,391 కోట్లుగా, ఎస్ఎంఎంఇ అడ్వాన్సులు 9.31 శాతం వృద్ధితో రూ.70,777 కోట్లుగా, రిటైల్ క్రెడిట్ 17.40 శాతం పెరిగి రూ.94,716 కోట్లు చొప్పున నమోదయ్యాయి.

రూ.220 పెరిగిన బంగారం ధర

- కిలో వెండి రూ.78,250కి చేరిక



న్యూఢిల్లీ : దేశంలో బంగారం ధర సామాన్యుడికి అందకుండా పోతోంది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడిపై రూ.220 పెరిగి రూ.62,400కు చేరింది. గుడ్‌రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.200 పెరిగి రూ.57,200గా పలికింది. హైదరాబాద్, కోల్‌కత్తా, ముంబయిలో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 62,400గా నమోదయ్యింది. కిలో వెండిపై ఏకంగా రూ.1,150 ఎగిసి రూ.78,250కి చేరింది.

జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నివాసంలో సిబిఐ సోదాలు



న్యూఢిల్లీ : జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకులు నరేశ్ గోయల్ నివాసం, సంస్థ పాత కార్యాల యాల్లో సిబిఐ సోదాలు చేప ట్టింది. కెనరా బ్యాంకును రూ. 538 కోట్ల మేర మోసం చేశారనే ఆరోపణలపై సిబిఐ కేసు నమోదు చేసింది. ఈ విచారణలో భాగంగా శుక్రవారం గోయల్‌కు చెందిన పలు ప్రాంతాల్లో సోదాలు చేసింది. ఆ సంస్థ మాజీ అధికారుల నివాసాల్లోనూ తనిఖీలు చేసింది. దేశంలో ఒకప్పుడు అతిపెద్ద విమానయాన కంపెనీగా ఉన్న సంస్థ.. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని 2019లో మూతపడింది. దీన్ని జలన్ కాల్‌రాక్ కన్సోరియం స్వాధీనం చేసుకున్నప్పటికీ.. ఇప్పటికీ సేవలు పునరుద్ధరించలేకపోయింది.

కోటి 34,53,975 మందికి కంటి పరీక్షలు

- 19,95,659 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ
- 9,875 గ్రామపంచాయతీ వార్డులు, మరో 3,058 మున్సిపల్ వార్డుల్లో పూర్తి
- సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి 34,53,975 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన 19,95, 659 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 9,875 గ్రామపంచాయతీ వార్డులు, మరో 3,058 మున్సిపల్ వార్డుల్లో పరీక్షలు పూర్తయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ అర్విండ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 63,18,637 మంది పురుషులు, 71,20,703 మంది మహిళలు, 7,042 ట్రాన్స్‌జెండర్లున్నారు.

98,77,475 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు. వంద రోజుల్లో నిర్దేశించుకున్న లక్ష్యానికి 85 శాతం పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. జనవరి 19న ప్రారంభమైన శిబిరాలు జూన్ 15తో ముగియనున్నాయి. నివారించదగ్గ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంతో 2018లో మొదటిసారి కంటి వెలుగు పరీక్షలను నిర్వహించగా, రెండో దఫా ఇప్పుడు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యారోగ్యశాఖ అధికారులతో పాటు గ్రామపంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది.

తడిసిన వడ్లను కాంటాలు ఎప్పుడు కొంటారు? : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తడిసిన వడ్లను ఎప్పుడు కొంటారో చెప్పాలని వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వడ్లకు మొలకలు వచ్చి రైతన్న రోదిస్తున్నారని తెలిపారు. ఒక పక్క వానలు పడుతున్నా కొనుగోలు సెంటర్లు తెరవడం లేదని పేర్కొన్నారు. మరో పక్క మిల్లర్లు కోతలు పెట్టి కాంటాలు వేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్ర రైతులకు మాయమాటలు చెప్పి కండువాలు కప్పే సీఎం కేసీఆర్ కు.. రాష్ట్ర రైతుల కష్టాలు కనిపించడం లేదని ఆమె వాపోయారు. తడిసిన వడ్లు కొనడంతో పాటు ఎకరాకు రూ. 30వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హరితహారం అద్భుతం..పరుచుకున్న పచ్చదనం

కర్నాటక రాష్ట్ర అడవులు, పర్యావరణ శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జావేద్ అక్తర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తెలంగాణకు హరితహారం కార్యక్రమం అద్భుతమనీ, దాని ఫలితంగా ఎక్కడ చూసినా పచ్చదనం పరుచుకున్నదని కర్నాటక రాష్ట్ర అడవులు, పర్యావరణ శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జావేద్ అక్తర్ ప్రశంసించారు. ఆ కార్యక్రమం అమలులో ప్రభుత్వ సంకల్పం, అధికారులు, సిబ్బంది కృషి, ప్రజల సహకారం అడుగడుగునా కనిపిస్తున్నదని చెప్పారు. తెలంగాణకు హరితహారం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు జరిగిన క్రమంపై అధ్యయనం చేసేందుకు ఆయన శనివారం హైదరాబాద్ వచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల్లో పర్యటించి దూలపల్లి ఫారెస్ట్ రీసెర్చ్ నర్సరీ, కండ్లకోయ ఆక్సిజన్ అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఔటర్ రింగ్ రోడ్డు వెంట పచ్చదనం, అలాగే హైదరాబాద్‌లో అంతర్గత రోడ్ల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ (రహదారి వనాలు), మీడియన్ ప్లాంటేషన్లను పరిశీలించారు. సీఎం ఓఎస్డీ (హరితహారం) ప్రియాంక వర్గీస్ స్వయంగా కర్నాటక అధికారికి హరితహారం కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా జావేద్ అక్తర్ మాట్లాడుతూ.. కండ్లకోయ ఆక్సిజన్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను చాలా చక్కగా అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర మంతటా ఇదే తీరులో 109 ఫారెస్ట్ పార్కులను పర్యావరణ పరంగా ఏర్పాటు చేయటం అభినందనీయమని కొనియాడారు. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు, నగరంలోనూ పచ్చదనం కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయన్నారు. కర్నాటక ప్రభుత్వం కూడా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు ప్రణాళికలు రూపొందిస్తోందని, ఆ అధ్యయనంలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటన తర్వాత అరణ్యభవన్‌లో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఓఎఫ్) ఆర్ఎం. డోబ్రియాల్, కంపా పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్, విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరుతో జావేద్ అక్తర్ సమావేశమయ్యారు. తెలంగాణకు హరితహారం కార్యాచరణ, ఫలితాలను పీసీసీఎఫ్ డోబ్రియాల్ ఈ సందర్భంగా వివరించారు.

పర్యటనలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి డీఎఫ్ఓలు ఎం. జోజి, సుధాకర్ రెడ్డి, జానకి రామ్‌తో పాటు, అటవీశాఖ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న ఎండలు

- అక్కడక్కడా వర్షం పడే అవకాశం
- బంగాళాఖాతంలో అల్పపీడనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటాయి. వచ్చే రెండుమూడ్రోజుల్లో గరిష్టంగా మూడు నుంచి ఐదు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. గరిష్టంగా 43 డిగ్రీల వరకు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటొచ్చు. శనివారం ఉదయం బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అది సముద్ర మట్టం నుంచి ట్రోపోస్పిరిక్ స్థాయి వరకు కొనసాగుతున్నది. దీని ప్రభావంతో సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడనున్నది. అది కాస్తా ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే అవకాశముంది. ఆ తర్వాత మధ్య బంగాళాఖాతంవైపు కదులుతూ తీవ్రతరమై తుఫాన్‌గా బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, దీని ప్రభావం వల్ల తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయి.

ఇదే క్రమంలో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగనున్నాయి. దీంతో పాటు రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలు కనిపిస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో శనివారం రాత్రి 10 గంటల వరకు 150కిపైగా ప్రాంతాల్లో వర్షం పడినట్టు టీఎస్‌డీపీఎస్ తన నివేదికలో పేర్కొంది. వికారాబాద్ జిల్లా కోటేపల్లిలో అత్యధికంగా 7.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 37 ప్రాంతాల్లో మోస్తరు వానపడగా..మిగతా ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సానుకూలంగా స్పందించండి

మాయావతికి మంద కృష్ణ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సానుకూలంగా స్పందించాలంటూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ శనివారం బీఎస్పీ జాతీయ అధ్యక్షులు మాయావతికి బహిరంగ లేఖ రాశారు. సామాజిక న్యాయానికి విలువనివ్వాలని ఆమెను కోరారు. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) 29 ఏండ్లుగా పోరాడుతున్నదని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్లను ప్రతి రాష్ట్రంలో ఒకటో రెండో కులాలు వారు జనాభా కంటే అదనంగా రిజర్వేషన్లు పొందుతున్నారని తెలిపారు.

దీంతో ఎస్సీలలోని ప్రతి కులానికి రావాల్సిన వాటా దక్కటం లేదని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగం, సంక్షేమ, రాజకీయ రంగాల్లో ఎస్సీల్లోని మెజార్టీ కులాలు వెనుకబడి పోతున్నాయని తెలిపారు. ప్రతి కులానికి న్యాయం జరిగేలా ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలంటూ కేంద్రంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ గతంలో నియమించిన కమిషన్‌లన్నీ సూచించాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే అంబేద్కర్, కాన్షీరాం దృక్పథంతో పోరాడుతున్న ఎంఆర్‌పీఎస్‌కు మద్దతు ప్రకటించాలని మాయావతిని ఆయన కోరారు.

హైదరాబాద్‌కు చేరుకున్న మాయావతి

బీఎస్పీ జాతీయ అధ్యక్షులు మాయావతి శనివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆమెకు రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్, మంద ప్రభాకర్,చంద్రశేఖర్ ముదిరాజ్ తదితరులు బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటండి

గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ ద్వారా పిలుపునిచ్చిన ఆర్.నారాయణ మూర్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సినీనటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఎంపీ సంతోశ్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శనివారం జూబ్లీహిల్స్ జీహెచ్ఎంసీ పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హరితహారం స్ఫూర్తితో ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టి ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్నారని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఎందరినో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారని ప్రశంసించారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, వాతావరణంలో మార్పులను అరికట్టాలన్నా మొక్కలను నాటడం ద్వారానే సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు.

ఉద్యోగాల కోసం 30 లక్షల మంది దురుచూస్తున్నారు : మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లు ఇస్తే 15 పేపర్స్ లీకయ్యాయని విమర్శించారు. ఇంత ఘోరంగా పేపర్స్ లీక్ అయితే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు మానవతారాయ్, రియాజ్, చరణ్ కౌశిక్, చారగొండ వెంకటేష్, చెరగని దయాకర్, బాలలక్ష్మితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదే కమిటీ ద్వారా మళ్లీ పరీక్షలకు సమాయత్తం కావడం దుర్మార్గమన్నారు. యువత పోరాటాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో యువతకు అన్యాయం జరుగుతుంటే, మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

31న బ్రాహ్మణ సదన్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బ్రాహ్మణ సదన్‌ను ఈనెల 31వ తేదీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రారంభించనున్నారు. దీనికోసం చివరి దశ పనుల్ని వేగవంతం చేశారు. బ్రాహ్మణ పరిషత్ ఈనెల 17 వ తేదీ జరిగే సమావేశంలో ప్రారంభ సమయాన్ని ఖరారు చేస్తుంది. శంగేరి, పుష్పగిరి, హంపిలతో సహా మరో ఆరుగురు పీఠాధిపతులను ఆహ్వానించే అవకాశం ఉన్నట్టు సమాచారం. పెండ్లిండ్లు, ఉపనయనాలతో సహా ఇతర శుభకార్యాలు నిర్వహించుకునే విధంగా 600 మందికి సరిపడే సామర్థ్యంతో కళ్యాణ మంటపం నిర్మాణం పూర్తికావచ్చిందని బ్రాహ్మణ పరిషత్ తెలిపింది.

రాష్ట్రంలో వ్యవసాయ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ ఎమర్జెన్సీ ప్రకటించాలని కిసాన్ కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, సుంకేట అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలతో పంటలు, ధాన్యం తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. తడిసిన ధాన్యం, పంటలను వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. ధరణి లోపాలను సవరించాలంటూ హైకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చలనం లేదని విమర్శించారు. రైతుల పేరిట రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్ భూముల విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నదని చెప్పారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ కోర్టు 15 రోజుల సమయం ఇచ్చిందనీ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుని రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆదేశాల అమల్లో వేగం పెంచండి

కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ప్రభుత్వ కార్యక్రమ ఆదేశాల అమల్లో మరింత వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడా అలసత్వం వద్దనీ, సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. శనివారంనాడామె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు ఆదేశాలు జారీ చేశారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళా శిబిరాలను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సందర్శించి ప్రజలకు సంతృప్తికరంగా సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో అన్ని కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయాలనీ, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని చెప్పారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టాల గణనను పూర్తి చేయాలని అన్నారు. జీవో 58కి సంబంధించి మిగిలివున్న పట్టాలను త్వరగా పంపిణీ చేయాలనీ, జీవో 59కి సంబంధించి కన్వేయన్స్ డీడ్‌ల పంపిణీని ఈ నెల 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు వినూత్న పద్ధతులను సూచించాలని ఆమె కలెక్టర్లనుకోరారు. మరో 40 రోజుల్లో ప్లాంటేషన్ ప్రారంభం కానున్నదనీ, మొక్కలు అందుబాటులో ఉన్నందున ఈ ఏడాది లక్ష్యాన్ని సులభంగా అధిగమించవచ్చని చెప్పారు. జిల్లాల్లో డీఏపీ, యూరియా తదితర ఎరువులు సరిపడా సరఫరా అయ్యేలా చూడాలనీ, స్టాక్‌ను పరిశీలించి రిటైల్ గోడౌన్లకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీఎస్‌పీఎస్సీ పోటీపరీక్షల నిర్వహణపైనా చర్చించారు.

సమావేశంలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వీ, రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, మున్సిపల్ పరిపాలనా శాఖ సంచాలకులు సత్యనారాయణ, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీదేవి, పౌరసరఫరాల శాఖ కమీషనర్ అనిల్ కుమార్, ప్రత్యేక అధికారి సీసీఎల్ఏ ఆశిష్ సాంగ్వాన్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీ బాయి, ఆయిల్ ఫెడ్ ఎండీ సురేందర్ రెడ్డి, డైరెక్టర్ ఫుడ్ ప్రాసెసింగ్ అఖిల్ పాల్గొన్నారు.



రానున్న రెండు మూడేండ్లలో వేల ఉద్యోగాలు

- మహబూబ్‌నగర్ ఐటీ టవర్ ప్రారంభోత్సవంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- ఐటీ కారిడార్ ఏర్పాటుతో మారనున్న జిల్లా ముఖచిత్రం
- అమర రాజా కంపెనీ ఆధ్వర్యంలో
- 9500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న లిథియం ఫ్యాక్టరీకి శంకుస్థాపన

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న రెండు మూడేండ్లలో వేల ఉద్యోగాలు కల్పించనున్నామని, ఐటీ కారిడార్ ఏర్పాటుతో మహబూబ్‌నగర్ ముఖచిత్రం మారిపోతుందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ సమీపంలోని దివిటిపల్లి వద్ద 40 కోట్ల రూపాయలతో నిర్మించిన ఐటీ టవర్‌ను కేటీఆర్ ప్రారంభించారు. అంతేకాక జాతీయ రహదారి నుంచి ఐటీ టవర్ వరకు నిర్మిస్తున్న 100 ఫీట్ల వెడల్పు కలిగిన రహదారిని, పనులను ప్రారంభించారు. అదేవిధంగా 9500 కోట్ల పెట్టుబడితో ఐటీ కారిడార్ వద్ద అమరరాజా కంపెనీ ఏర్పాటు చేయబోయే అతిపెద్ద లిథియం ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ వలసలు, కన్నీళ్ళకు మారుపేరైన మహబూబ్‌నగర్ జిల్లాలో లిథియం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు అమరరాజా గ్రూపు ముందుకురావడం సంతోషమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. దేశంలో 80 కోట్ల మంది యువత ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదన్నారు. ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో పరిశ్రమలు, ఐటీ కంపెనీలకు ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. హైదరాబాదులో ఐటీ ప్రారంభం చేసినప్పుడు 3,20,000 మందికి పని కల్పిస్తే ఇప్పుడు 10 లక్షల మంది పనిచేస్తున్నారని తెలిపారు. అమరరాజా కంపెనీ మొదటి సంవత్సరంలో 3000 కోట్ల రూపాయలతో లిథియం ఫ్యాక్టరీలో పెట్టుబడి పెడుతుందని, దశలవారీగా పెట్టుబడి పెంచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ బ్యాటరీ పరిశ్రమ ద్వారా ఎలాంటి కాలుష్యం ఉండదని చెప్పారు. ఇది లిడ్ ఆసిడ్ పరిశ్రమ కాదని, లిథియం ఫ్యాక్టరీ అని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దివిటిపల్లి వద్ద ఐటీ టవర్ ప్రారంభం జిల్లాలో మరచిపోలేని రోజన్నారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా వాసులు పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్లేవారని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేకుండా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఐటీ కోసం మహబూబ్ నగర్ జిల్లాలో 400 ఎకరాలు కేటాయించామన్నారు. అమరరాజా కంపెనీ అతిపెద్ద లిథియం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం పట్ల ఆయన వారిని అభినందించారు. అలాగే 8 కంపెనీలు ఐటీ కారిడార్‌లో వారి యూనిట్లో నెలకొల్పేందుకు ఒప్పందం చేసుకున్నట్టు మంత్రి తెలిపారు. ఇందులో అమెరికా కంపెనీ కూడా ఒకటి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో అమరరాజా కంపెనీ కో- ఫౌండర్ గల్లా అరుణకుమారి, కంపెనీ ఫౌండర్ డా. రామచంద్ర నాయుడు, ఏపీ ఎంపీ గల్లా జయదేవ్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నే శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్, టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు సి.లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జైపాల్ యాదవ్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, గోరేటి వెంకన్న కసిరెడ్డి నారాయణరెడ్డి, పరిగి శాసనసభ్యులు మహేష్‌రెడ్డి, జిల్లా ఎస్పీ కే. నరసింహ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రయాణీకుల సౌకర్యార్థం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్ నెంబర్ పదిలో హోలిస్టిక్ హాస్పిటల్స్ సౌజన్యంతో అత్యవసర వైద్య సేవ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీ వెంకటేశ్వర్లు దీన్ని ప్రారంభించారు. సికింద్రాబాద్ డివిజన్ డివిజినల్ రైల్వే మేనేజర్ అభయ్‌కుమార్ గుప్తా, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలా రాజారామ్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రదీప్‌కుమార్ సింగ్ రాథోడ్, హోలిస్టిక్ హాస్పిటల్స్ చైర్మెన్ డాక్టర్ వీఎస్ రామచంద్ర, డాక్టర్ తుషారా రామచంద్ర, లయన్ వేణుగోపాల్, 108 సర్వీసెస్ మాజీ సీఈఓ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. హోలిస్టిక్ హాస్పిటల్స్ (లయన్స్ క్లబ్) ఈ అత్యవసర వైద్య కేంద్రాన్ని రెండేండ్లపాటు ఉచితంగా నిర్వహిస్తుందని తెలిపారు. రైలులో ప్రయాణించే ప్రయాణీకులు తమ వద్ద వున్నా పీఎన్ఆర్ నంబర్‌తో అత్యవసర వైద్య సహాయం పొందవచ్చనీ, ఈ సేవలు పూర్తిగా ఉచితమనీ, అత్యవసర సేవలకు 24 గంటలు అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

- సీఎంకు చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. 'గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించే బదులుగా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీల నియామకం కోసం నాలుగేండ్ల ప్రొబేషన్ కాలం పూర్తి చేసిన తరువాత వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు ప్రకటించారు. వీరిని 2022 ఏప్రిల్ 11 వరకు ప్రొబేషన్ కాలం పూర్తి అయిన వారిని క్రమబద్ధీకరిస్తామంటూ నోటిఫికేషన్‌లో వివరించారు.ఆ తరువాత ప్రొబేషన్ పిరియడ్‌ను మరో ఏడాది పెంచారు. 2023 ఏప్రిల్ 11 వరకు గడువు పూర్తవుతుంద'ని తెలిపారు.

ఆ తరువాత ప్రొబేషనల్ కాలాన్ని పూర్తి చేసి రెగ్యులరైజేషన్ చేస్తారనే ఆశతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎదురు చూస్తున్నారని చాడా పేర్కొన్నారు. ఇప్పటివరకు వారి ఉద్యోగాలు క్రమబద్ధీకరించకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైతున్నారని తెలిపారు. కొంతమంది విధి నిర్వహణలో మృతి చెందారని గుర్తుచేశారు. ఆయా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలనీ, నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా జూనియర్ పంజాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించటానికి జీవోను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా మార్చి రెగ్యులర్ చేయాలని కోరారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని తెలిపారు.

ఉచిత ఐఐటీ, నీట్ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మొదటి ప్రయత్నంలోనే ఐఐటీ-నీట్ సాధించడమెలా అనే అంశంపై మే 14 నుంచి 18 వరకు ఐదు రోజుల పాటు ఉచిత అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ దోమలగూడలోని మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉచిత అవగాహనా తరగతుల పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ అవగాహనా తరగతుల్లో సిలబస్, పరీక్షా విధానం, మెంటర్షిప్, టెస్ట్ సిరీస్, ఒత్తిడిని జయించడం ఎలా? అనే అంశాలతో పాటు రైటింగ్ స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్ తదితర అంశాలుంటాయని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్, హాస్టల్ వసతి తదితర వివరాలకు 85229 58575, 70322 64910 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాకు ఊహ తెలిసినప్పటి నుండి నాన్న పాటలింటూ పెరిగాను. నాన్నతో అప్పడప్పుడూ స్వరం కలిపే వాణ్ణి. అలా పాట బాట పట్టాను. ఏసుదాస్ గారి గొంతంటే నాకెందుకో చెప్పలేన్నంత ఇష్టం. ఆయననే నా గురువుగా భావించాను. ఆయన పాటలు వింటూ పాడటం నేర్చుకున్నాను.



పాటంటే అతనికి ప్రాణం. చిన్నప్పటి నుంచి స్వరాలతో కాలక్షేపం చేస్తూ పెరిగాడు. సరిగమలతో సహవాసం చేస్తూ, పదనిసలతో పరుగులు తీస్తూ పాటతో దోస్తానా చేస్తున్నాడు. ఆ సోపతే నేడు అతడ్ని ప్రొఫెషనల్ నేషనల్ సింగర్ గా నిలిపింది. మాటలను పాటలుగా పాడేయగల మధుర గాయకుడు.. సుప్రసిద్ధ గాయకుడు ఏసుదాస్ ని రోల్ మోడల్ గా భావించాడు అనే కంటే ఆయనకు ఏకలవ్య శిష్యుడంటే సరిగా సరి పోతుంది. సంగీతం లో సరిగ మలు తెలియవు. మెలకువలు నేర్పిన గురువులు లేరు. ఓ పాటను శ్రద్ధగా వింటే చాలు. గాయకుడె వరైనా గొంతును ఇట్టే అనుకరించగల నేర్పరి. కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన యాదగిరి అజయ్ కుమార్. గాత్రంలో శిక్షణ తీసుకోకుండానే ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నాడు. తన గాత్రంతో హృదయాలను కొల్ల కొడుతూ.. పాట బాట పట్టి.. నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపైన పాడుతూ 'వాయిస్ ఆఫ్ ఏసుదాస్' అవార్డు అందుకున్న యాదగిరి అజయ్ ఏసుదాస్ పరిచయం అతని మాటల్లోనే...

అజయ్... వాయిస్ ఆఫ్ ఏసుదాసు...

మాది ఖమ్మం జిల్లా పల్లిపాడు. అమ్మా నాగ పుష్పలత, నాన్న వేంకటేశ్వర్లు. మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ఊరూర తిరిగి బండిపై బట్టలు అమ్ముతారు. అంతే కాదు నాన్న మంచి గాయకుడు. నాకు ఊహ తెలిసినప్పటి నుండి నాన్న పాటలింటూ పెరిగాను. నాన్నతో అప్పడప్పుడూ స్వరం కలిపే వాణ్ణి. అలా పాట బాట పట్టాను. ఏసుదాస్ గారి గొంతంటే నాకేందుకో చెప్పలేన్నంత ఇష్టం. ఆయననే నా గురువుగా భావించాను. ఆయన పాటలు వింటూ పాడటం నేర్చుకున్నాను. కొన్ని స్టేజ్ షోలు చేశారు. అయ్యప్ప పాటలు సొంతంగా రాసి పాడేవాణ్ని. అలా నేను రాసిన అయ్యప్ప పాటలుకొన్ని విడుదలయ్యాయి. 'తత్వమసి పోరుడే అనే నేను రాసిన పాట గతేడాది నవంబర్ నుంచి నిత్యం శబరిమల సన్నిధానంలో సుప్రభాతం తర్వాత వినిపిస్తుండటం నాకు గొప్ప అదృష్టం. అదే విధంగా కొన్ని సినిమా పాటలు పాడాను. ఇప్పుడు కొన్ని ప్రయివేట్ ఆల్బమ్స్ చేస్తున్నాను. 'వాయిస్ ఆఫ్ ఏసుదాస్' అనే అవార్డ్ గెలిచి, తన పేరు పక్కన ఏసుదాస్ అనే పేరుని సాధించి'అజయ్ ఏసుదాస్'ను అయ్యాను.



సత్కారాలు - అవార్డ్స్

- నేషనల్ కాంపిటీషన్లో ప్రథమ స్థానంలో నిలిచి 'వాయిస్ ఆఫ్ ఏసుదాస్' టైటిల్
- రెండవ నేషనల్ కాంపిటీషన్ లోనూ మొదటి స్థానంలోనే నిలిచి 'కింగ్ ఆఫ్ ఎమోషనల్ సాంగ్స్' టైటిల్
- మూడవ నేషనల్ సింగింగ్ కాంపిటీషన్లో కూడా మొదటి స్థానంలో నిలిచారు.
- నాలుగవ నేషనల్ సింగింగ్ కాంపిటీషన్లో కూడా మొదటి స్థానంలో నిలిచి 'స్టార్ ఆఫ్ రొమాంటిక్ సాంగ్స్' ఇంటర్నేషనల్ సింగింగ్ కాంపిటీషన్లో పాల్గొనడానికి అర్హత సాధించాడు.



వైరాలో ఠాగూర్ విద్యాలయంలో హైస్కూల్ విద్య, క్రాంతి జూనియర్ కళశాలలో ఇంటర్ పూర్తి చేశాను. డిగ్రీ ఖమ్మం కవిత మెమోరియల్ కళాశాలలో డిఎడ్ విద్య బ్రౌన్స్ కళాశాలలో పూర్తి చేశాను. ఓ ప్రముఖ టెలివిజన్ విజయవాడలో నిర్వహించిన పోటీల్లో ఉభయతెలుగు రాష్ట్రాల నుండి 3600 మంది పాల్గొన్నారు. అందులోనూ ప్రతిభ చాటాను. మరో జాతీయ టీవి చానల్ హైదరాబాద్ లో నిర్వహించిన పోటీల్లో 3800మందితో పోటిపడి ప్రథమస్థానంలో నిలిచాను. స్టార్ భారత్ టీవి నిర్వహించిన సింగింగ్ కాంపిటీషన్ విజేతగా నిలిచి 'వాయిస్ ఆఫ్ ఏసుదాస్ టైటిల్ సాధించాను. ఆ తరువాత వివిధ పోటీల్లో అనేక మంది ప్రశంసలందుకున్నాను. 'జూనియర్ బాలసుబ్రహ్మణ్యం అంటూ న్యాయనిర్ణేతల మరో టైటిల్ నాకు ఇచ్చారు. ఇంతా నిజమేనా అని అనిపిస్తోంది. నా వింతగాథ వినుమా అనే లఘు చిత్రాన్ని తీశాడు. టీవీ సీరియల్స్‌కు కూడా పాటలు పాడుతున్నాడు.

సామాజిక సేవలోనూ...

అజయ్ కుమార్ గాత్రంతో పాటు సామాజిక సేవలోనూ ముందున్నాడు. ప్రతి మూడు నెలలకు ఒకసారి తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేస్తున్నాడు. గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటాడు. సామాజిక కార్యక్రమాల్లో తన వంతు సాయంగా పాటలు పాడేందుకు ముందు వరసలో నిలుస్తాడు.

అజయ్ తన ప్రయాణం మరింత వేగవంతంగా ముందుకు తీసుకువెళ్తూ ఎన్ని అడ్డంకులు వచ్చిన పాటను మాత్రం వదిలిపెట్టకుండా ప్రముఖ గాయకులలో ఒకరిగా నిలవాలని ఆశిస్తున్నాను. అదే విధంగా జరగబోయే ఇంటర్నేషనల్

భవిష్యత్తు ప్రణాళిక...

కాంపిటీషన్లో కూడా విజేతగా నిలిచి విదేశాలలో కూడా తన పాటలను పరిచయం చేయాలని అనుకుంటున్నాను. ఇటీవలే తిరునగరి శరత్ చంద్ర రాయగా అజయ్ పాడిన 'చూశాను నిన్ను నేను ఈ క్షణం' అనే పాట ఎంతోమంది శ్రోతల ఆదరాభిమానాలను పొందింది. త్వరలో 'అందాల చెలియా' అనే మరో సెన్సేషనల్ హిట్ సాంగ్ తో ముందుకు రాబోతున్నాడు. ఎఆర్ రెహమాన్ ప్రశంసలు అందుకుని అమితాబ్ బచ్చన్, అమీర్ ఖాన్ నటిస్తున్న చిత్రంలో రెండు పాటలు పాడే అవకాశాన్ని పొందాడు. లఘు చిత్రాలను కూడా తీస్తున్నాడు. రెండు తెలుగు సినిమాలకు మాటలు కూడా అందించనున్నాడు.



అనంతోజు మోహన్‌కృష్ణ







పేరుకుపోయిన జీవితాలలో
వెలుగునింపని వాళ్ళు
పెట్టుబడిదారుల కబంధ హస్తాలలో
కార్మికుల శ్రమతో పబ్బం గడుపుతూ
దినసరి వేతనరాయితీలతో కోత విధిస్తూ

కార్మికుల ఐక్యత మేడే

శ్రమ దోపిడీ అరికట్టలేని పాలకుల చేతిలో
బందీలు అవుతూ
అన్నం పెట్టే రైతు నుంచి
కుదు గుడ్డాలేని కార్మికుల వెట్టి చాకిరి
దారిద్రాన్ని అలమటిస్తూ
రేయనక పగలనక
కష్టపడి గొడ్డుసాకిరి చేస్తూ
పేదరికం అవిచ్ఛిన్నంతో
ఆర్థిక అసమానతలు లేని
ఎన్నో కార్మికుల జీవితాలు
సతమతమవుతున్నాయి

ఆదాయ వ్యాయాలలో
మార్పు లేనంత కాలం
కష్టించే శ్రమపడిన
కార్మికుల సొమ్మును దోచుకునే
శ్రమ నిర్వీర్యం అవుతుంది

అగాధాలలో చిక్కుకున్న
అప్పుల ఊబితో
విష నగ్నమైన చెల్లుబాటు కానీ
అగోచార వేదన వెక్కిరిస్తుంది

శ్రమ బానిసత్వం ముడిపడి ఉన్న
కడు పేదల కార్మికుల
విలసిల్లిన జీవితం ఒకటి
కాటుకి దగ్గరలో
శ్రమను దోచుకున్న తరుణంలో
పెట్టుబడిదారుల హృదయాల్లో
కార్మికుల మరణాలు
వారి జీవనానికి అస్త్రాలు

కనీస పనికీ
కనీస వేతనాలు అమలు లేని
కార్మికులందరినీ ఐక్యం చేస్తూ
ఉద్యమానికి సంసిద్ధమవుతూ
కార్మికుల ఐక్యత మేడే
ప్రణమిల్లాలి
ఎర్రనిక్రాంతి వెలుగులు వర్ధిల్లాలి

- బూర్గు గోపికృష్ణ, 7995892410



నేను అలుగుతానంతే..!

ప్రేమలేఖలు
Voice Of Love

డియర్,

ప్రతి క్షణం కేవలం నీకోసం మాత్రమే ఆలోచించాలనిపిస్తుంది. నీ తలపు నాకు తెలియని ఆనందం. నీతో నేరుగా చెప్పలేని ఎన్నో మధురానుభూతులను ఇలా రాస్తున్నా. ఇది ప్రేమ లేఖ అవునో కాదో నాకు తెలియదు కానీ, ఇదే నా తొలి ప్రేమలేఖ. నవ్వు నన్నూ - నేను నిన్ను ప్రేమించుకునంతగా ఎవరు ఎవరిని ప్రేమించలేరేమో. ప్రేమించినా కూడా అది మన ప్రేమ అంత గొప్పది కాలేదేమో. అది గొప్పది అన్నా కూడా నేను ఊరుకోనుగా ! నీతో గొడవ పడినట్టే వాళ్ళతోనూ గొడవ పడతాను. అసలు నన్ను ఎందుకు ప్రేమిస్తున్నావు ? ఎప్పుడూ అడగకు. ఎందుకంటే దానికి నాదగ్గర సమాధానమే లేదు.

అయినా, అందమైన నీ మోము, హాయిగొలిపే నీ చిరునవ్వు, స్వచ్ఛమైన మనసు ఇంత కంటే నాకు ఇంకేమి కావాలిచెప్పు? నీలో నన్ను ఇట్టే కట్టిపడే మరోవిషయం కూడా ఉంది? అదేంటో తెలుసా డియర్? నీ మనోధైర్యం. నా ప్రశ్నలన్నిటికి నువ్వే సమాధానం. నిత్యం సమస్యలతో సతమతం అవుతున్న నన్ను- నేనుగా తీర్చుకునేల చేసేది నువ్వే కదా! నన్ను ఆనందంగా భరిస్తావు. ఆప్యాయంగా దగ్గర తీసుకుంటావు. అమ్మలా ప్రేమను పంచుతావు. నాన్నలా వెన్నంటి నిలుస్తావు. ఇవి చాలదా నిన్ను ప్రేమించడానికి. అవును, ఇవే నా ప్రేమకి అర్హతలు. నేనే కాదు - నువ్వు కుడా నన్ను నాలాగే ప్రేమిస్తునావు. నాకంటే ఎక్కువే ప్రేమిస్తునావు అనుకో.

నాకింకా గుర్తుంది. నా ఎడుపుతో నిన్ను ఎన్నో సార్లు ఇబ్బంది పెట్టాను. అయినా నన్ను నన్నుగానే భరించావు తప్ప. నన్ను వదిలించుకునే ప్రయత్నం చేయలేదు. నేను ఎప్పుడయినా ఎలాగైనా నీతో ఉండొచ్చు. ఏ క్షణమైనా నిన్ను విసిగించేయొచ్చు. ఎందుకంటే మన ప్రేమకి ఏ హద్దులు లేవుగా ! నా సుఖాలనే కాదు నా కష్టాలను కుడా స్వీకరిస్తావు. రోజుకోసారి I LOVE YOU చెప్పమని నేను అడిగిన ప్రతిసారి, నీ నుంచి వచ్చింది ఒకటే సమాధానం. 'ప్రేమంటే పెదవులు పలికే I LOVE YOU శబ్దం కాదు. మనసుకు నచ్చేలా మసులు కోవడం' అదే ప్రేమ అంటావు. 'రోజు షికారులకి వెళ్తేనో, గిప్టులు ఇచ్చుకుంటేనో, ఐ లవ్ యూ చెబితేనే ప్రేమంటారా? అయితే అది నా దృష్టిలో నకిలీ ప్రేమే ! అలా అనుకోవడం కూడా నేరమే అంటావు. రోజు ప్రత్యేకంగా కలుసుకోము. కలుసుకోవడమేంటి? అసలు దూరంగా ఉంటేనేగా కలుసుకునేది.

ఇదిగో ఇంత స్పష్టత నీకుంది కాబట్టే, నన్ను నీలా మార్చుకుంటు న్నావు. అందుకే మనలా ఎవ్వరు ఉండలేరు. అన్నట్టు చెప్పడం మరిచిపోయా, అప్పుడప్పుడూ నేనే అలిగేది నీ చేతి ముద్దలు తినడానికే అన్న నిజంగా నీకు తెలియదుగా. . .

నీ ప్రియమైన...
రాక్షసి ...!



రోజుకోసారి ఐ లవ్ యూ చెప్పమని నేను అడిగిన ప్రతిసారి, నీ నుంచి వచ్చింది ఒకటే సమాధానం. 'ప్రేమంటే పెదవులు పలికే ఐ లవ్‌యూ శబ్ధం కాదు. మనసుకు నచ్చేలా మసులుకోవడం' అదే ప్రేమ అంటావు. 'రోజు షికారులకి వెళ్లితేనో, గిప్టులు ఇచ్చుకుంటేనో, ఐ లవ్ యూ చెబితేనే ప్రేమంటారా? అయితే అది నా దృష్టిలో నకిలీ ప్రేమే ! అలా అనుకోవడం కూడా నేరమే అంటావు. రోజు ప్రత్యేకంగా కలుసుకోము. కలుసుకోవడమేంటి? అసలు దూరంగా ఉంటేనేగా కలుసుకునేది.